




# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 136 ఆదివారం 4 జనవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




# వెనెజులాపై అమెరికా దాడి

## తీవ్రంగా స్పందించిన ఐక్యరాజ్యసమితి

**వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసిన అమెరికా**

**సైనిక స్థావరంపై దాడి చేసి మదురో దంపతులను బంధించిన యూఎస్ దళాలు**

**అమెరికా చర్యపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన, అభ్యంతరం**

**ఇది ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుందని హెచ్చరించిన యూఎన్ చీఫ్**

**నార్కో టెర్రరిజం కేసులో మదురోను న్యూయార్క్‌కు తరలిస్తున్న అమెరికా**

3

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బందీగా పట్టుకోవడంపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా చేపట్టిన ఈ సైనిక చర్య ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుందని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ హెచ్చరించారు. ఈ పరిణామం అంతర్జాతీయ చట్టాలను గౌరవించకపోవడమేనని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.



# ఈసారి 225

## నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మళ్లీ కదలిక

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మళ్లీ కదలిక మొదలవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. 2026 నాటికి నియోజకవర్గాల పునర్విభజన ఖాయమనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడే ఈ ప్రక్రియ జరగాల్సి ఉంది. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రం విడిపోయి నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన సందర్భంలో పాలనా వికేంద్రీకరణ అవసరమని స్పష్టంగా పేర్కొన్నారు. దానికి అనుగుణంగా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని విభజన చట్టంలోనే పొందుపరిచారు. అయినా, పదేళ్లు గడిచినా నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.

**జనగణన, మహిళా రిజర్వేషన్ బిల్లు కొలిక్కి వస్తుండంతో పునర్విభజనకు మార్గం సుగమం**

**రాష్ట్రంలో అదనంగా 50 అసెంబ్లీ నియోజకవర్గాలు**

**2026 నాటికి పునర్విభజన కార్యరూపం దాల్చవచ్చని అంచనా**

**అసెంబ్లీ సీట్లు పెరగనుండటంతో రాజకీయ వర్గాల్లో నూతనోత్సాహం**

**అమరావతి:** రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలు కేటాయించారు. తెలంగాణకు 117 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాలు వచ్చాయి. అయితే అప్పటి నుంచి జనగణన జరగకపోవడం, మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం ఆలస్యం కావడం వంటి కారణాలతో

మిగతా 2 లో



## పెట్టుబడుల ఊపు కొత్త సంవత్సరానికి బలం

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఊపు కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టమని పేర్కొన్నారు. పాలసీ సంస్కరణలతో పెట్టుబడిదారుల్లో

మిగతా 2 లో



# సర్వం సిద్ధం

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో నేడే తొలి టెస్ట్ ఫ్లైట్

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులతో ప్రత్యేక విమానం ఢిల్లీ నుంచి రాక**

**95 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు**

**2026 జూన్ నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రణాళిక**

**ప్రపంచంలోనే అతిపెద్ద MRO యూనిట్ ఏర్పాటుకు జీఎంఆర్ గ్రూప్ సంకల్పం**

**అమరావతి :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. విజయనగరం జిల్లాలోని భోగాపురంలో నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ కోసం సర్వం సిద్ధమైంది. జనవరి 4వ తేదీ, ఆదివారం ఉదయం 11 గంటలకు ఈ చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డైరెక్టరేట్

మిగతా 2 లో

## భోగాపురం విమానాశ్రయం ఘనత జగన్‌దే

జగన్ కష్టాన్ని తన ఖాతాలోకి వేసుకునే ప్రయత్నాన్ని చంద్రబాబు చేస్తున్నారు

**ఉత్తరాంధ్ర ప్రజల కలను నిజం చేసిన నాయకుడు జగన్**

**ఇప్పుడు తొలి ఫ్లైట్ ల్యాండింగ్‌కు ఏర్పాట్లు : గుడివాడ అమర్నాథ్**



2

# కొండగట్టు పునర్జన్మనిచ్చింది



**అంజన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా**

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**జగిత్యాల :** ఏపీ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కల్యాణ్‌శనివారం ఉదయం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ. 35.19 కోట్ల

మిగతా 2 లో

## పోటీచేయడం అలవాటు చేసుకోవాలి

**గెలుపోటములు సహజమైనవని గుర్తించాలి**

**కార్యకర్తలతో భేటీలో పవన్ కళ్యాణ్**

2

## ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

### ఎదురు కాల్పుల్లో 12మంది నక్సల్స్ హతం



3

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసు కున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు.



# వైసీపీ హయాంలో డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఏపీ

**దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా మూలాలు ఇక్కడే**

**కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం :** వైసీపీ హయాంలో ఏపీ డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఉండేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో గిరిజనులను బలిపశువులను చేశారని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా

మిగతా 2 లో

## డ్రగ్స్ తీసుకున్న ఎమ్మెల్యే కుమారుడు

**పోలీసు తనిఖీల్లో పట్టుబడ్డ సుధీర్ రెడ్డి**




మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# ఈసారి 225

మొదటి పేజీ తరువాయి

పునర్విభజన ముందుకు సాగలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సంకేతాల ప్రకారం జనగణనతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వచ్చిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలనే ఆలోచన ఉంది. ఈ రెండు కీలక అంశాలు త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉండటంతో 2026లో పునర్విభజన అనివార్యమనే అభిప్రాయం బలపడుతోంది. ఈ ప్రక్రియ అమలులోకి వస్తే ఏపీలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం 25 పార్లమెంట్ స్థానాల పరిధిలో ఒక్కో లోక్‌సభ స్థానం కింద ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పునర్విభజన తర్వాత ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో మరో రెండు అసెంబ్లీ స్థానాలు పెంచాలనే ప్రతిపాదన ఉంది. అలా జరిగితే మొత్తం 50 కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడే అవకాశముంది. దాంతో రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 225కు చేరనుంది. కేంద్రం యోచన ప్రకారం 2025లో జనగణన పూర్తయ్యాక వెంటనే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి, 2026 ద్వితీయార్థంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభించాలని భావిస్తోంది. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసి కొత్త నియోజకవర్గాల్ని ప్రకటించాలనే ఉద్దేశం ఉంది. ఈ పరిణామాలపై రాజకీయ పార్టీల్లో, ముఖ్యంగా నాయకులు, ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీలో టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు ప్రధాన రాజకీయ శక్తులుగా ఉన్నాయి. అధికార కూటమిలో టీడీపీతో పాటు బీజేపీ, జనసేన ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ కొనసాగుతోంది. అన్ని పార్టీల్లోనూ ద్వితీయ శ్రేణి నాయకులు, కొత్త నేతలు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. పునర్విభజనతో 50 కొత్త అసెంబ్లీ స్థానాలు వస్తే, ఈ ఆశావహులకు అవకాశాలు మరింత పెరుగుతాయని భావిస్తున్నారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఏపీ రాజకీయ వర్గాల్లో ఉత్సాహం కనిపిస్తోంది. 2026 నాటికి ఇది కార్యరూపం దాల్చుతుందనే అంచనాలతో నేతలు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




## పెట్టుబడుల ఊపు కొత్త సంవత్సరానికి బలం

మొదటి పేజీ తరువాయి

విశ్వాసం పెరిగిందని తెలిపారు. దేశీయ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడం ప్రజలకు శుభవార్త అన్న ఆయన.. ముందుచూపుతో అమలు చేస్తున్న పాలసీ సంస్కరణల ప్రభావం ఇదని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమాల ద్వారా పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రోత్సాహకాల పంపిణీలో పారదర్శకత కోసం ఎస్క్రో ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టామని వెల్లడించారు. రంగాలవారీగా స్పష్టమైన విధానాలు అమల్లోకి తీసుకొచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకున్న ఇన్వెస్టర్లకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. విజన్‌పై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ బృందం చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఇది విజయానికి ముగింపుగా కాకుండా.. భవిష్యత్ అభివృద్ధికి పునాదిగా అభివర్ణిద్దామని పిలుపునిచ్చారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, స్థిరమైన వృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టిందని వెల్లడించారు.

## కొండగట్టు పునర్జన్మనిచ్చింది



మొదటి పేజీ తరువాయి

తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో భక్తుల వసతి కోసం 96గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి పవన్ కల్యాణ్ భూమి పూజ చేశారు. పవన్ కల్యాణ్ తోపాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'కొండగట్టు అంజన్న అంటే నాకు సెంటిమెంట్. అంజన్న ఆశీస్సులతోనే ప్రమాదం నుంచి బయటపడ్డ కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అభివృద్ధికి నా వంతు సాయం చేస్తా' అని పవన్ అన్నారు. గతంలో దర్శనానికి వచ్చిన ప్పుడు దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. అంజన్న ఆశీస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పవన్ అన్నారు. గిరి ప్రదక్షిణ అంశాన్ని నా దృష్టికి తెచ్చారు. కొండగట్టు గిరి ప్రదక్షిణకు సహాయం చేస్తామని పవన్ చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ కృతజతలు తెలిపారు. రేవంత్ రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని, ఆంజన్న ఆశీస్సులు ఆయనకు ఉండాలని పవన్ పేర్కొన్నారు.

## పోటీచేయడం అలవాటు చేసుకోవాలి

**గెలుపోటములు సహజమైనవని గుర్తించాలి.. కార్యకర్తలతో భేటీలో పవన్ కళ్యాణ్**

**జగిత్యాల :** జిల్లాలో నిర్వహించిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో గెలుపు,ఓటములు సహజమని, అయితే పోటీ చేయడం అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రాజకీయ జీవితంలో తనకు పోరాట పటిమ, చైతన్యం, తెగింపు అన్నీ తెలంగాణ నుంచే వచ్చాయని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. తెలంగాణ నేల తనకు పోరాడే ధైర్యాన్ని ఇచ్చిందని, ఈ ప్రాంత ప్రజల స్ఫూర్తే తనను ముందుకు నడిపించిందని చెప్పారు. అంజన్న సన్నిధి తనను కాపాడిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కష్టకాలాల్లో ఆధ్యాత్మిక బలం తనకు అండగా నిలిచిందని అన్నారు. ఓటమికి భయపడకుండా పోటీ చేసే మనస్తత్వం జనసేనలో పెరగాలని సూచించారు. పోటీ పడినప్పుడే అనుభవం వస్తుందని, ప్రజల మధ్య ఉండగలమని తెలిపారు. వ్యక్తిగతంగా ఎవ్వరూ తనకు శత్రువులు కాదని స్పష్టం చేసిన పవన్ కళ్యాణ్, తమ పోరాటం వ్యక్తులపై కాదని, పాలసీ ప్రకారమే జరుగుతుందని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, సరైన విధానాల కోసం మాత్రమే తాము రాజకీయాల్లో పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి జనసైనికుడిపై ఉందని అన్నారు. చివరగా వంద మైళ్ల ప్రయాణం కూడా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్న పవన్ కళ్యాణ్, జనసేన ప్రయాణం ఇప్పుడు బలంగా మొదలైందని, ముందున్న లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

## డ్రగ్స్ తీసుకున్న ఎమ్మెల్యే కుమారుడు

**పోలీసు తనిఖీల్లో పట్టుబడ్డ సుధీర్ రెడ్డి**

**హైదరాబాద్ :** నగరంలోని నానక్‌రామ్‌గూడలో శనివారం ఈగల్ టీమ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ సోదాల్లో బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో సుధీర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని చెక్ చేశారు. ఈ పరిశీలనలో సుధీర్‌రెడ్డికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. వెంటనే ఆయనని అరెస్ట్ చేసి, డీ-అడిక్షన్ సెంటర్‌కి తరలించారు. సుధీర్‌రెడ్డితో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం సుధీర్‌రెడ్డిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆయనకు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సుధీర్‌రెడ్డి డ్రగ్స్ కేసు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## వైసీపీ హయాంలో డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఏపీ

మొదటి పేజీ తరువాయి

దాని మూలాలు ఏపీలో ఉండేవని విమర్శలు చేశారు. ఆ పరిస్థితి మారాలని ఈ మహమ్మారిపై యుద్ధం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. శనివారం శ్రీకాకుళం ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు రామ్మోహన్ నాయుడు. ఏపీని ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంచడానికి చంద్రబాబు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారని చెప్పుకొచ్చారు. ఈ కృషిలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల పని తీరు వర్ణించలేనిదని కొనియాడారు. గతంలో పోలీసులను రాజకీయ వేధింపులకు వాడుకునే వారని విమర్శించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో పోలీసులకు శిక్షించడం మాత్రమే కాదని.. శిక్షణ ఇవ్వడం కూడా తెలుసు అనేలా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఒకప్పుడు పంజాబ్ వ్యవసాయానికి ప్రసిద్ధిగా ఉండేదని ప్రస్తావించారు. ఇప్పుడు పంజాబ్‌లో అడుగడుగునా డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని విమర్శించారు. పంజాబ్ రాష్ట్రం పూర్తిగా నాశనం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్‌లా ఏపీ మారకూడదనే తాము కంకణం కట్టుకున్నామని చెప్పుకొచ్చారు రామ్మోహన్ నాయుడు. గతంలో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో మన తల్లుల ఆవేదన చూశామని అన్నారు. తమకేం వద్దని.. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తే చాలని మన తల్లులు లోకేశ్‌ని కోరారని తెలిపారు. ప్రతీ ఇంట్లో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మన ఇంట్లోనే కాదని.. పక్క ఇంట్లో కూడా ఎవరైనా డ్రగ్స్ వాడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఒకరిని చూసి ఇంకొకరు నేర్చుకుంటారని అన్నారు. డ్రగ్స్ వాడకం కూడా అలాగే ఉంటుందని చెప్పుకొచ్చారు. సిగరెట్, డ్రగ్స్ వాడకం స్టైల్ కాదని.. నిజాయితీగా ఉండటం మాత్రమే అసలు సిసలైన స్టైల్ అని పేర్కొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనేది పిల్లల నినాదం కావాలని సూచించారు. శ్రీకాకుళం అంటే లేబర్ ప్రాంతం కాకూడదని తెలిపారు రామ్మోహన్ నాయుడు. శ్రీకాకుళం అభివృద్ధికి అడ్డా కావాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక ఫోకస్ పెట్టారని పేర్కొన్నారు. కేందప్రభుత్వం కూడా శ్రీకాకుళం అభివృద్ధికి సహాయం చేస్తోందని వెల్లడించారు. డ్రోన్స్ సాయంతో డ్రగ్స్ పంటలను గుర్తించామని తెలిపారు. డ్రగ్స్‌కి బదులు ఇప్పుడు మంచి పంటలు పండిస్తున్నామని వివరించారు. ఇచ్ఛాపురంలో చాలా కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇప్పుడు అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు యాత్ర నిర్వహించామని.. ఈ ముగింపు యాత్రను పోలీసులు చాలా గొప్పగా ఏర్పాటు చేశారని రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు.

## భోగాపురం విమానాశ్రయం ఘనత జగన్‌దే

మొదటి పేజీ తరువాయి



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన ఘనత పూర్తిగా మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ దేనని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసిన నాయకుడు జగన్ అని కొనియాడారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం అవసరమైన భూ సమీకరణ, భూ వివాదాల పరిష్కారం అన్నీ జగన్ హయాంలోనే జరిగాయని అమర్నాథ్ గుర్తుచేశారు. భూములు ఇచ్చిన రైతులు, బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో దాదాపు రూ.1,100 కోట్ల భారీ పరిహారాన్ని జగన్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇది గత ప్రభుత్వాలు చేయలేని పని అని వ్యాఖ్యానించారు. 2023 మే 3వ తేదీన భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు జగన్ శంకుస్థాపన చేశారని, 2025 డిసెంబర్ నాటికి తొలి విమానం ల్యాండ్ అయ్యేలా జీఎంఆర్ సంస్థకు స్పష్టమైన టార్గెట్ ఇచ్చారని తెలిపారు. అదే ప్రణాళికలో భాగంగానే ఇప్పుడు తొలి ఫ్లైట్ ల్యాండింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

అయితే ఎన్నికల ముందు ఉత్తరాంధ్ర ప్రజలను మభ్యపెట్టేందుకు 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు హడావిడిగా శంకుస్థాపన చేశారని అమర్నాథ్ ఆరోపించారు. మొత్తం 2,700 ఎకరాలు అవసరమైతే, చంద్రబాబు హయాంలో 250 ఎకరాలు కూడా సేకరించలేదని తీవ్ర విమర్శలు చేశారు. జగన్ చేసిన కష్టాన్ని, ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితాన్ని తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని అమర్నాథ్ మండిపడ్డారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనికి అసలు శిల్పి జగనేనని చెప్పారు.

# సర్వం సిద్ధం



మొదటి పేజీ తరువాయి

జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఉన్నతాధికారులతో కూడిన బృందం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడకు చేరుకోనుంది. జీఎంఆర్ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ విమానాశ్రయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే సుమారు 95 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు ధృవీకరించారు. వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించ డానికి ముందు విమానాశ్రయం సంసిద్ధతను అంచనా వేయడంలో ఈ ట్రయల్ రన్ అత్యంత కీలకం. ఈ కమర్షియల్ వ్యాలిడేషన్ ఫ్లైట్ ద్వారా రన్‌వే పటిష్టత, నావిగేషన్ సిస్టమ్స్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఈ ప్రక్రియను ఆపరేషనల్ రెడినెస్ అండ్ ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌ఫర్‌గా వ్యవహరిస్తారు.

### భవిష్యత్ ప్రణాళికలు, ప్రత్యేకతలు

సుమారు రూ.4,592 కోట్ల అంచనా వ్యయంతో 2,203 ఎకరాల విస్తీర్ణంలో ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించారు. దీనివల్ల బోయింగ్ 777, ఎయిర్‌బస్ ఏ380 వంటి భారీ విమానాలు సైతం సులభంగా రాకపోకలు సాగించగలవు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. 2026 జూన్ నాటికి వాణిజ్య విమాన సర్వీసులను ప్రారంభించి, ఆగస్టు కల్లా పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కేవలం ప్రయాణ సౌకర్యాలే కాకుండా, ఈ ప్రాంతంలో భారీగా ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గతంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. "స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం. ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు ప్రధానమంత్రి మోదీని ఆహ్వానిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, జీఎంఆర్ గ్రూప్ వ్యవస్థాపక ఛైర్మన్ జి.ఎం. రావు మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా, ఇక్కడ 500 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ ఏరోస్పేస్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇది ప్రపంచ ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీదారులను ఆకర్షిస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ యూనిట్‌ను ఏర్పాటు చేసి పూర్తిస్థాయి ఏరోస్పేస్ హబ్‌ను సృష్టిస్తాం" అని వివరించారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రతో పాటు, పొరుగున ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. అయితే, ఎయిర్‌పోర్ట్‌కు కీలకమైన విశాఖపట్నం-భోగాపురం ఆరు లేన్ల బీచ్ రోడ్ పనులలో జాప్యంపై కొన్ని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుసంధాన మార్గాలను త్వరితగతిన పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించారు.

## తెలుగు మహాసభలకు అంకురార్పణ

**శ్రీనివాస కళ్యాణంతో కార్యక్రమానికి శ్రీకారం**

**గుంటూరు :** మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు అంకురార్పణ జరిగింది. శనివారం ఉదయం శ్రీనివాస కల్యాణ కార్యక్రమంతో తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఇక నేటి నుంచి ఈనెల 5 వరకు మూడో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతు న్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా పలువురికి పురస్కారాలను అందజేయనున్నారు. ఐదు సువిశాల వేదికల్లో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభలకు గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరుకానున్నారు. ఆదివారం ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ పాల్గొననున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఒక దేశాధ్యక్షుడు రావడం ఇదే ప్రథమం. ఇక సోమవారం నాడు జరిగే మహాసభల్లో సీఎం చంద్రబాబు నాయుడు,మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొననున్నారు. ప్రముఖుల హాజరుతో ప్రపంచ తెలుగు మహాసభలు మరింత వైభవంగా సాగనున్నాయి.

## ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు బాసట

**అదనంగా 4వేల ప్రోత్సాహం ఇవ్వాలన్న మాధవ్**

**విజయవాడ :** ప్రకృతి వ్యవసాయం చేసే వారికి అదనంగా రూ.4 వేలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో శనివారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సహజ రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ విధానంతో మంచి దిగుబడి సాధించిన అన్నదాతలను మాధవ్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు మాధవ్. ప్రకృతి వ్యవసాయం చేసే వారి ఇబ్బందులు, కొత్త పద్ధతులు, ఆదర్శవంతమైన సాగుచేసే వారితో నేడు ఈ సదస్సు ఏర్పాటు చేశామని వెల్లడించారు పీవీఎన్ మాధవ్.ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా విజయవంతమైన రైతన్నల అభిప్రాయాలు, అనుభవాలు వివరించారని అన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. జాతీయ, ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఫసల్ భీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీ ఇచ్చేలా భరోసా ఇచ్చారని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం చేసే వారిని అన్నివిధాలా ప్రోత్సహించాలని సూచించారు. దేశంలో ముప్పై శాతం మంది ప్రకృతి వ్యవసాయం రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని అన్నారు. ఆర్థిక స్వావలంబన కావాలంటే ప్రకృతి వ్యవసాయ విధానమే మార్గమని చెప్పుకొచ్చారు పీవీఎన్ మాధవ్. ఇతర దేశాలపై ఆధారపడి యూరియా, పురుగు మందులు కొనే విధానం ఆగిపోవాలని సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. రైతు బజార్లలో కొన్ని స్టాల్స్‌ను పెడుతున్నారని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులతో ప్రత్యేకంగా సంతలు, రైతు బజార్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

కేంద్రం అమలు చేసే పథకాల గురించి అందరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరూ ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. ఈరోజు సదస్సులో చేసిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరిస్తామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

# వెనెజులాపై అమెరికా దాడి

**తీవ్రంగా స్పందించిన ఐక్యరాజ్యసమితి**


**వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసిన అమెరికా**

**సైనిక స్థావరంపై దాడి చేసి మదురో దంపతులను బంధించిన యూఎస్ దళాలు**

**అమెరికా చర్యపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన, అభ్యంతరం**

**ఇది ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుందని హెచ్చరించిన యూఎన్ చీఫ్**

**నార్కో టెర్రరిజం కేసులో మదురోను న్యూయార్క్‌కు తరలిస్తున్న అమెరికా**



వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బందీగా పట్టుకోవడంపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా చేపట్టిన ఈ సైనిక చర్య ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుందని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ హెచ్చరించారు. ఈ పరిణామం అంతర్జాతీయ చట్టాలను గౌరవించకపోవడమేనని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. శనివారం తెల్లవారుజామున అమెరికాకు చెందిన డెల్టా దళాలు వెనిజులాలోని ఒక సైనిక స్థావరంపై దాడి చేశాయి. ఈ ఆపరేషన్‌లో అధ్యక్షుడు మదురోతో పాటు ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఒక యుద్ధనౌకలో న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు అమెరికా అధికారులు తెలిపారు. మదురోపై న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో నార్కో-టెర్రరిజం ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ ఒక ప్రకటన విడుదల చేశారు. "అంతర్జాతీయ చట్టాలను, యూఎన్ చార్టర్‌ను అందరూ తప్పక గౌరవించాలి. కానీ ఇక్కడ ఆ నియమాలను ఉల్లంఘించడంపై సెక్రటరీ జనరల్ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ చర్య ఆ ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది" అని పేర్కొన్నారు. మానవ హక్కులు, చట్టబద్ధ పాలనను గౌరవిస్తూ చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని గుటెర్రస్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. మరోవైపు, మదురో అరెస్ట్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. "వారిని ఒక నౌకలో న్యూయార్క్‌కు తరలిస్తున్నాం. హెలికాప్టర్‌లో మంచి ప్రయాణం చేశారని అనుకుంటున్నా" అని ఫాక్స్ న్యూస్‌తో వ్యాఖ్యానించారు. మదురో డ్రగ్స్ వ్యాపారంలో పాలుపంచుకుం టున్నారని ట్రంప్ గత కొంతకాలంగా ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే.

# ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

## ఎదురు కాల్పుల్లో 12మంది నక్సల్స్ హతం

**రాయపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో పామ్లూరు గ్రామం సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు.. బీజాపుర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా.. గత ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మందికిపైగా మావోయిస్టులు మృతి చెందారు ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్ మృతి చెందినట్టు తెలుస్తోంది. సుక్మా జిల్లాలో తెల్లవారుజామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ స్థాయిలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నాయి. నక్సలైట్ల సంచారం ఉన్నట్టు సమాచారం అందడటంతో జిల్లాకు చెందిన రిజర్వ్ గార్డ్ పోలీసుల బృందం ఈ తెల్లవారుజామున రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే నక్సల్స్, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి

# అనంతలో ఘోర రోడ్డు ప్రమాదం

## రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి

**అనంతపురం :** అతివేగం ఇద్దరిని బలిగొంది. మడకశిర మండలంలోని అగ్రంపల్లి సమీపాన గురువారం అర్ధరాత్రి ఎన్‌హెచ్ 544 ఈ జాతీయ రహదారిపై వ్యాన్‌ను బొలెరో అతివేగంతో ఢీకొట్టడంతో డ్రైవర్లు మహమ్మద్ రఫిక్ (32), రఘురామ్(19) దుర్మరణం చెందారు. రెండువాహనాలు నుజ్జయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మడకశిర పట్టణంలోని వడ్రపాళ్యం ప్రాంతానికి చెందిన రఘురామ్ బొలెరో వాహనంలో గుడిబండ సంత నుంచి హిందూపురానికి పశువులను తీసుకెళ్లాడు. అక్కడ దించేసి తిరుగు ప్రయాణమయ్యాడు. కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన మహమ్మద్ రఫిక్ వ్యాన్‌లో పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమకు సంబంధించిన సామగ్రిని పుణెకి తీసుకెళ్లాడు. అక్కడ దించేసి కియకి తిరుగి వస్తున్నాడు. అగ్రంపల్లి వద్ద జాతీయ రహదారిపై వ్యాన్‌ను బొలెరో వాహనం అతివేగంతో ఎదురుగా వెళ్లి ఢీకొంది. ఇరు వాహనాల డ్రైవర్లు అక్కడికక్కడే మృతిచెందారు. బొలెరో వాహనంలోని భువనేశ్వర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రఘురామ్ తండ్రి శివానంద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రఘురామ్‌కు వివాహం కాలేదు. మహమ్మద్ రఫిక్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

# అమరావతిలో మంత్రులు, ఐఏఎస్, జడ్జిల నివాసాలు


## పూర్తి కావచ్చాయని ప్రకటించిన మంత్రి నారాయణ

**అమరావతి :** అమరావతి క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. నివాస భవనాల పనులు ఈ ఏప్రిల్‌లో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ఫ్లాట్లు నిర్మించబడుతున్నాయని చెప్పారు. వీటిలో 186 బంగ్లాలు ఉండగా, మిగతా 3,850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా రావడం వల్ల కొన్ని పనులు ఆలస్యం అయ్యాయని, అయితే ఇప్పుడు అన్ని నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మంత్రుల బంగ్లాలు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. జడ్జీల బంగ్లాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్ తుద దశకు చేరిందని.. అఖిల భారత సర్వీసు అధికారుల టవర్స్ కూడా తుది దశకు చేరాయని చెప్పారు. 500 నివాస సముదాయాలను మినహా, మిగతా భవనాలు మార్చి ముగింపు వరకు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అన్ని భవనాలు పూర్తైన తర్వాత జీఏడీకి హ్యాండ్ ఓవర్ చేస్తామని.. వారు కేటాయిస్తారని మంత్రి తెలిపారు. అలాగే అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ కోసం భూసేకరణ నోటిఫికేషన్ వచ్చే బుధవారం (జనవరి 7) ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంకా 4.5 ఎకరాలు భూమి రావాల్సి ఉందని, ఇందులో 2 ఎకరాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# బంగ్లాలో ఆగని మతోన్మాద దాడులు

## వరుస దాడుల్లో హిందువుల హతం

## తాజాగా మరో హిందూ వ్యాపారి మృతి



**ఢాకా, జనవరి 3:** బంగ్లాదేశ్‌లో మరో హిందువు బలయ్యడు..వరుస దాడులతో హిందువులు భయాందోళనలకు గురవుతున్నారు. బంగ్లాదేశ్‌లో మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. వరుసగా హిందువులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇటీవల ఖోకన్ చంద్ర దాస్(50) అనే వ్యాపారిపై కొందరు దుండగులు దాడి చేసి.. నిప్పంటించిన సంగతి తెలిసిందే. వారి నుంచి తప్పించుకునేందుకు నాడు చెరువులో దూకిన ఆయన.. తాజాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల దుకాణాన్ని మూసి ఆటోలో ఇంటికి బయలుదేరగా.. మార్గమధ్యలో కొందరు దుండగులు ఆటోను ఆపారు. పదునైన ఆయుధాలతో చంద్రదాస్‌పై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. వారి నుంచి తప్పించుకునేందుకు రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశారు. తర్వాత స్థానికులు ఆయనను కాపాడి.. ఆస్పత్రికి తరలించారు. తమకు శత్రువులు ఎవరూ లేరని, ఆయనపై ఎందుకు దాడి చేశారో తెలియదని ఖోకన్ భార్య సీమా దాస్ పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దీపూదాస్ హత్య జరిగింది. కొన్ని రోజులకు సామ్రాట్ అనే వ్యక్తి గ్రామస్థుల మూక దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం బజేంద్ర బిశ్వాస్ అనే మరో వ్యక్తిని సహోద్యోగి కాల్చి చంపాడు.

# 2029 నాటికి మూడేళ్లలోపే న్యాయం

## అమిత్ షా సంచలన ప్రకటన




**శ్రీ విజయపురం:** దేశవ్యాప్తంగా ఫోరెన్సిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో రూ. 30,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. శనివారం శ్రీ విజయపురంలో నిర్వహించిన పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, ఫోరెన్సిక్ ఫలితాల విశ్లేషణలో లిలిఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లిలిను వినియోగించనున్నట్లు తెలిపారు. దేశంలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను మిషన్ మోడ్‌లో పరిష్కరించడమే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నేరాల స్వభావం, సరళిని గుర్తించేందుకు త్వరలోనే లిలి'మోడస్ ఆపరేండి బ్యూరో'లిలిను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రత్యేకంగా 2029 నాటికి దేశంలో ఒక అత్యాధునిక న్యాయ వ్యవస్థను అమలు చేయనున్నామని, ఈ వ్యవస్థ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు అయిన దశ నుంచి సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు మొత్తం న్యాయ ప్రక్రియ మూడేళ్లలోపే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అమిత్ షా భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు ఏళ్ల తరబడి సాగుతున్న విచారణలు, న్యాయ ప్రక్రియలకు స్వస్తి పలికి బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. 2022 నుంచి అమలు చేస్తున్న న్యాయ, క్రిమినల్ చట్ట సంస్కరణలు ఇప్పటికే సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతికతను నేర పరిశోధన వ్యవస్థలో సమగ్రంగా ప్రవేశపెట్టి, భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నేర పరిశోధనా వ్యవస్థ కలిగిన దేశంగా తీర్చిదిద్దడమే ఈ భారీ పెట్టుబడి లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరించారు.

## ర్యాగింగ్, లైంగిక వేధింపులతో విద్యార్థిని మృతిపై

# యూజీసీ సీరియస్

**ఢిల్లీ:** సీనియర్ల ర్యాగింగ్, ప్రొఫెసర్ లైంగిక వేధింపుల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో ఓ విద్యార్థిని మృతి చెందడంపై తీవ్ర దుమారం రేగుతోంది. ఈ ఘటనను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) తీవ్రంగా పరిగణించింది. ఈ కేసుపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని ఆదేశించింది. ఇందుకుగాను ఒక నిజ నిర్ధరణ కమిటీని ఏర్పాటుచేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ధర్మశాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషాదకర ఘటనను తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని యూజీసీ సీనియర్ అధికారి తెలిపారు. ర్యాగింగ్ వల్లే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందనే మీడియా నివేదికల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అయితే, విద్యార్థినిది ఆత్మహత్య కాదని.. సాధారణ మరణం అని కళాశాల అధికారులు పేర్కొన్నట్లు వివరించారు. ఈ ఘటనపై పోలీసు విచారణ కొనసాగుతోందని.. యూజీసీ ఒక నిజ నిర్ధరణ కమిటీని ఏర్పాటుచేసిందన్నారు. దోషులను వదిలిపెట్టమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమన్నారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న బాధితురాలిపై ముగ్గురు సీనియర్ విద్యార్థినులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆమెపై దాడి చేశారు. మరోవైపు ప్రొఫెసర్ అశోక్‌కుమార్ ఆ విద్యార్థినిని లైంగికంగా వేధించేవాడు. దాడిలో గాయపడిన బాధితురాలు చికిత్స పొందుతూ.. డిసెంబరు 26న ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులను, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# రోడ్డు విస్తరణలో మా మామ ఇంటినే తొలగించాం

## కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ



**ఢిల్లీ:** పని విషయంలో తనకు అందరూ సమానమేనని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గతంలో ఒకసారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు అడ్డుగా ఉన్న తన సొంత మామ ఇంటినే తొలగించినట్లు వెల్లడించారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగ్‌లో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫరా తన కుక్ దిలీప్‌తో కలిసి దిల్లీలోని గడ్కరీ నివాసాన్ని సందర్శించారు. ఈ క్రమంలో గడ్కరీ తన సతీమణి కాంచన్‌తో కలిసి ఫరా ఖాన్ వ్లాగ్‌లో పాల్గొన్నారు. తమ గ్రామంలో రోడ్డు వేయాల్సిందిగా ఫరా ఖాన్ కుక్ దిలీప్ వ్లాగ్‌లో గడ్కరీని అభ్యర్థించాడు. దీంతో అతడి ఇంటి మీదుగా రోడ్డు వేయాలని ఫరాఖాన్ చమత్కరించారు. అక్కడే ఉన్న మంత్రి సతీమణి కాంచన్ మాట్లాడుతూ ఒక ఘటనను వెల్లడించారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉందని తన తండ్రి ఇంటినే కూల్చేశారని పేర్కొనడంతో అక్కడి వారు ఆశ్చర్యపోయారు. దీనిపై నితిన్ గడ్కరీ వివరణ ఇస్తూ.. గతంలో రోడ్డు విస్తరణ పనుల్లో సొంత మామ ఇంటినే కూల్చివేసినట్లు తెలిపారు. మరి తర్వాత కొత్త ఇల్లు కట్టించారా అని ఫరాఖాన్ అడగగా.. ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి అందించే పరిహారం మాత్రమే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వ్లాగ్‌లో తన జీవితంలోని పలు ఆసక్తికరమైన విషయాలను కూడా కేంద్రమంత్రి పంచుకున్నారు.

# రూ.20 వేలకే బిహార్ అమ్మాయిలు..

## మంత్రి భర్త వివాదాస్పద వ్యాఖ్యలు

**డెహ్రాడూన్:** బిహార్ అమ్మాయిలపై ఉత్తరాఖండ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి రేఖా ఆర్య భర్త గిరిధారి లాల్ సాహు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. రూ.20,000కే బిహార్ అమ్మాయిలు పెళ్లికి అందుబాటులో ఉన్నారని అల్మోరాలో జరిగిన ఒక కార్యక్రమంలో సాహూ అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతుండటంతో ఆర్జేడీ, కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు బీజేపీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. దీంతో తన వ్యాఖ్యలపై సాహు క్షమాపణలు చెప్పగా, ఆయనతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీజేపీ పేర్కొంది.

## మంత్రి భర్త ఏమన్నారంటే..?

'మీరు వృద్ధాప్యంలో పెళ్లి చేసుకుంటారా? పెళ్లి చేసుకోలేకపోతే మీ కోసం బిహార్ నుంచి అమ్మాయిని తీసుకొస్తాం. రూ.20,000 నుంచి రూ.25,000కే అక్కడి నుంచి అమ్మాయిలును తెచ్చుకోవచ్చు' అని సాహు అన్నారు. ఈ వీడియో వైరల్ కావడంతో వెంటనే సాహు స్పందించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, తన మిత్రుడి వివాహాన్ని మాత్రమే తాను ప్రస్తావించానని చెప్పారు. అయితే తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే తాను క్షమాపణ చెప్పుకుంటున్నానని తెలిపారు. సాహు చేసిన వ్యాఖ్యలు బీజేపీ నైజాన్ని చాటుతున్నాయని బిహార్‌లోని విపక్ష ఆర్జేడీ, ఉత్తరాఖండ్ కాంగ్రెస్ విమర్శించాయి. బీజేపీ నేతలు రూ.10,000తో మహిళల ఓట్లు కొని, ఇప్పుడు బీహర్ నుంచి రూ.20,000-25,000కు అమ్మాయిలను తెస్తామని చెబుతున్నారని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ మండిపడ్డారు. బిహార్ అన్నా, బిహార్ మహిళలన్నా బీజేపీ సపోర్టర్లకు ఇలాంటి విషపు ఆలోచనలే ఉంటాయన్నారు. దేశంలోని మహిళలను సాహు అవమానించారని, అధికార బీజేపీ క్షమాపణలు చెప్పాలని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ గోడియాల్ డిమాండ్ చేసారు. బిహార్ మహిళా కమిషన్ సైతం స్పందించింది. మహిళలపై చేసిన వ్యాఖ్యలకు



గాను సాహుకు నోటీసులు పంపుతామని బీఎస్‌డబ్ల్యూఎస్ చైర్‌పర్సన్ అప్సర తెలిపారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వంలో తన భార్య మంత్రిగా ఉండగా మహిళలపై ఇంత దారుణమైన వ్యాఖ్యలు చేయడం సాహు దివాళాకోరుతనాన్ని చాటుతుందని విమర్శించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# పులులతోనే అడవులకు మనుగడ!

పర్యావరణానికి పులలకు అవినాభావ సంబంధం ఉంది. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతిని విధ్వంసం చేస్తున్న ప్రజలు అడవులను, కొండలను ధ్వంసం చేయడంతో అక్కడక్కడా ఉన్న పులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి అంటూ పరుగెడుతున్నాయి. అడవులు చక్కగా ఉన్నంత కాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్య జంతుజాలంనకు అడవులే ఆవాసం. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యధేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరు కోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుషలను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మనుషులపై పడి కరుస్తున్నాయి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారాం పెరిగింది. అటవీ అధికారుల లెక్కల ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడోబాలో పులుల సంతతి పెరిగిపోవడం.. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెడుతున్నాయని, అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. పులుల సంచారం పెరగడంతో వీటు అప్రమత్తం అయ్యారు. స్థానికులు, వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ప్రత్యేక బృందాల ద్వారా గస్తీ కాస్తున్నారు. సోమశిల పరిధిలో ఓ పులి సంచారంతో యంగంపల్లితండా దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వైపు నుంచి కృష్ణా నదిని ఈదుకుంటూ వచ్చిన ఓ పెద్దపులి తమ ప్రాంతంలో సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టగా.. వ్యవసాయ పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. ఇకపోతే ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రకాశం జిల్లాలో ఓ పులి మృత్యువాత పడింది. సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులు దగ్గరగా ఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చే ఒకటో రెండో పులులను కాపాడేందుకే అష్టకష్టాలు పడ్డ ఫారెస్ట్ ఆఫీసర్లకు ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్‌లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలికలను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మహారాష్ట్ర లోని తాడోబా టైగర్ రిజర్వ్ నుంచి పులులు తెలంగాణ వైపు క్యూ కడుతున్నాయి. అక్కడి టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ ప్రాణహిత నది దాటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ సీజన్‌లో తాడోబా నుంచి సుమారు 3-4 పులులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని, దీంతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాలు ఇప్పుడు 'టైగర్ జోన్'గా మారిపోయిందని చెప్తున్నారు. కాగా ఈ పులుల్లో కొన్ని వెనక్కి వెళ్లిపోతుండగా, మరికొన్ని తిర్యాణి, పెంచికల్‌పేట రేంజ్‌లలో ఆవాసం కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వస్తున్న పులులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల ఆసిఫాబాద్ నుంచి మొదలైన ఓ టైగర్ జర్నీ మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల మీదుగా సాగి సిద్దిపేట జిల్లాలోకి చేరింది. తొగుట, మిరుదొడ్డి, కొండాపూర్ మండలాల్లో పులి పాదముద్రలు కనిపించాయని, సిద్దిపేట పట్టణానికి దగ్గరగా కూడా వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పులి కనిపించడం ఇదే తొలిసారి. కొత్త ఆవాసం కోసమో.. తోడు కోసమో ఈ పులి దాదాపు 300 కిలోమీటర్లకుపైగా నడిచి ఉంటుందని ఆఫీసర్లు భావిస్తున్నారు. ఈ పులి రాష్ట్రంలోని 14 జిల్లాలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలోనూ పులి సంచారం కలవరపెడుతోంది. ఇటీవల భూపాలపల్లి అడవి నుంచి జకారం వద్ద రోడ్డు దాటుతుండగా ఓ అంబులెన్స్ డ్రైవర్ చూసినట్టు స్థానికులు చెబుతున్నారు. ములుగు,అబ్బాపూర్, జాకారం, పందికుంట బీట్లలో పులి పాదముద్రలను గుర్తించారు.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# స్వదేశీ వస్తువులను ప్రోత్సహిద్దాం..
# మేకిన్ ఇండియాకి మద్దతిద్దాం

**ఖాదీని ఆదరిద్దాం.. గ్రామీణ ప్రాంత తయారీ వస్తువులను ప్రోత్సహిద్దాం**

**వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా పనిచేద్దాం**

**భవిష్యత్ తరాలకు మన వారసత్వంగా ఖాదీ ఉత్పత్తులను అందిద్దాం**

**10 రోజుల పాటు ఖాదీ మహోత్సవ ఎగ్జిబిషన్**

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**



**విజయవాడ:** ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులను ప్రోత్సహించి మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామీణ భారతాన్ని నిర్మిద్దాం అని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. స్థానిక పంటకాలువ రోడ్డులోని మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర స్థాయి ఖాదీ మహోత్సవ్ - 2025-2026లో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరంలో ఏర్పాటు చేసిన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ప్రదర్శనలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల నుండి అనేకమంది హస్తకళాకారులు, పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి నగరానికి తరలి వచ్చారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'మేక్ ఇన్ ఇండియా', 'స్వదేశీ వస్తువుల వినియోగం' అనే లక్ష్యాలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా ఎంతోమంది యువతీ యువకులు సబ్సిడీ లోన్లు పొంది, స్వయం ఉపాధి సాధిస్తూ సొంత కాళ్లపై నిలబడటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే ప్రధాని మోదీ ఆశయానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర' లక్ష్యానికి లోకల్ బ్రాండ్‌లను ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ఇక్కడి స్టాళ్లను మరియు హస్తకళాకారులను ప్రోత్సహించాలని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. భావితరాలకు మన వారసత్వంగా ఖాదీ వస్తువులను అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలా ప్రోత్సహించడం వల్ల తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు లభించి వారి జీవనోపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందేలా ప్రతి ఒక్కరూ తమ సహకారం అందించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర సంచాలకులు డా.ఎస్. గ్రీప్ మాట్లాడుతూ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో పీఎంఈజీపి ఖాదీ మార్కెటింగ్ రాష్ట్రస్థాయి సంయుక్త మార్కెటింగ్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ఎగ్జిబిషన్ 10 రోజులపాటు నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను నగర ప్రజలు సందర్శించి కొనుగోలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులచే 100కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శనలో ఖాదీ వస్త్రాలు, చేతివృత్తుల వారి నైపుణ్యంతో తయారైన విభిన్న రకాల ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉంటాయని కె.వి.ఐ.సి సంచాలకులు డా. ఎస్. గ్రీప్ తెలియజేశారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సహాయ సంచాలకుల ఆర్.ఎల్. ఎన్. మూర్తి మాట్లాడుతూ ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు, ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద తయారైన ఉత్పత్తులకు ఈ ఎగ్జిబిషన్ లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెట్పీసీ చెర్ పర్సన్ గద్దె అనురాధ, స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పరిశ్రమల శాఖ స్పెషల్ డైరెక్టర్ ఏ. రామలింగేశ్వరరాజు, కేవీఐసీ సిబ్బంది పాల్గొన్నారు.



# విజయవంతంగా విద్యార్థుల సంకల్పం ర్యాలీ

**డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన**

**విజేతలకు బహుమతులు అందజేసిన న్యాయమూర్తి భరణి**




**నర్సీపట్నం:** మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమానికి వివిధ వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. అబిడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి డి.భరణి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను పోలీసులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా యువతలో మార్పు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోందని, ఎన్డిపిఎస్ కేసుల్లో రిమాండ్‌కు పంపే సంఖ్య తగ్గిందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించి మంచి ఉద్యోగాలు సాధించి సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు అలవాట్లు లేని వారు ఎక్కడ పని చేసినా జీవితంలో తప్పక రాణిస్తారని అన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు గంజాయికి వ్యతిరేకంగా పోలీస్ సిబ్బంది 52 రోజులు సుదీర్ఘ ప్రయాణం చేసి నిర్వహించిన అభ్యుదయం సైకిల్ ర్యాలీ ఉత్తరాంధ్రలో విజయవంత మైందన్నారు. అల్లూరి జిల్లా నుంచి గంజాయి రవాణా జరగకుండా పర్మినెంట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఇప్పటికే అనేక విద్యాసంస్థలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. గంజాయి గురించి ఎవరికైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ శాఖకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సమాచారం ఆధారంగా గంజాయి రవాణా చేసే వారిని, పండించే వారిని సైతం విస్మరించేది లేదని వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హత్య చేసిన వాళ్లకు గరిష్టంగా 14 ఏళ్ల జైలు శిక్ష ఉంటుందని, అయితే గంజాయి రవాణా చేస్తే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు మహిళా న్యాయమూర్తి భరణి, డీఎస్పీ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. అనంతరం వందలాది మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నినాదాలు చేస్తూ మాదక ద్రవ్యాలు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అబిడ్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రేవతమ్మ, షేక్ గఫూర్, అప్పన్న, ఎస్ఐలు రాజారావు, ఉమామహేశ్వర రావు, రమేష్, రామారావు, తారకేశ్వరరావుతో పాటు డివిజన్ స్థాయి వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
ఆదివారం 4 జనవరి 2025


# ఎస్ వి ఎస్ కెమికల్ ఇండస్ట్రీస్ లో అగ్నిప్రమాదం

**- ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు -**

**అనకాపల్లి, జనవరి 3 (మనసు లో మాట):** ఎస్ వి ఎస్ కెమికల్ ఇండస్ట్రీస్ వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. అధికారులు అందజేసిన నివేదిక ప్రకారం ప్రమాద వివరాలను తెలియజేస్తూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, అచ్యుతాపురం ఎపిఎస్ఇజెడ్, డీ-నోటిఫైడ్ ఏరియా, ప్లాట్ నెం. 28-ఇ, ఎస్ వి ఎస్ కెమికల్ ఇండస్ట్రీస్ వద్ద శనివారం సాయంత్రం 4:25 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించిందని, వెంటనే చర్యలు తీసుకొని 5.30 గంటలకు మంటలను అదుపుచేయడం జరిగిందన్నారు. ఈ పరిశ్రమ డిసెంబర్ 2023 లో స్థాపించబడింది. కంపెనీలో 25 మంది ఆన్-రోల్ ఉద్యోగులు, దాదాపు 8 మంది రోజువారీ కార్మికులు క్రమం తప్పకుండా పనిచేస్తున్నారని, సంఘటన జరిగిన తేదీన, కంపెనీ 4-మిథైల్-2-సైనో బైఫినైల్ ఉత్పత్తిలో నిమగ్నమై ఉందని, ఉత్పత్తి ప్రక్రియ పూర్తయిన తర్వాత, సెంట్రిఫ్యూజ్ వద్ద చివరి దశ ఆపరేషన్ సమయంలో, అకస్మాత్తుగా మంటలు చెలరేగాయని, ఈ ప్రక్రియలో ద్రావకం వలె ఉపయోగించే టోలున్ ద్రావకాన్ని నిర్వహిస్తుండగా మంటలు చెలరేగాయని, అక్కడ ఉన్న కార్మికులు మొదట మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. కానీ అది ఫలించలేద న్నారు. సంఘటన జరిగిన సమయంలో, పని ప్రదేశంలో కేవలం ముగ్గురు వ్యక్తులు మాత్రమే ఉన్నారు. లోకేశ్వరరావు, డైరెక్టర్ (ఆపరేషన్లు) సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ (ప్రొడక్షన్) కుమార్, రసాయన శాస్త్రవేత్త పైన పేర్కొన్న వారందరూ, ఆవరణలో ఉన్న ఇతర ఉద్యోగులతో కలిసి, ఎటువంటి గాయాలు కాకుండా యూనిట్ ను సురక్షితంగా తరలించారు. ఈ ఉత్పత్తికి ఉపయోగించే ముడి పదార్థాలలో సోడియం హైడ్రాక్సైడ్, డైమిథైల్ సల్ఫేట్ మరియు టోలుయిన్ ద్రావకం ఉన్నాయి. ఈ ఉత్పత్తి తయారీకి మరియు పైన పేర్కొన్న రసాయనాల నిల్వ మరియు వినియోగానికి కంపెనీకి చెల్లుబాటు అయ్యే లైసెన్స్/అనుమతులు ఉన్నాయని యాజమాన్యం పేర్కొంది. సంఘటన జరిగిన వెంటనే, అగ్నిమాపక చర్యలు ప్రారంభించబడ్డాయని మరియు మంటలను అదుపులోకి తెచ్చారని తెలిపారు. ప్రస్తుతానికి, పరిస్థితి అదుపులో ఉంది. ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం లేదా గాయం సంభవించలేదని, అగ్ని ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని నిర్ధారించడానికి భద్రతా సమ్మతి,లైసెన్స్ నిబంధనలను ధృవీకరించడానికి తదుపరి విచారణకు ఆదేశించడం జరిగిందన్నారు.



## రాంబిల్లి ఎస్సీ జడ్ పరిధిలో కెమికల్ కంపెనీలో పేలుళ్లు

**కార్మికులు సురక్షితం**

**అదుపులోకి వచ్చిన మంటలు.**

**రాంబిల్లి జనవరి 3 (మనస్సులో మాట )..** రాంబిల్లి మండల పరిధిలో ఉన్న కెమికల్ కంపెనీ ఎస్వీఎస్ నాన్సెజ్ ఏరియాలో సాయంత్రం ఐదు గంటలకు జరిగిన అగ్ని ప్రమాదం ప్రాణ నష్టం నుండి బయటపడింది. దీంతో అన్ని అధికార వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. ప్రమాద సమయంలో కంపెనీలో సుమారు 16 మంది కార్మిక ఇతర సిబ్బంది ఉండగా ముందుగా ప్రమాదాన్ని పసిగట్టిన సిబ్బంది అప్రమత్తమై బయటికి పరుగులు తీశారు. అప్పటికే దట్టమైన పోగలు కంపెనీ చుట్టూ ముట్టడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఆరు ఫైర్ ఇంజన్లు సిబ్బందితో సకాలంలో రావడంతో మంటలు సుమారు గంట సమయంలోనే మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని నూతనంగా ఏర్పడిన అడ్డరోడ్డు ఇన్చార్జి ఆర్డిఓ రమణ, పరవాడ డి.ఎస్.పి విశ్వరూప్, సీఐ నర్సింగరావు ఎమ్మార్వో శ్రీనివాస్ రావు సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఇది ఇలా ఉండగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యే సుందర్పు విజయ్ కుమార్ సంఘటన స్థలంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారుల్ని అడిగి తెలుసుకుంటున్నారు మంటలు అదుపు చేయటానికి ప్రమాదం విస్తరించకుండా గట్టి నిరోధక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఏపీఐఐసీ జడ్ ఎం గార్ల తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ ఉండాలని అధికారులకు ఆదేశించారు

## నోట్ బుక్స్ అందజేసిన జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (మనసులోమాట) జనవరి 03 :** పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి నోట్ బుక్స్ అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా పూల బొకేలు బదులుగా నోట్ బుక్స్ తో తమకు శుభాకాంక్షలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా అధికారులంతా కలెక్టర్ కు విభిన్నంగా నోట్ పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇలా వచ్చిన సుమారు నాలుగువేల నోటు పుస్తకాలను డిఇఓ మాణిక్యం నాయుడు సమక్షంలో విద్యాశాఖ అధికారులకు శనివారం తమ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అందజేశారు. విజయనగరం, గంట్యాడ, బొండపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నాలుగు, ఐదు తరగతి విద్యార్థులకు ఈ నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, విజయనగరం ఎంఈఓ లలిత కుమారి, ఏసి సన్యాసిరాజు పాల్గొన్నారు.

## 'తెలుగు' కేవలం భాష కాదు..

# అది మన జీవన సంస్కృతి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- చందమామను చూపే రోజులు పోయి.. సెల్ ఫోన్లు చూపిస్తూ అన్నం తినిపిస్తున్నారు
- పల్లెల్లో పండుగల వాతావరణం - కనుమరుగవుతుండటం బాధాకరం
- తెలుగు మహాసభల తీర్మానాలను అసెంబ్లీలో చర్చించి అమలు చేస్తాం
- ఘనంగా ప్రారంభమైన 3వ ప్రపంచ తెలుగు మహాసభలు



**నర్సీపట్నం/అమరావతి, డిసెంబర్ 3, ( మనసులో మాట) :** తెలుగు అనేది కేవలం మాట్లాడే భాష మాత్రమే కాదని, అది మన జీవన విధానం మరియు సంస్కృతి అని ఆంధ్రప్రదేశ్ గౌరవ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు . గుంటూరు సమీపంలోని అమరావతి శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ వేదికగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జరుగుతున్న '3వ ప్రపంచ తెలుగు మహాసభల' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ?ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. నేటి తరం పిల్లలకు మన ఆచారాలు, సంప్రదాయాలు తెలియకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తల్లులు చందమామను చూపిస్తూ పిల్లలకు గోరుముద్దలు తినిపించేవారని, కానీ నేడు సెల్ ఫోన్లను చూపిస్తూ అన్నం తినిపించే పరిస్థితి దాపురించిందన్నారు. అమ్మ పాడే లాలిపాటలో, చెప్పే కథల్లో, జరుపుకునే పండుగల్లో తెలుగు మాధుర్యం దాగి ఉందని గుర్తుచేశారు.

**పండుగల శోభ మళ్ళీ రావాలి:**

గ్రామాల్లో ఒకప్పుడు సంక్రాంతి, దసరా, ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగలు వస్తే పండగ వాతావరణం ఉట్టిపడేదని, హరిదాసులు, గంగిరెద్దులతో సందడిగా ఉండేదని ఆయన గుర్తుచేసుకున్నారు. కానీ నేడు గ్రామాల్లో ఆ కళ కనుమరుగవుతోందన్నారు. మన పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని హితవు పలికారు. తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుకుంటూ పూర్వ వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

**ఎన్టీఆర్ తెలుగు జాతి గర్వకారణం:**

తెలుగు ఖ్యాతిని దేశవిదేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావని స్పీకర్ కొనియాడారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ ద్వారానే సామాన్యులైన ఎంతోమంది రాజకీయాల్లోకి రాగలిగారని, 25 ఏళ్ల వయసులో తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి నేడు సభాపతి స్థానంలో కూర్చునేలా చేసింది ఎన్టీఆరేనని భావోద్వేగంతో పేర్కొన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసంలో మాతృభాష ఆవశ్యకతను నొక్కిచెప్పిన స్పీకర్.. ప్రభుత్వం తరపున తెలుగు భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ మహాసభల్లో మేధావులు చేసే తీర్మానాలను తనకు పంపాలని కోరారు. ఆ తీర్మానాలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి, చర్చించి, ప్రభుత్వం ద్వారా అమలు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సత్యసాయి బాబా సన్నిధిలో, ఎన్టీఆర్ కళావేదికపై ఈ కార్యక్రమం జరగడం ఆనందదాయకమని పేర్కొన్నారు. మాట ఇచ్చిన ప్రకారం మూడు రోజులూ తాను ఈ సభల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వాహకులు గజల్ శ్రీనివాస్, పలువురు న్యాయమూర్తులు,సాహితీవేత్తలు, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో ఘనంగా

# ముగిసిన 'అభ్యుదయం' సైకిల్ ర్యాలీ

**- డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా 52 రోజుల సుదీర్ఘ ప్రయాణం**






**అనకాపల్లి, జనవరి 03 (మనసు లో మాట):** మాదకద్రవ్యాల మహమ్మారినితరిమికొట్టి, యువతలో చైతన్యం నింపడమే లక్ష్యంగా విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టి ఆలోచనలతో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో చేపట్టిన ప్రతిష్టాత్మక 'అభ్యుదయం' సైకిల్ ర్యాలీ శనివారం అత్యంత ఉత్సాహ భరిత వాతావరణంలో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 3 కి.మీ. వాకథాన్. ముగింపు వేడుకల సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు సబ్ డివిజన్లలో 3 కిలోమీటర్ల వాకథాన్/రన్ నిర్వహించారు. అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐ/ఎస్.హెచ్.ఓ ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం నుంచి పెరుగు బజార్ వరకు వాకథాన్ నిర్వహించి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అలాగే నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ/ఎస్.హెచ్.ఓ ల ఆధ్వర్యంలో జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ డి.భరణ శ్రీ జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. అభిద్ సెంటర్ నుంచి బొడ్డేపల్లి వరకు భారీ ప్రదర్శన నిర్వహించి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అలాగే పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య, సీఐ/ఎస్.హెచ్.ఓ ల ఆధ్వర్యంలో అచ్యుతాపురం పార్క్ రోడ్, నాగవరం జంక్షన్ పరిసరాల్లో రన్ నిర్వహించి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కాగా గత ఏడాది నవంబర్ 12న పాయకరావుపేటలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా ప్రారంభమైన ఈ యాత్ర, దాదాపు 52 రోజుల పాటు ఐదు జిల్లాల్లో (అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం) సాగి సుమారు 1,000 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. అనకాపల్లి జిల్లాలో 179 కిలోమీటర్ల మేర ప్రయాణించి 95 గ్రామాలు, వందలాది పాఠశాలలు, కళాశాలలను సందర్శించింది. ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా సుమారు 44,000 మంది పాల్గొన్నారు. ఇందులో 18,000 మంది విద్యార్థులు, 26,000 మంది సాధారణ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ఉండటం విశేషం. సుమారు 42,000 పోస్టర్లు, కరపత్రాల ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

ఈ మహత్తర కార్యక్రామానికి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, చోడవరం శాసనసభ్యులు కె.ఎస్.ఎన్.రాజు, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పూర్తి సహకారాన్ని అందించడం జరిగింది. ?కేవలం ర్యాలీ కే పరిమితం కాకుండా, విద్యార్థుల కోసం "గంజాయి మరియు ఇతర డ్రగ్స్ ప్రభావం - నివారణలో యువత పాత్ర" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. 16 ప్రధాన కేంద్రాల్లో నిర్వహించిన బహిరంగ సభల ద్వారా ఎన్.డి.పి.ఎస్ చట్టంపై అవగాహన కల్పించారు.?"డ్రగ్స్ కు వద్దు - జీవితానికి ముద్దు" అనే నినాదంతో సాగిన ఈ అభ్యుదయం సైకిల్ ర్యాలీ, అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం, ప్రజల సమష్టి కృషితో ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది.

## కొత్త పాస్ పుస్తకాలు మంజూరు తో రైతులు హర్షం

**గొలుగొండ, జనవరి 3,(మనసులో మాట ):** ప్రభుత్వం రైతులకు నూతన పాస్ పుస్తకాలు మంజూరు చేయడంతో రైతుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఓటమి ప్రభుత్వం నిలబెట్టుకుని ఓటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని రైతులు అంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో రీసర్వే అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బొమ్మతో పాస్ పుస్తకాలు జారీ కావడంతో రైతుల నుండి కూడా కొంత వ్యతిరేకతమైంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రీ సర్వే జరిపి రైతుల భూములు ప్రభుత్వం లాక్కుంటుందని కూటమినేతలు ఎన్నికల సమయం చేసిన ప్రచారం రైతులకు బలంగా వెళ్ళింది. అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఓటమికి లాండ్ టైట్లింగ్ యాక్ట్ చెప్పడం జరిగింది. కూటమి నేతలు ఈ విషయాన్ని ఎన్నికల ప్రచారంలో వాడుకుని గణనీయమైన ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జగన్మోహన్ రెడ్డి బొమ్మతో వున్న పాస్ పుస్తకాలను సుమారు 22 లక్షల వరకు రద్దుచేసి ప్రభుత్వ రాజముద్రతో మరల పాస్ పుస్తకాలు ముద్రించి పంపిణీకి శ్రీకారం చుట్టారు. రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం గ్రామాల్లో ప్రారంభం కావడంతో రైతుల నుండి మంచి స్పందన లభిస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుని రైతులకు ప్రభుత్వ రాజముద్రలతో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని కూటమి నేతలు అంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు పాసు పుస్తకాలు నేరుగా అందించడానికి రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొన్ని రెవెన్యూ గ్రామాలకు పాసు పుస్తకాలు రాకపోవడంతో నిరాశతో ఉన్నారు. తమకు కూడా తొందరలో పాస్ పుస్తకాలు అందించాలని పలువురు రైతులు అంటున్నారు.



## తెలుగుదేశం పార్టీ లో కష్టపడి పనిచేసే వారికే

# తగిన గుర్తింపు

**కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం లో ఏపీయుఎఫ్ఐడి కార్పొరేషన్ చైర్మెన్ పీలా గోవింద సత్యనారాయణ**

**అనకాపల్లి, జనవరి 3 (మనసులో మాట):** తెలుగుదేశం పార్టీ లో కష్టపడి పనిచేసే వారికే ఎల్లప్పుడు తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్, నియోజకవర్గ టిడిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు.అనకాపల్లి జీవీఎంసీ 84 వ వార్డు కోట్నివీధిలో శనివారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మై టీడీపీ యాప్ పై టీడీపీ శ్రేణులకు అవగాహనా కార్యక్రమం కూడా జరిగింది. 84వ డివిజన్ కార్పొరేటర్ మాధంశెట్టి చిన్నతల్లినీలబాబు ,84వ వార్డు టీడీపీ అధ్యక్షులు తలారి లక్ష్మి ప్రసాద్ ల ఆధ్వర్యంలో 84 వ వార్డులో జరిగిన కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం లో టిడిపి శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దిశానిర్దేశం చేసారు.ఈ ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఛైర్మెన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, అధికసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, 84 వ వార్డు బూత్ యూనిట్ క్లస్టర్ ఇంచార్జిలు, కెఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## శరవేగంగా అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయ

# పునః నిర్మాణం

**అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరిశీలన**




**అనకాపల్లి, జనవరి 3 (మనసు లో మాట):** ఉత్తరాంధ్ర లో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవలయ పునః నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శనివారం దేవాలయ నూతన నిర్మాణ పనులు పరిశీలించిన తర్వాత మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తగు సూచనలు చేయడం జరిగింది. అంతకుముందు ఆలయ మర్యాద లతో మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఎమ్మెల్యే రామకృష్ణ కు పాలకవర్గ సభ్యులు, ఆదికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అనంతరం ఆలయ మండపంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర తదితరులను అర్చకులు ఆశీర్వదించి ప్రత్యేక పూజలు జరిపించారు. తదనంతరం దేవస్థాన పాలకమండలి సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రామకృష్ణ పలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర, అమ్మవారి దేవస్థాన కమిటీ ఛైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ కార్యనిర్వాహణ అధికారి వై శ్రీధర్ , దేవస్థాన కమిటీ డైరెక్టర్లు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.





## నేడు గాంధీ నగరంలో మెగా వైద్య, రక్తదాన శిబిరం

**మాతృభూమి, అక్షయ ఫౌండేషన్, గ్రామీణ వైద్యుల సంఘం**

**అనకాపల్లి రూరల్, జనవరి 3 (మనసులో మాట):** గాంధీనగరం, పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య, రక్తదాన శిబిరం మాతృభూమి సేవా సంఘం, అక్షయ ఫౌండేషన్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు మాతృభూమి సేవా సంఘం అధ్యక్షులు అల్లక రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఫణీంద్ర, జనరల్ ఫిజీషియన్ దుర్గా అలేఖ్య, ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ అగస్త్య, యూరాలజిస్ట్ బి ఎన్ రాజు, జనరల్ ఫిజీషియన్ వంశీకృష్ణ, ప్రముఖ బోన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ డి సింహాచలం నాయుడు, డాక్టర్ మహీధర, డాక్టర్ భాస్కర్ దంత వైద్య నిపుణులు, కంటి వైద్యులు తదితరులు పాల్గొంటారన్నారు. ప్రజలు ఈ సదవకాశం సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు రాజు కోరారు.

## ఘనంగా వాడ్రాపల్లిలో కూటమి నేత మల్ల రాజేష్ జన్మదిన వేడుకలు

**రాజేష్ ని అభినందిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**



**మునగపాక, జనవరి 3, మనసులో మాట..** కూటమినేత జిల్లా నాయకులు మల్ల రాజేష్ జన్మదిన వేడుకలు మండలంలోని వాడ్రాపల్లిగ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను వాడ్రాపల్లి ప్రోక్ లైనర్ యూత్ అసోసియేషన్, గౌరీ యూత్, పెద్ద రామాలయం హనుమాన్ యూత్, చిన్న రామాలయం గల్లీ బాయ్స్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందర్పు విజయకుమార్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మల్ల రాజేష్ కు ఉన్నతమైన భవిష్యత్తు లభిస్తుందని, సామాజిక కార్యక్రమాలు చేపట్టి పేదలను ఆదుకోవడంలో ఆయన చేస్తున్న సేవలో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. ఉత్తరాంధ్ర జనసేన పార్టీ ఇన్చార్జి సుందరపు సతీష్ కుమార్ రాజేష్ ను అభినందించారు. వాడ్రాపల్లి గ్రామంలో సింహాద్రి అప్పన్న మాలలు ధరించిన స్వాములకు రాజేష్ ఆధ్వర్యంలో బిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ నాపై ఇంత ప్రేమాభిమానాలు చూపించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

## జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు స్థల పరిశీలన



**నర్సీపట్నం రూరల్, జనవరి 3, ( మనసులో మాట) :** సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 9 నుండి మూడు రోజులపాటు జనసేన పార్టీ నాయకుడు అప్పన ఎన్ ఎస్ జి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు శనివారం ఆయన జనసేన నాయకులతో కలిసి స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో స్థల పరిశీలన చేశారు. ముఖ్య అతిధులకు, పోటీలను తిలకించడానికి వచ్చే వీక్షకులకు అనువైన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, సంక్రాంతి క్రీడా సంబరాలలో భాగంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించామన్నారు. క్రీడాకారులు, ప్రజలు ఈ పోటీలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్, మారిశెట్టి రాజా, పూడి త్రినాథ్ పాల్గొన్నారు.

# 'అభ్యుదయం సైకిల్ యాత్ర' ముగింపు

## నర్సీపట్నంలో పోలీసుల భారీ ర్యాలీ

**ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ - ర్యాలీలో పాల్గొన్న 2వేల మంది విద్యార్థిని విద్యార్థులు**





**నర్సీపట్నం రూరల్, జనవరి 3, ( మనసులో మాట) :** మాదకద్రవ్యాల నిరోధానికి ఉన్నతాధికారులు ఆదేశాలతో పోలీసులు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. గడచిన కాలంలో విద్యాసంస్థలలోనూ, గ్రామాలలోనూ, అనేక అవగాహన సదస్సులు నిర్వహించారు. తాజాగా శనివారం సుమారు 2వేల మంది విద్యార్థిని విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా భారీ అవగాహన ర్యాలీ (వాక్ థాన్) నిర్వహించారు. జిల్లాలోని పాయకరావుపేటలో హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించగా, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పర్యవేక్షణలో వివిధ జిల్లాలలో కొనసాగిన మత్తు పదార్థాల వ్యతిరేక "అభ్యుదయం" సైకిల్ యాత్ర ఇచ్ఛాపురంలో ముగింపు సందర్భంగా నర్సీపట్నంలో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి శ్రీ భరణి హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా గంజాయి, డ్రగ్స్,కు వ్యతిరేకంగా పోరాడుతామని విద్యార్థినీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథి గౌరవ న్యాయమూర్తి జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. స్థానిక అబీద్ సెంటర్ నుండి శ్రీ కన్య కూడలి, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ర్యాలీ కొనసాగింది. ర్యాలీ ఆద్యంతం " డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా గౌరవ జడ్జి శ్రీ భరణి మాట్లాడుతూ, నేటి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి, వాటికి బానిసలై తప్పు దారిలో నడిచి తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. వాటికి దూరంగా ఉండి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆమె సూచించారు. డి.ఎస్.పి పి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గంజాయి నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఐదు చెక్ పోస్టులు, ద్వారా గంజాయి రవాణా పై నిరంతర తనిఖీలు ఏర్పాటు చేశామన్నారు. డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు సహాయంతో గంజాయి రవాణా పై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 129 గంజాయి కేసుల నమోదు చేసి, 423 మంది నిందితులను అరెస్టు చేసామని, 8,864 కిలోల గంజాయి, 7 కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 118 వాహనాలను సీజ్ చేశామన్నారు. గంజాయికి వ్యతిరేకంగా చైతన్యం కలిగించేలా 5,032 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని డిఎస్పీ తెలిపారు. కాగా విద్యార్థినీ విద్యార్థులతో ఇంత భారీ ఎత్తున అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన నర్సీపట్నం పోలీసులను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మరియు రూరల్ సిఐలు షేక్ గఫూర్, ఎల్ రేవతమ్మ, పట్టణ, రూరల్ సర్కిల్ ఎస్ఐలు జే రమేష్, జి ఉమామహేశ్వరరావు, పి రాజారావు, దామోదర్ నాయుడు, పి రామారావు, వై తారకేశ్వరరావు, రిషికేశ్వరరావు, సిబ్బంది, పలు కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణనగర్ లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**అనకాపల్లి, జనవరి 3 (మనసులో మాట):** అనకాపల్లి లక్ష్మీనారాయణనగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో శనివారం భారతదేశంలోని మొట్టమొదటి ప్రధాన ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రముఖ సంఘ సంస్కర్త మహిళల పై వివక్షత, వితంతు బహిష్కరణ, సతీసహగమనం అధికంగా ఉండే రోజుల్లో అన్నింటిని వ్యతిరేకించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినటువంటి మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి యేనని అన్నారు. బాల్యవివాహాలను రూపుమాప డానికి, మహిళా వివక్షతను నిర్మూలించ డానికి మహిళలలో చైతన్యం తీసుకురావడమే ముఖ్యమైన పరిష్కారమని భావించి భారతదేశంలో మొట్టమొదటిసారిగా మహిళలకు ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను బోధించినటువంటి ఏకైక మహిళ సావిత్రిబాయి పూలే నని అన్నారు. జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే లు కలిసి దేశంలో 48 పాఠశాలలను ఏర్పాటుచేసి మహిళాభ్యుదయానికి ఆజ్యం పోసిన మహోన్నత వ్యక్తులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మొల్లి రమణబాబు, బొడ్డపాటి చిన్న రాజారావు,రేభాక మధు బాబు,వేగి దొరబాబు,కటారి దేముడు, శ్రీను, దొడ్డి రమణ, వామల కాశి, పలకా కాసులు, కోటిపల్లి శ్రీను,ఆళ్ల ప్రవీణ్ కుమార్,రేపాక ఇంద్ర కుమార్, దాడి శ్రీను, గాజుల రాంబాబు, బెజవాడ రాజు, నాదవరపు కుమార్, మల్ల త్రినాథ్, కొణతాల పరదేశినాయుడు, అంతే రమణ, మహేష్, ఉండ్రాల కన్నారావు, పోలిన సత్యారావు, నోట్ల శ్రీనివాసరావు, మొలకలపల్లి రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కూటమి ప్రభుత్వం అందించే**

# పాస్ పుస్తకాలతో రైతుల్లో ఆనందం

**పాటి పల్లి బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు మొల్లేటి బోగేస్**



**మునగపాక, జనవరి 3 మనసులో మాట..** రెవెన్యూ పరంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి, వైసిపి పాలనలో జరిగిన ఒక తవకులను సరి చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని, గ్రామాల్లో రీ సర్వే చేసి రాజముద్ర తో కూడిన పాసుపుస్తకాలు రైతులకు అందించడం రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకుడు మోల్లేటి భోగేశ్ అన్నారు. పాటి పల్లి గ్రామంలో రైతులకు పట్టాదారి పాస్ పుస్తకాలు కూటమినేతల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బోగేష్ మాట్లాడుతూ వైసిపి పాలనలో చేసిన తప్పులతో రెవిన్యూ పరమైన లక్షలాది సమస్యలు వెలుగులోకి రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రజల సమస్యలు అయితే చాలా సంక్లిష్టంగా మారాయని అన్నారు. సర్వేల పేరుతో అనేక అవక తవకులకు పాల్పడి రైతులకు తీరని అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆస్తులపై హక్కును కాలదన్నేలా, రాజముద్రలతో ఇవ్వాల్సిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రజల కష్టార్జితాన్ని తన సొంత ఫోటోలతో తన పార్టీ రంగులద్ది తప్పు తడకలతో ఏదో జగన్ తన సొంత నిర్ణయంతో ప్రజలకు ఇచ్చి అవమానించారని భోగేశ్వరరావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భరత్, కూటమి నేతలు ఆడారి భాస్కరరావు, పల్లా సన్యాసిరావు, పాలిశెట్టి జగదీష్, కొయిలాడ లచ్చుబాబు, కొయిలాడ పరుశురాం, ద్రక్షారపు రామచంద్రరావు, సబ్బి శ్రీనివాసరావు, కొయ్య చక్రం నేతల ఆధ్వర్యంలో పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.

# పుల సాగు ఆహ్లాదకరం. అమ్మకాలు బాధాకరం..



**హుకుంపేట నవంబర్ 3 (మనసులో మాట)..** మండలం లోని అమ్మవారి కాటికాలు, సీమబంతి వంటి పూలు అక్టోబర్ నుంచి జనవరి వరకు పుష్పించే కాలం కావడంతో రైతులు పూల సాగుపై ఆశలు పెట్టుకున్నారు. దాలి గుమ్మడి, చింతల వీధి, దిగుడు పుట్టు ప్రాంతాలకు చెందిన రైతులు శనివారం వరకు సంతకు గంపలతో పూలను అమ్మకాలకు తీసుకొచ్చారు. పూలకు భక్తులు, వ్యాపారుల నుంచి కొంతమేరకు డిమాండ్ ఉన్నప్పటికీ ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఒక్కో గంప ధర రూ.20 నుంచి రూ.50 వరకు మాత్రమే పలుకుతోంది. గంప 100 నుంచి 150 వరకు కొనుగోలు చేపడితే రైతులకు కష్టించిన ఫలితం దక్కుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ ధరలు తమకు నష్టాలను మిగులుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి పూల రైతులకు కనీస మద్దతు ధర కల్పించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు



## రాజముద్రలతో కూడిన పాసు పుస్తకాలు పంపిణీ అభినందనీయం

**రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సాయి కృష్ణ**

**మునగపాక, జనవరి 3, మనసులో మాట..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతాంగం పై ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచి రాజ్యముద్రలతో కూడిన పాస పుస్తకాలను రైతులుకి అందజేయడం ఎంతో అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు సాయి కృష్ణ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవరకార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు మహిళా అధ్యక్షులు ఆడారి మంజు మండల పార్టీ అధ్యక్షులు మునగపాక పెంటకోట విజయ చేతుల మీదగా పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మునగపాక గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాడి శివ, మునగపాక పిఎసిఎస్ అధ్యక్షులు విల్లూరి నూక నర్సింగరావు, ఇంచార్జ్ ఆడారి లక్ష్మణరావు, టిడిపి నాయకులు దాడి భీముడు, బిలా లక్ష్మణరావు,వేగి ప్రకాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మునగపాక రైతులకు పట్టాదార పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

**జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు టెక్కలి పరశురాం చేతులమీదుగా**



**మునగపాక, జనవరి 3, మనసులో మాట..** మండల వ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించి తప్పొప్పులు లేకుండా రాజముద్రలతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ పట్టాదార పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి గణేష్, వెలగా మురళి, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి**

విజయనగరం,(మనసులోమాట )::జనవరి 3 : జిల్లాలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని True Spirit తో, నిర్ణయించిన లక్ష్యాల ప్రకారం ప్రతిరోజూ పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు.ఏ రోజుకు ఆ రోజు నిర్ణయించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలని, గ్రామ సభల ద్వారా పంపిణీ నిర్వహించి ప్రజాప్రతినిధులను పూర్తి స్థాయిలో భాగస్వాములను చేయాలని సూచించారు. రోజుకు 40 వేల పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని, నిన్న మరియు ఈ రోజు కలిపి 80 వేల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకాలలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు అవకాశం ఉన్నందున, లోపాలను సరిదిద్దే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు నిర్దేశించిన లక్ష్యం తప్పనిసరిగా చేరుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ మాట్లాడుతూ, రైతుల KYC పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి రోజు లక్ష్యాన్ని సాధించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో మూడు డివిజన్ల ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


**హర్యానా జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన**

## ఏపీ జట్టుకు అభినందనలు

**పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ**



**నాతవరం, జనవరి 3, ( మనసులో మాట) :** ఈ నెల 6వ తేదీ నుంచి హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ జట్టుకు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, తాండవ ప్రాజెక్టు ఛైర్మన్ కరక సత్యనారాయణ శనివారం అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన 36 మంది క్రీడాకారులు ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని, వారంతా ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొంటున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా సమానమైన దృష్టి పెట్టాలని సూచించారు. క్రీడలు కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, ఉజ్వలమైన భవిష్యత్తుకు దారి చూపుతాయని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు క్రీడల ద్వారా పెంపొందుతాయని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని స్పష్టంగా పెట్టుకుని కష్టపడి ముందుకు సాగితే తప్పకుండా విజయాలు సాధిస్తారని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు ఛైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాద హరినాథ్, నాతవరం మండల జనసేన అధ్యక్షులు వెలగల వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం, నాయకులు నాతవరం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు శేఖర్ కొండబాబు, శెట్టిలోవ, పాల్గొన్నారు





మంచినీటి కొరత లేకుండా

# ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నాం

### మూలపేట సర్పంచ్ బి శెట్టి గంగప్పల నాయుడు

**మునగపాక, జనవరి 3, మనసులో మాట..** గ్రామంలోని మంచినీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్న మనీ, దీనిలో భాగంగా ఎక్కడైనా బోర్లు రిపేర్లు వస్తే వెంటనే స్పందించి రిపేర్ చేయడం జరుగుతుందని గంగప్పల నాయుడు తెలిపారు. మూల పేట గ్రామంలో ఆడారి వారి పాకల వద్ద చేతిపంపు రిపేర్ అవడంతో సర్పంచి బీశెట్టి గంగ అప్పలనాయుడు మరియు పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్ సంబంధిత మెకానికుని తీసుకువచ్చి శనివారం చేతి పంపు పంపు రిపేర్ చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఆడారి సన్యాసినాయుడు, ఆడారి వారి దిబ్బ పెద్దలు ఆడారి తాతనాయుడు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, సూరిఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి

# 20సం.ల. జైలు, జరిమాన

### విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం (మనసులోమాట) జనవరి 3:** జిల్లా లో బాడంగి పోలీసు స్టేషనులో 2024సం.లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు బాడంగి మండలం, వాడాడ గ్రామంకు చెందిన వాడాడ వెంకటరమణ (23 సం.లు)కు విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కే.నాగమణి 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000/-లు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేస్తూ జనవరి 2న తీర్పు వెల్లడించారని విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపీఎస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే.. విజయనగరం జిల్లా, బాడంగి మండలం, రాజేరు గ్రామానికి చెందిన ఒక మైనరు బాలిక (14 సం.లు) కనపడుటలేదని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై బాడంగి పోలీసు స్టేషను ఎస్ఐ జె.తారకేశ్వరరావు తే.28.12.2024దిన మిస్సింగు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో బాడంగి మండలం, వాడాడ గ్రామానికి చెందిన ఒక నిందితుడు వాడాడ వెంకటరమణ (23 సం.లు) ఆ మైనరు బాలికను ప్రేమిస్తున్నాని వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మైనర్ బాలికను కత్తిపూడి తీసుకొని వెళ్లి, అక్కడ ఆ బాలికను శారీరకంగా పలు మార్లు అనుభవించాడని తెలియడంతో పోక్సో చట్టం క్రింద కేసును ఆల్టర్ చేయాగా, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి కేసును దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, నిందితుడిపై న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు.

నిందితుడు బాడంగి మండలం, వాడాడ గ్రామంకు చెందిన వాడాడ వెంకటరమణ (23 సం.లు) పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి శ్రీమతి కే.నాగమణి గారు 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000/- లు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేస్తూ జనవరి 2న తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసులు తరుపున ఫోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎం. ఖజానారావు వాదనలు వినిపించారన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసి, నిందితుడిని శిక్షించబడే విధంగా సమర్థవంతంగా పని చేసిన బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, బొబ్బిలి రూరల్ సి.ఐ. కె.నారాయణరావు, బాడంగి ఎస్ఐ జె.తారకేశ్వరరావు, సి.ఎం.ఎస్. హెచ్.సి.సిహెచ్. రామకృష్ణ, కోర్టు హెడ్ కానిస్టేబులు బి.మహేష్, స్పెషల్ పిపి ఎం. ఖజానారావులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## బొండపల్లి మండలంలో

# పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

### రైతుల భూ హక్కులకు పూర్తి భరోసా - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### పారదర్శకంగా, లోపాల సవరణతో పంపిణీ - జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (మనసులోమాట) జనవరి 3:** రీసర్వే పూర్తయిన గ్రామాలలో రైతులకు ప్రభుత్వ రాజముద్ర తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తోందని రాష్ట్ర చిన్న సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమలు, ఎన్ ఆర్ ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం బొండపల్లి మండలం మరువాడ గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, రైతుల భూ హక్కులు స్పష్టంగా నమోదై, భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉండేలా ఈ విధానం రూపకల్పన చేశామన్నారు. రైతులు తమ భూమి వివరాలను సులభంగా తెలుసుకునే విధంగా క్యూ ఆర్ కోడ్ కలిగిన ఆధునిక పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో అందిస్తున్నామని చెప్పారు.

భూ రికార్డులలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే, వాటిని రిజెక్ట్ చేయకుండా సరిదిద్దుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. జాయింట్ ఎల్పీఎం, ఈ-కేవైసీ, బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి పారదర్శకంగా, లోపాల సవరణతో పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా రీసర్వే పూర్తయిన గ్రామాలలో రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకుని పంపిణీ జరుగుతోందన్నారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, మ్యూటేషన్ సమస్యలు, సరిహద్దు వివాదాలను సత్వర పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ పెంచామని, తప్పుడు సమాచారంతో పాస్ పుస్తకాలు పొందే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ సమస్యలను సంబంధిత రెవెన్యూ అధికారులను లేదా మండల స్థాయి కార్యాలయాలను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభలో భాగంగా పలువురు రైతులకు మంత్రివర్యులు కలెక్టర్ చేతుల మీదుగా పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి కీర్తి, ఎంపీపీ చల్లమనాయుడు, సర్పంచులు డి పార్వతి, బి రాము, శ్రీనివాస్, ఈ కృష్ణ తదితర ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

**- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

**- నేటితో ముగిసిన 'అభ్యదయ సైకిలు యాత్ర' కు సంఘీభావంగా 3 కిమీల వాక్ థాన్**




**విజయనగరం (మనసులోమాట) జనవరి 3:** మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలనే సంకల్పంతో విశాఖపట్నం రేంజ్ పరిధిలోని పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు సాగిన అభ్యదయ సైకిలు యాత్ర నేటితో ముగియనుండడంతో సంఘీభావంగా జిల్లాలో 3 కి?మీ?ల 'వాక్ థాన్'ను నిర్వహించినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ జనవరి 3న తెలిపారు. విజయనగరం పట్టణం బాలాజీ జంక్షను నుండి మూడు లాంతర్లు వరకు నిర్వహించిన 'వాక్ థాన్' జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిథిగా హాజరై, వాక్ థాన్ ను ప్రారంభించి, వాక్ థాన్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్ధాలను ప్రజలకు వివరాలించాలనే సంకల్పంతో రేంజ్ ఐజిపి గోపీనాథ్ జట్టి రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాలను కవర్ చేస్తూ 'అభ్యదయ సైకిలు యాత్ర'ను నిర్వహించారన్నారు. ఈ యాత్ర విజయనగరం జిల్లాలో దాదాపు అన్ని మండలాలను కవర్ చేస్తూ నిర్వహించి, ప్రజలు, యువతకు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్ధాల పట్ల చైతన్యపర్చామన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని ముగింపుకు చిహ్నంగా జిల్లాలో 'వాక్ థాన్' నిర్వహించామన్నారు. చాలామంది యువత తెలిసి తెలియని వయస్సులో కుతూహలంతోను, తోటి స్నేహితుల ఒత్తిడితోను డ్రగ్స్ను వినియోగించి, వాటికి బానిసలుగా మారుతూ, చివరకు వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ ప్రభావం వాటిని వినియోగించే వ్యక్తుల ఆరోగ్యంపైనే కాకుండా, వారి కుటుంబ బంధాలు, అనుబంధాలు పైనా ప్రభావం చూపుతుందన్నారు. అంతేకాకుండా, డ్రగ్స్ ప్రభావంతో నిర్దేశించుకన్న లక్ష్యాలను చేరుకోలేరని, వృత్తి, చదువు, మానసిక స్థితిపైనా ప్రభావం చూపుతుందని, ఆర్థిక ఇబ్బందులకు గురికావడం, నేరస్థులుగా మారే పరిస్థితులను కల్పిస్తుందన్నారు. కావున, జీవితాలను అంధకారంలోకి నెట్టేసే ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని. డ్రగ్స్ జోలికి పోవద్దని యువతకు జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. గంజాయి, మాదకద్రవ్యాలను (డ్రగ్స్) వినియోగించినా, విక్రయించి, రవాణకు పాల్పడినా చట్టాన్ని ఉల్లంఘించినట్లేనన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, కేసులు నమోదవ్వడంతో చిక్కులు తప్పవని, చివరకు శిక్షలకు గురైతే జీవితాలు నాశనం అవుతాయన్న వాస్తవాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించి, వ్యవహరించాలన్నారు. గత కొన్ని మాసాలుగా జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలు ఫలితంగా గంజాయి తగ్గుముఖం పట్టిందన్నారు. జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు కూడా చేయూతను అందించాలని, మీ స్నేహితులు, బంధువులకు డ్రగ్స్ దుష్ప్రభావాలను వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాలకు అందుకోవాలని, విజయనగరం జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని ప్రజలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, టి.శ్రీనివాసరావు, సిహెచ్.సూరి నాయుడు, బి.లక్ష్మణరావు, ఈ.నర్సింహమూర్తి, ఆరఐ ఎన్.గోపాల నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ క్రీడా పోటీలు

### ఘనంగా కొణతాల జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు



**అనకాపల్లి రూరల్, జనవరి 3 (మనసులో మాట):** మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని భారీ ఎత్తున వివిధ క్రీడ పోటీలు ఏర్పాటు చేశారు. ఆదివారం నాడు జరగనున్న జన్మదిన వేడుకలు సందర్భంగా కూటమి నాయకులు ఏర్పాటుచేసిన పలు క్రీడా పోటీలను జనసేన పార్టీ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జ్ బీమరశెట్టి రామ్ కీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముఖ్యంగా అనకాపల్లి మండలం తుమ్మపాలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, అక్కిరెడ్డిపాలెంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు, కసింకోట మండలం కన్నురుపాలెంలో జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్, బయ్యవరం గ్రామంలో జిల్లాస్థాయి కబడీ పోటీలు, కసింకోటలో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, అనకాపల్లి మండలం కూటమి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలను ఉద్దేశించి రామ్ కి మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదిన వారోత్సవాల భాగంగా ఈ కబడీ పోటీలు నిర్వహిస్తున్న నాయకులందరికీ అభినందనలు తెలియజేశారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపి పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పోటీలను తిలకించారు.

### పిపిఎల్ 75 సిల్వర్ జూబ్లి టోర్నమెంట్

# విజేతగా రాయల్ టీం




**పాయకరావుపేట జనవరి 3 మనసులో మాట.** పాయకరావుపేట వాటర్ క్రాస్ గ్రౌండ్ యందు గత నెలరోజులుగా జరుగుతున్న పిపిఎల్ - 75 (సిల్వర్ జూబ్లీ) టోర్నమెంట్లో భాగంగా రమేష్ రాయల్స్ మరియు బూషా టైటాన్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. ఈ మ్యాచ్లో రాయల్స్ టీం అద్భుతమైన విజయం సాధించింది. ఈ సందర్భంగా బహుమతులు అందజేసిన అనంతరం నిర్వహుకులు మాట్లాడుతూ యువత చెడు మార్గాలు పడుతున్న ఈ కాలంలో అటువంటి వాటికి అవకాశం ఇవ్వకుండా ప్రతి ఒక్కరు కూడా వ్యాయామంలో భాగంగా నచ్చిన క్రీడను ఆడుతూ శారీరక మానసిక ఆరోగ్య వికాసంతో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట సీనియర్ క్రికెట్ క్రీడాకారులు గొల్లపల్లి నాగు,గెడ్డం చలపతి, సి హెచ్.నాగేశ్వరరావు,జివిఎల్ రమేష్, కే.నాగభూషణం, విజయ్,పుట్టిని చిన్న, మణికంఠ,అక్కిరెడ్డి వెంకీ, వంగలపూడి చక్రధర్, చోడిశెట్టి భార్గవ్,సురేష్,యోహాన,వర్మ,మండి నూకరాజు, రిషి,అజయ్,కళ్యాణ్,బుజ్జి,యేసు రాజు,పోలిశెట్టి సాయి, గణేష్, శంకర్, స్వామి. తదితరలు పాల్గొన్నారు.



# పండగ సంతకు తండోప్తండాలుగా తరలివచ్చిన జనాలు

**హుకుంపేట జనవరి 3 (మనసులో మాట )..** శనివారం వరకు సంతలో సంక్రాంతి పండగ శోభ ముందుగానే కనిపించింది. సంక్రాంతి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకు తరలివచ్చారు. తమ వ్యవసాయ ఉత్పత్తులు, హతా ఉత్పత్తులను విక్రయించేందుకు రైతులు, వ్యాపారులు ఉత్సాహం చూపడంతో సంత కళకళలాడింది. చలికాలం కొనసాగుతున్నందున పిల్లల నుంచి పెద్దల వరకు చలి దుస్తులు, నూతన వస్త్రాల కొనుగోళ్లు భారీగా జరిగాయి. పండగ అవసరాల కోసం కూరగాయలు, నిత్యవసర వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలు చేయడంలో ప్రజలు ఆసక్తి చూపారు. ముఖ్యంగా కోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పండగ భోజనాల కోసం ప్రజలు కోళ్ల కొనుగోలుపై ఆసక్తి చూపడంతో విక్రయాలు జోరుగా సాగాయి. మరోవైపు ఒరిస్సా నుంచి వచ్చిన వ్యాపారులు దింస నృత్యాలకు సంబంధించిన డప్పులు, సంప్రదాయ వాయిద్య పరికరాలను విక్రయించగా వాటికి మంచి ఆదరణ లభించింది. సంక్రాంతి సందడి, కొనుగోళ్ల హడావుడితో సంత మొత్తం ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంది.

# గొల్లపేటలో ప్రత్యేక వైద్య శిబిరం




**కోటవురట్ల (మనసులో మాట) జనవరి3:** కోటవురట్ల శివారు గొల్లపేటలో కిడ్నీ వ్యాధులపై శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు కిడ్నీ వ్యాధి నిర్ధారణ కోసం స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం అండ్ హెచ్ఓ వీరజ్యోతి తెలిపారు. 10 మంది వరకు కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. స్క్రీనింగ్ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే నెఫ్రాలజిస్ట్ ఆధ్వర్యంలో వీరికి వైద్య చికిత్స అందించడం జరుగుతుందన్నారు. కిడ్నీ వ్యాధికి సంబంధించి నిర్ధారణకు అన్ని పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నెప్పి నివారణకు వాడే టాబ్లెట్స్ కారణంగా కిడ్నీ వ్యాదులు వస్తాయన్నారు. సుగర్, బిపి నియంత్రణంలో లేకపోయినా కిడ్నీలు దెబ్బ తింటాయన్నారు. గత మూడేళ్ల నుంచి ఇప్పటివరకు 11 మంది గ్రామంలో కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. నలుగురికి ప్రస్తుతం డయాలసిస్ జరుగుతుంది. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో స్పందన లభించిందని జడ్పీటీసీ ఉమాదేవి చెప్పారు. గ్రామంలో ఎక్కువమంది కిడ్నీ వ్యాధికి ఎందుకు గురవుతున్నారో కారణం తెలుసుకోవాలని ఆమె సూచించారు.వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# చిక్కాలను శాలువాతో సన్మానించిన నక్కపల్లి వైసిపి నాయకులు



**పాయకరావుపేట జనవరి 3 మనసులో మాట..** వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామరావును నక్కపల్లి వైసిపి నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లెం చలపతి రావు,వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సూరకాసుల గోవింద్,నల్లాల రామకృష్ణ,ఈశ్వరరావు,బాబురావు,కురందాసు నాని,పొడగట్ల గోపి,బొల్లెం విష్ణు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### అన్ని పనుల్లో మహిళతో పాటు

# పురుషులు భాగస్వామ్యం కావాలి

### - వెలుగు ఏపిఎం బాలరాజు



**మునగపాక, జనవరి 3, మనసులో మాట..** మునగపాక మండలం లో వెలుగు ఆఫీసు నందు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వసంతలక్ష్మి ఆధ్వర్యంలో జెండర్ పై జెండర్ కమిటీ సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమం లో ఏపిఎం బాలరాజు మాట్లాడుతూసమాజంలో గానీ కుటుంబంలో గాని ఆడ మగ అని తేడా లేకుండా అందరు సమానమే అనే భావంతో ఉండాలని , అందరికి సమానవకాశాలు ఉండాలని, మరియు కాల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందరికి అవగాహన కార్యక్రమం చేయడం మరియు ర్యాలీ చేయడం జరిగింది. మహిళలకు అన్ని రకాల పనులలో మహిళలే కాకుండా పురుషులు భాగస్వామ్యం అయి సహకారం అందించి పాలు పంచుకోవాలని, ఆడపిల్ల ను బాగా చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని, బాల్య వివహాలు నిర్మూలన చెయ్యాలి అని, మహిళా మణులు ఆర్థికంగా బలోపేతం కావాలి అని,అందరికి శిక్షణ ఇవ్వడం జరిగింది . ఈ సమావేశంలో సీసీలులు ట్రైనర్ అనురాధ, మోది నాయుడు , వేణు ,, శ్రీను, నాగమణి, అకౌంట్స్ వెంకటలక్ష్మి, త్రివేణి పాల్గొనడం జరిగింది.



## స్టేట్ ట్రైకార్ డైరెక్టర్ కి రక్తదానం చేసిన అర్జున్ రెడ్డి

**గూడెం/ సీలేరు జనవరి 03(మనసు లో మాట)..** ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ పాడేరు బిజెపి అసెంబ్లీ ఇన్చార్జి కూడా కృష్ణారావు గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ.. విశాఖపట్నం కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. వారి హార్ట్ సర్జరీ చేయడానికి 6 యూనిట్ల %బా% పాజిటివ్ బ్లడ్ గ్రూప్ డొనేట్ చేయాలని సంబంధిత వైద్య సూచించినట్లు సామాజిక సేవకుడు, జిల్లా ఆర్టిఐ కో ఆర్డినేటర్ అర్జున్ రెడ్డి తెలిపారు. దీంతో స్పందించి, అర్జున్ రెడ్డి విశాఖపట్నం కేజీహెచ్ లో రక్తదానం చేసినట్లు తెలిపారు. దీంతో 17 వ సారి రక్తదానం చేశానని అర్జున్ రెడ్డి అన్నారు. రెండు మూడు రోజుల్లో కృష్ణారావు కి సర్జరీ చేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారని అన్నారు. ప్రజల్ని రక్తహీనత నుంచి కాపాడాలంటే, 18-50 సంవత్సరాల లోపు యువత రక్తదానం చేయాలని అర్జున్ రెడ్డి అన్నారు. రక్తదానం చేయడం వలన యువతకు ఎటువంటి జబ్బులు రాకుండా ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు. రక్తదానం చేయడానికి మిగిలిన కొద్దిమంది యువకులు కూడా రక్తదానం చేశారని అన్నారు.

## రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ



**చీడికాడ, జనవరి 3, (మనసులో మాట)..** మండలంలో తంగుడిబిల్లి తురువోలు గ్రామాల్లో రైతులకు పాసు పుస్తకాలను తహసిల్దార్ కిషోర్ లింకన్ శనివారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన పుస్తకాలు తీసుకొని ఇప్పుడు కొత్త పుస్తకాలు రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు ప్రస్తుతం ఇస్తున్న పాస్ పుస్తకాల్లో తప్పులుంటే సంబంధిత విఆర్వోకు తెలియజేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్టా అప్పారావు ఉప సర్పంచ్ పి టి బాబు టిడిపి నాయకులు పాత్రిని సురేష్ మాజీ సర్పంచ్ రెడ్డి సన్యాసినాయుడు ఎంపీటీసీ బీలా కోటి వీఆర్వో ప్రణయ సర్వేయారు దివ్య పంచాయతీ కార్యదర్శి సునీత ఆర్ ఐ పాల్గొన్నారు.

## బైకులు దొంగతనం కేసులో ముద్దాయి అరెస్ట్



**ఎస్. రాయవరం, జనవరి 3,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం గ్రామంలో గత ఏడాది జనవరిలో జరిగిన బైకులు దొంగతనం కేసులో తప్పించుకుతిరుగుతున్న ప్రధాన నిందితుడు షబ్బీర్ అలియాస్ బషీర్ అలియాస్ బన్నీ ని శనివారం అరెస్టు చేసినట్లు నక్కపల్లి సి ఐ ఎల్. రామకృష్ణ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యలయంలో ఆయన మాట్లాడుతూ రేవుపోలవరం లోజరిగిన రెండుబైకులుచోరీ కి సంబంధించి అప్పట్లో ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి వారివద్దనుండి ఎనిమిది బైకులు రికవరీచేసినట్లు సి ఐ తెలిపారు. ఆ కేసులో ప్రధాన నీందితుడైన షబ్బీర్ అలియాస్ బషిర్ అప్పటనుండితప్పించుకు తిరుగుతున్నాడన్నారు. ఈరోజు తమకు అందిన సమాచారం మేరకు నిందితుడు షబ్బీర్ ను అడ్డురోడ్డు పైవంతెన క్రింద ఎస్. ఐ విభీషణరావు సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు సి ఐ తెలిపారు.షబ్బీర్ అలియాస్ బషీర్ అలియాస్ బన్నీ పై ఇప్పటికే 35 దొంగతనం, గంజాయి కేసులు ఉన్నయి అన్నారు. నిందితుడును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సి ఐ తెలిపారు.

### అత్యంత వైభవోపేతంగా భోగలింగేశ్వరస్వామి

# ఆలయంలో అన్నాభిషేక కార్యక్రమం

### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్ చే భారీ అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభం



**అనకాపల్లి, జనవరి 3 (మనసులో మాట):** స్వయంభూగా వెలసి ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం లోని శ్రీ భోగలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం పరమేశ్వరుని జన్మ నక్షత్రం న శివముక్కోటి అంటారు. అందువల్లే పౌర్ణమి మహా పర్వదినాన స్వయంభూ శ్రీ భోగలింగేశ్వర స్వామి కి "అన్నాభిషేకం" ఘనంగా జరిపారు. లోక సంరక్షణార్థం సర్వజనుల ఆయుష్ ఆరోగ్య శ్రేయస్సు, శాంతి సౌభాగ్య సిద్ధ్యర్థం కోసం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రదక్షిణ పూర్వకంగా ఆధో పూజోగణాధిప అన్నట్టుగా గణపతి పూజా పంచగవ్యం సర్వతోభద్ర మండల రుద్ర మండపార్చన కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం మహాన్యాసము, స్వామివారికి ఏకాదశి రుద్రాభిషేకం, ముఖ్యంగా అన్నాభిషేకము నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పేరూరి చిన్ని స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు కొత్తలంక పల్లంరాజు శర్మ, చాడ శేష్ కుమార్, నాగేంద్ర శర్మ, సాయి సందీప్,సాత్విక్ శర్మ అన్నాభిషేకం ఎంతో వైభవోపేతంగా జరిగింది. ముందుగా స్వామి వారిని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వర రావు దర్శించుకొని పూజలు జరిపారు. ఈ సందర్బంగా నాగజగదీష్ తదితరులు చిన్ని స్వామిని అభినందించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ధర్మకర్తలు మద్దాల నారాయణరావు, మల్ల సూరిబాబు, రాపేటి నాగ సంతోష్, ఎలమంచిలి బంగార్రాజు, కొట్రా హరి, బాదంపూడి కొండమ్మ, కార్య నిర్వహణ అధికారి మురళీకృష్ణ, దేవస్థాన సిబ్బంది మళ్ళ రామ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ అరుకు దొన్ను దొర, ఇన్చార్జి ఆర్డీఓ,



**హుకుంపేట నవంబర్ 3 (మనసులో మాట)..** మండలంలోని సంతారి పంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన భూ పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకంపై తమ ఫోటోను చూసుకున్న తర్వాతే రైతుల ముఖాల్లో నిజమైన సంతోషం కనిపించిందని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ లోకేష్, తహసిల్దార్ శ్రీనివాసరావుతో కలిసి రైతులకు రాజముద్రతో కూడిన నూతన పాస్ పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి ఎవరిదో వారి పేరుతో, వారి ఫోటోతోనే పట్టాదారు పాస్ పుస్తకం ఉండాలన్నది దేశవ్యాప్తంగా అమలులో ఉన్న సంప్రదాయమన్నారు. గత ప్రభుత్వంలో పాస్ పుస్తకాలపై ముఖ్యమంత్రి ఫోటో వేయడం వల్ల రైతుల్లో భూములు పోతాయనే భయాలు నెలకొన్నాయని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రైతుల భూములను హరించాలనే ప్రయత్నం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు 166 నూతన పాస్ పుస్తకాలను రాజముద్రతో విడుదల చేయడం శుభపరిణామమన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 5 న అనకాపల్లిలో నూతన రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ భవన ప్రారంభోత్సవం

- నక్కపల్లి లో పలు అభివద్ధి పనులు ప్రారంభం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇంఛార్జి మంత్రి రవీంద్ర, హెూం శాఖ మంత్రి అనిత చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**అనకాపల్లి, జనవరి 3 (మనసు లో మాట):** అనకాపల్లి జిల్లాలో ప్రజలకు మరింత సమర్థవంతమైన రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో నూతనంగా నిర్మించిన రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ (ఆర్‌డీఓ) భవనాన్ని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సోమవారం అధికారికంగా ప్రారంభించనున్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర గనులు అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వి. అనిత , అనకాపల్లి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.
ఈనెల 5 న ఉదయం మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు ఉదయం అడ్డురోడ్డు జంక్షన్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌ను సందర్శించడంతో పాటు, నక్కపల్లి మండలంలో కేజీబీవీ టైప్ బాలికల వసతి గృహం ప్రారంభం, ఉప్మాక గ్రామంలో సచివాలయ ప్రారంభం, నక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ప్రజాసభ నిర్వహణ, విద్యార్థులకు సైకిళ్లు, భూ పట్టాలు పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.
అదేరోజు
మధ్యాహ్నం అనకాపల్లి పట్టణంలోని కొత్తూరు లో నూతనంగా నిర్మించిన రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ నూతన భవనం ద్వారా రెవెన్యూ పరిపాలన మరింత బలోపేతమై, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

# అక్రమాలకు పాల్పడిన ఉద్యోగి సస్పెండ్

### - ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఇ లక్ష్మణరావు

**విజయనగరం, (మనసులోమాట) జనవరి 3:** ఇటీవల కొన్ని దినపత్రికల్లో ప్రచురితమైన విద్యుత్ శాఖకు సంబంధించిన వార్తలపై స్పందించిన ఏపీ ఈపీడీసీఎల్ స్పందించిందని ఆ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఎం లక్ష్మణరావు తెలిపారు.
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) సమర్పించిన నివేదిక ఆధారంగా, విధుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన ఎనర్జీ అసిస్టెంట్ వి. దినేష్ పై క్రమశిక్షణ చర్యలు చేపట్టే ప్రక్రియలో భాగంగా ఆయన్ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత ఉద్యోగి విద్యుత్ వినియోగ సేవల విషయంలో అక్రమంగా మీటర్ల మార్పిడి చేయడం, బకాయిలు ఉన్న సేవలకు అనధికారికంగా విద్యుత్ సరఫరా కల్పించడం, అలాగే లంచాలు తీసుకుని విద్యుత్ సరఫరా కొనసాగించినట్లు విచారణ లో నిర్ధారణ జరిగినందున చర్యలు తీసుకున్నామని ఎస్ ఇ స్పష్టం చేసారు. ఇలాంటి అక్రమాలు ఏపీ ఈపీడీసీఎల్‌లో సహించబోమని, సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని పర్యవేక్షక ఇంజనీర్ హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

## లింగరాజు పాలెంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**ఎస్. రాయవరం, జనవరి 3,(మనసులో మాట):** ఎస్ రాయవరం మండలం లింగరాజుపాలెం గ్రామంలో ని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల హాస్టల్ నందు శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్. రాయవరం మండల పిఅర్టీయు అధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. గత ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడానికి కృషిచేసిన ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఉపాధ్యాయ బృందాన్ని పిఅర్టీయు ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయు మండలశాఖ అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ విద్య పేదరికంను తగ్గించి ఆర్థిక అసమానతలు తొలగించడంలో కీలకపాత్ర వహిస్తుందని,మహిళా ఉద్యమకారిణి, సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే సమాజానికి స్పష్టంగా తెలియజేశారన్నారు. బాలికల పాఠశాల ఏర్పాటు చేసి వారి జీవితంలో విద్య తో వెలుగులు నింపారని తెలిపారు . సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు వారి హాస్టల్లో ఏర్పాటు చేయడం పట్ల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయ బృందం ఆనందాన్ని వ్యక్తం చేసారు. మొదట్లో నిరక్షరాస్యత లో ఉన్న సావిత్రిబాయి పూలే ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మార్పు కు నాంది పలికారని, ఆమె ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా వృత్తి బాధ్యతను మనస్సాక్షిగా నిర్వర్తిస్తామని ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు. మహిళా హక్కులే మానవ హక్కులు అని ఆమె పేర్కొన్నారు.

## క్షేత్ర స్థాయి పర్యటనలో విఎంఆర్డిఏచైర్మన్, మెట్రోపాలిటన్ కమిషనర్



**మునగపాక, జనవరి 3, మనసులో మాట..** మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా విఎంఆర్డిఏచైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ మరియు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ ఐఏఎస్, ఇరువురు ఎలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయ కుమార్ తో కలిసి నియోజక వర్గం రాంబిల్లి మండలం లోని హరిపురం, పంచదార్ల మరియు మునగపాక మండలంలోని చెర్లోపాలెం గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఉన్న భూములను పరిశీలించారు. తదుపరి అసంపూర్తిగా మిగిలి ఉన్న చౌడువాడ మిగ్ లేఔట్ నందు పనులను పరిశీలించి సత్వరమే అన్నివిధాలుగా పూర్తి చేసి లేఅవుట్ ను అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఛైర్మన్ ఎం.విప్రణవ్ గోపాల్ మరియు కమిషనర్ ఎన్ తేజ్ భరత్, ఐఏఎస్., ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన ప్రణాళికాధికారిణి శిల్పా, కార్యనిర్వాహక ఇంజనీర్ రాంబాబు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### టిడిపి కార్యక్రమాల నిర్వహణలో

# ఉత్తమ ప్రతిభ అవార్డు

### అవార్డు తీసుకుంటున్న బిలా లక్ష్మణరావు


**మునగపాక, జనవరి 3, మనసులో మాట..** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అప్పజెప్పిన కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మునగపాక గ్రామానికి చెందిన బిలా లక్ష్మణరావుకు ఉత్తమ ప్రతిభ అవార్డు మాజీ ఎంపీ పప్పల సలపతిరావు, ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బొండా జగన్నాథం చేతుల మీదగా సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బిలా లక్ష్మణరావు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యవర్గ కార్యదర్శి కర్రి సాయికృష్ణ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కడియం అనురాధ, మునగపాక మాజీ వైస్ ఎంపీపీ ఉల్లింగల గోవిందా, మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్, పెంటకోట శ్రీరామ్మూర్తి పలువురు పాల్గొన్నారు

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**దుంబ్రిగుడ, జనవరి 3, (మనసులో మాట) :** మండల కేంద్రంలో స్థానిక యూటీఎఫ్ మండల అధ్యక్షుడు యస్ బాలకృష్ణ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి -2 జి గేన్ను మాట్లాడుతూ సావిత్రిబాయి స్త్రీల యొక్క అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. యూటీఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు కె రఘునాథ్, జిల్లా కార్యదర్శి యస్ కన్నయ్య మాట్లాడుతూ స్త్రీలు ఈనాడు ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే సావిత్రిబాయి పూలే చేసిన కృషి చేశారని చెప్పారు.మహిళలు ఈరోజు స్వేచ్ఛగా అనుభవిస్తున్న హక్కులు ఉన్నాయంటే ఆనాడు ఎంతో పోరాటం చేసి సాధించినవని చెప్పారు.ఈ జయంతి వేడుకల్లో మండల ప్రధాన కార్యదర్శి కె రాజారావు,ట్రెజరర్ జి దుక్కు, కార్యదర్శి కె సీతన్న, యూటీఎఫ్ సభ్యులు జె కొండలరావు,పరిడి హెచ్ ఎం వసంత,ఇతర పాఠశాలల ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

## శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయం నిర్మాణానికి విరాళం అందుకుంటున్న నిర్వాహకులు



**మునగపాక , జనవరి 3, మనసులో మాట..** శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణం లో భాగంగా పోతురాజు స్వామి వారి విగ్రహం విరాళాధాత బొడ్డేడ అప్పారావు కీర్తిశేషులు బొడ్డేడ బలరామ్మూర్తి (శ్రీరామ్ చంద్రుడు) జ్ఞాపకార్థం వారి కుమారుడు బొడ్డేడ శ్రీనివాసరావు సుధా దంపతులు విరాళము 15116/-ఇవ్వడం జరిగింది వారిని వారి కుటుంబాన్ని అమ్మవారు ఎల్లవేళలా కాపాడాలని అమ్మవారిని నిర్వాకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, తోటాడ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.భాగేశ్వరరావు, రాపేటి పరమేశ్వరరావు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# నిద్రమైకంలో పీసా కమిటీ

### గుట్టుచప్పుడు కాకుండా గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు

### కనుమరుగవుతున్న 1/70 చట్టం



**పాడేరు, జనవరి 03 (మనసులో మాట)..** అడవుల్లో ఆదివాసీలకే ఆస్తి హక్కు ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఐదో షెడ్యూల్ పరిధిలో తీసుకొచ్చిన 1/70 చట్టం ప్రస్తుతం నిర్వీర్యమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజనుల హక్కులను కాపాడాల్సిన అధికార యంత్రాంగం, పీసా కమిటీ సభ్యులే గిరిజనేతరులతో కుమ్మక్కై అక్రమాలకు ఊతమిస్తున్నారని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు బినామీ పేర్లతో, కొన్నిచోట్ల స్వయంగా భవన నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు కనిపించడం లేదు. బంగారం దుకాణాల సమీపంలో, ఆదిత్య ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా రోడ్డుకు ఆనుకొని భవాని పేరిట నిర్మాణం శరవేగంగా సాగుతున్నా అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పీసా కమిటీ నిద్ర మైకంలో ఉందని, కొందరు సభ్యులు కుమ్మకయ్యారనే ఆరోపణలు బలపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి 1/70 చట్టాన్ని కాపాడాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు

**(మనసులో మాట ) జనవరి 3** గిరిజన ప్రాంతాల్లో ఎవరు అడిగేవారు ఉండరనే భావనతో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల పేరుతో మంజూరైన ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్న ఘటన జి.మాడుగుల మండలం, కోరాపల్లి పంచాయతీ, కోరపల్లి గ్రామంలో వెలుగులోకి వచ్చింది. అక్రమాలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెదేపా కోరాపల్లి క్లస్టర్ ఇంచార్జి శ్రీనివాస్ నాయుడు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జి.మాడుగుల మండలం, కోరాపల్లి పంచాయతీ పరిధిలోని కోరపల్లి గ్రామంలో 2020%-%2021 సంవత్సరంలో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయనీ, అయితే ఆ డ్రైనేజీ పనులు జరగకుండా, సంబంధిత శాఖ అధికారులు మరియు కాంట్రాక్టర్ కుమ్మక్కై పనులు పూర్తయినట్లు రికార్డుల్లో చూపించి లక్షల రూపాయల నిధులను మింగేశారనే ఆరోపణలు స్థానిక గ్రామస్తులు చేశారు. డ్రైనేజీ పనులు జరగకపోయినా బిల్లులు వేసి డబ్బులు డ్రా చేయడం ద్వారా అక్రమాలు జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై సంబంధిత జేఈని ప్రశ్నిస్తే కాంట్రాక్టర్‌ను అడగమని, కాంట్రాక్టర్‌ను నిలదీస్తే జేఈను అడగమని ఒకరిపై ఒకరు నెపం నెట్టేస్తూ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇది ముందస్తుగా ప్లాన్ చేసిన అవినీతి వ్యవహారమని గ్రామస్తులు మండిపడుతున్నారు. డ్రైనేజీ పనులు జరగకపోవడంతో గ్రామంలో ఇప్పటికీ మురుగు నీరు వీధుల్లోనే నిలిచిపోయి, దోమల బెడద పెరిగి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో గిరిజన గ్రామాలను మోసం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

## ఎస్సీ జెడ్ లో గల ఎస్ వి ఎస్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదాలపై వివరాలు అడిగి తెలుసుకున్న హోంమంత్రి అనిత



**అచ్చుతాపురం జనవరి 3 మనసు లో మాట.** రాంబిల్లి మండలం సెజ్ పరిధిలోని ఎస్వీఎస్ కెమికల్స్‌లో జరిగిన ప్రమాదంపై స్పందించిన రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఏపీఐఐసీ జడ్ ఎం గార్ల తో లతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంటలను వెంటనే అదుపులోకి తీసుకురావాలని ఫైర్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని,అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ,అధికారులతో ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

## కార్మికుల సభకు తరలి రావాలి

**అచ్చుతాపురం జనవరి 3 మనసులో మాట.** సిఐటియు ఆల్ ఇండియా మహాసభల ముగింపు సందర్భంగా రేపు ఉమెన్స్ కాలేజీ అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ టౌన్ కొత్త రోడ్ వద్ద మున్సిపల్ స్టేడియంలో జరిగే కార్మికుల బహిరంగ సభను జయప్రదం చేయాలని అచ్చుతాపురం మండలం మోసయ్యపేట గ్రామం లో ఇంటింటా మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) కన్వీనర్ ఆర్ లక్ష్మి , కడారి కాసులమ్మ, ఉష, అన్నపూర్ణ పాల్గొన్నారు.




# ఘనంగా సావిత్రిభాయి పూలే జయంతి

### - మహిళ టీచర్లకు ఘనంగా సత్కారం



దేవరాపల్లి, జనవరి 3, (మనసులో మాట) : మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతదేశంలోని మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి స్థానిక ప్రధానోపాధ్యాయులు డి ఎస్ ఎస్ వి ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మహిళలపై వివక్షత, వితంతు బహిష్కరణ, సతీసహగమనం అధికంగా ఉండే రోజుల్లో అన్నింటిని వ్యతిరేకించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అన్నారు. బాల్య వివాహాలను రూపుమాపడానికి, మహిళా వివక్షతను నిర్మూలించడానికి మహిళలల్లో చైతన్యం తీసుకురావడమే ముఖ్యమైన పరిష్కారమని భావించి భారతదేశంలో మొట్టమొదటి సారిగా మహిళలకు ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను బోధించినటువంటి ఏకైక మహిళ సావిత్రిబాయి పూలే అన్నారు. పూలే ఆదర్శంగా తీసుకుని బాలికలందరూ మరింత మెరుగైన విద్యావంతులు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, ఎం. మహేశ్వరరావు, త్రినాథ్, జగన్, మనోహర్, మాధవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పామ్ ఆయిల్ రైతులను ఆదుకోవాలి

### పామ్ ఆయిల్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు (రవి రాజు)



**అనకాపల్లి రూరల్, జనవరి 3 (మనసులో మాట):** రాష్ట్రంలో ఉన్న ఫామ్ ఆయిల్ రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవిఎన్ మాధవ్ కు వినతి పత్రం అందజేశారు. శనివారం అనకాపల్లి జిల్లా ఫామ్ ఆయిల్ రైతు సంఘం నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఫామ్ ఆయిల్ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మాధవ్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఆయన వివరించారు. ఫామ్ ఆయిల్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సీత రామరాజు (రవిరాజు) మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల హెక్టార్లలో ఫామ్ ఆయిల్ పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు. భారీ ఎత్తున పంట సాగు చేస్తున్నప్పటికీ రాష్ట్రంలో పెదవేగ లో మాత్రమే ఆయిల్ పరిశ్రమ పెట్టారన్నారు. ఈ పరిశ్రమ పాతది కావడంతో ఉత్పత్తి తక్కువగా వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పంట సాగును చేసే రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని పెదవేగ అలాగే ఉమ్మడి గోదావరి జిల్లాలలో మరొకటి పరిశ్రమ ను ఏర్పాటు చేయాలని కోరారు. అధునాతన పరిశ్రమలు ఏర్పాటు చేయడం వలన పామాయిల్ దిగుబడి పెరిగి రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. తెలంగాణలో ఫామ్ ఆయిల్ రైతులకు గిట్టుబాటు ధర ఇస్తున్నారని అదే విధంగా ఆంధ్రాలోనూ కూడా ఫామాయిల్ రైతులకు అందజేసే విధంగా కృషి చేయాలని మాధవ్ ను పామాయిల్ రైతు సంఘం కోరినట్టు ఆయన వివరించారు. సమస్యలు విన్న తర్వాత మాధవ్ మంచిగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫామ్ ఆయిల్ రైతు సంఘం నేతలు పొలమరశెట్టి నాగేశ్వరరావు, బివిఎస్ వర్మ, బుద్ధ మహేష్, మల్ల నాయుడు, కడియం శ్రీను, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

### జిల్లాలో రెండో రోజు 169 గ్రామాల్లో

# "మీ భూమి - మీ హక్కు" పట్టాల పంపిణీ



**పాడేరు జనవరి 03 (మనులో మాట).** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా "మీ భూమి - మీ హక్కు" రాజముద్రతో కూడిన పట్టాల పంపిణీ కార్యక్రమం జిల్లాలో రెండో రోజుకు చేరింది. జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 169 గ్రామాల్లో ఈ పట్టాల పంపిణీ జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం హుకుంపేట మండలం రాప గ్రామంలో సర్పంచ్ కొప్పుల దేవుడమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో సరైన భూ పట్టాలు లేక ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేకపోయిన రైతులకు ఈ కొత్త పట్టాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యమంత్రి చొరవతో ఈ పట్టాలు అందించడం రైతులకు భద్రత కల్పిస్తోందని, గ్రామ ప్రజల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పాడేరు ఇన్‌చార్జ్ ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు మాట్లాడుతూ రాప గ్రామంలో 166 మంది రైతులకు రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. రీ సర్వే ద్వారా భూ సరిహద్దు వివాదాలు తొలగి, స్పష్టమైన యాజమాన్య హక్కులు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చదువుల తల్లి సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలు



**అచ్యుతాపురం జనవరి 3 మనసులో మాట..** ఈ రోజు చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూ.టీ.ఎఫ్) ఆధ్వర్యంలో అచ్యుతాపురం మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో యూటీఫ్ రాష్ట్ర కౌన్సెలర్ ఎం వెంకటప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సావిత్రీబాయి ఘనతను తెలిపే నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కొండకర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరిన సావిత్రీబాయి జన్మదిన వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు , వ్యయామోపాధ్యాయులు రాము ఉప్పాడ లు పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. అచ్యుతాపురం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన వేడుకల్లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీమతి వి శ్రీలక్ష్మి పాల్గొని సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి స్ఫూర్తితో బాలికలంతా కష్టపడి చదవాలని స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించాలని కోరారు సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలే తో కలసి బాలికల విద్య కోసం ఎంతగానో కృషిచేసారని, సావిత్రీబాయి పూలే ఈ సమాజంలోని అనేక దూరాచారాలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సెలర్ వెంకటప్పారావు , జిల్లా కార్యదర్శి రాము ఉప్పాడ, మండల శాఖ అధ్యక్షుడు రవి, ప్రధానకార్యదర్శి సూర్యలక్ష్మి, గణేష్, ఇందు, కెజిబివి ప్రిన్సిపాల్ ఉమాదేవి పాల్గొన్నారు.

### అనకాపల్లి లో ఘనంగా

# గోదాదేవి కి సారె ఊరేగింపు

### రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మెన్ మళ్ళ సురేంద్ర, దేవస్థాన చైర్మెన్ బొడ్డేడ మురళీ లచే సారె కార్యక్రమం ప్రారంభం



**అనకాపల్లి, జనవరి 3 (మనసు లో మాట):** అనకాపల్లి సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణస్వామి, శ్రీ సూర్య నారాయణస్వామి వార్ల దేవస్థానం లో సత్యదేవా భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీ గోదాదేవి అమ్మవారి కి శనివారం కనుల పండగగా సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దేవస్థాన చైర్మెన్ బొడ్డేడ మురళీ అహ్వానం మేరకు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, 80 వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ బుద్ధ శ్రీనివాసరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శ్రీనివాసరావు, తదితరులు సారె ఊరేగింపు కార్యక్రమం ప్రారంభించారు. కాగా రకరకాల పిండివంటలతో పెద్ద ఎత్తున మహిళలతో నిర్వహించిన ఈ సారె ఊరేగింపు కార్యక్రమం దేవస్థానం నుంచి బయలుదేరి సత్తెమ్మతల్లి గుడి రోడ్డు, శ్రీ గౌరీ సేవాసంఘం గుడి రోడ్డు, పార్కు సెంటర్, శ్రీ గౌరీ గ్రంథాలయం రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా దేవస్థానం కు చేరుకుంది. అనంతరం భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మెన్ బొడ్డేడ మురళీ, ఈవో బి. మురళీకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు కర్రీ లక్ష్మీ నూకరాజు, సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి భరత్, రేబాక వరలక్ష్మి ఈశ్వర అప్పారావు, మారిశెట్టి అరుణ భాస్కరరావు, తురకలపూడి ఈశ్వర్, దేవస్థానం ప్రధాన అర్చకులు విద్యాసాగర్, అటెండర్ అనపర్తి శంకర్రావు, భక్త బృందం అధ్యక్షురాలు కమల వారి బృందం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి అధికారుల సమీక్ష

దేవరాపల్లి, జనవరి 3, (మనసులో మాట) : ప్రతీ చిన్న విషయానికి తగాదాలు పడి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుని కక్షలు పెంచుకోవద్దని జిల్లా డివిజనల్ డెవలెప్మెంటు అధికారిణి మంజుల వాణి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ఎంఎల్సీసీ (మండల స్థాయి సమన్వయ కమిటీ) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైవాడ రిజర్వాయిరు నిర్మాణ సమయంలో భూమి కోల్పోయిన తనకు ఇచ్చిన ఇంటి స్థలాన్ని వేరొక ఆక్రమించుకున్నారని, తన స్థలం తనకు ఇప్పించాలంటూ కతరాజు దేముడు చేసిన ఫిర్యాదుపై ఆమె విచారణ చేశారు. ఇరు వర్గాల వారిని పిలిపించి ఫిర్యాదు దారుడి ఇంటి స్థల సమస్యని పరిష్కరించారు. ఎ. కొత్తపల్లి నుంచి వచ్చిన భూ సమస్యపై విచారణ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కె. అప్పారావు, ఎంపీడీఓ ఎం. వి సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

# పరిష్కార దిశగా చర్యలు



**హుకుంపేటనవంబర్ 03 మనుసు లో మాట..** మండలంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజా వేదిక కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు శతక బొంజు బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వేదికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణం, అక్రమ కట్టడాలు, మౌలిక వసతుల లోపాలు వంటి అంశాలపై ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు నమోదయ్యాయని పేర్కొన్నారు. పాతకోట పంచాయతీ పాలెం గ్రామానికి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు కొర్రా నర్సింగరావు పెద్దచాట్టు రోడ్డు సమస్యపై ప్రజా వేదికలో విన్నవించగా, గతంలో సమర్పించిన మూడు అర్జీలను 12 రోజుల్లోనే పరిష్కరించినందుకు గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఐటిడిఏ స్పందనలో వివిధ గ్రామాల ప్రజలు సమర్పించిన అర్జీలను మండల అధికారులు స్వీకరించి, వాటిని సమయపాలనతో పరిష్కరించి గ్రామాభివృద్ధికి సహకరించాలని దొన్నుదొర ఆదేశించారు. ప్రజా వేదికల ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి కొమ్మ. రమ్మ, అరకు మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, మహిళా కార్యదర్శి సాగర సత్యవతి,, సర్పంచ్ సోమిలి సత్యవతి, క్లస్టర్ ఇంచార్జి కూడేలి నూకరాజు. పాల్గొన్నారు

# ఘనంగా కొణతాల జన్మదిన వేడుకలు

### అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన కూటమి శ్రేణులు



**అనకాపల్లి రూరల్, జనవరి 3 (మనసులో మాట):** మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాల వేడుకలు ఆదివారం నిర్వహించడానికి భారీ ఎత్తున కార్యక్రమాలు చేపట్టారు. సందర్భంగా కూటమి నాయకులు చేపట్టిన పలు సాంస్కృతిక, క్రీడా, వైద్య కార్యక్రమాలలో భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో బోండా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్ కి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణ జన్మదిన వారోత్సవాల భాగంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణకి, రక్తదానం చేసిన యువతకు, దీనికి సహకరించిన గ్రామ ప్రజలకు, కూటమి నాయకులకు, వీర మహిళలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ అలాగే స్కూల్ పిల్లలకు పెన్నులు, పుస్తకాలు, పెన్సిల్లు, అట్టలు పంపిణీ చేశారు. అనంతరం రక్తదానం చేసిన యువతకు రక్తదాన సర్టిఫికెట్లు అందజేసి రక్తదాన శిబిర యాజమాన్యానికి గౌరవించి సత్కరించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 72 మంది రక్తదానం చేయడానికి ముందుకు రావడం విశేషం.

## రైతులకు రాజముద్రతో పాస్ పుస్తకాలు పంపిణీ



**దేవరాపల్లి, జనవరి 3, (మనసులో మాట) :** మండలంలోని బోయిలకింతాడ, కలిగొట్ల గ్రామాల్లో శనివారం తహసీల్దార్ పి. లక్ష్మీదేవి ఆధ్వర్యంలో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిమి నాగేశ్వరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షులు కొమర బాబురావు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ వైస్ చైర్మన్ కొప్పాక కాసుబాబు, వీఆర్వోలు వి. రామకృష్ణ, ఎస్. బంగారప్ప, రైతులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
ఆదివారం 4 జనవరి 2025


# కార్యకర్తలపై ప్రమాణాల ఒత్తిడి..

## రహస్య సమావేశాలతో వేడెక్కిన రాజకీయం

**పిఠాపురం, మనసులో మాట జనవరి 3:** పిఠాపురం గడ్డ నుండే జనసేన కమిటీల నియామకం మొదలవుతుందని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో, నియోజకవర్గ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి పర్యవేక్షణలో గ్రామ కమిటీల ఎంపిక ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి కాగా, ప్రస్తుతం జరగబోయే మండల అధ్యక్షుల నియామకం మాత్రం వివాదాలకు దారితీస్తోంది.

**ప్రజాస్వామ్యానికి తూట్లు:** గ్రామ స్థాయి కమిటీల్లో కార్యకర్తల అభీష్టం మేరకు సమర్థులకు అవకాశం కల్పించి, వారిచే ప్రమాణ స్వీకారం చేయించిన విధానంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. అయితే, మండల అధ్యక్ష పదవుల కోసం పోటీ పడుతున్న కొందరు అభ్యర్థులు అధిష్టానం ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్యకర్తలను మభ్యపెట్టడమే కాకుండా, వారిని రహస్య ప్రాంతాలకు పిలిపించి సమావేశాలు ఏర్పాటు చేయడం కలకలం రేపుతోంది.

**భక్తి సాకుతో 'బంధీ' రాజకీయాలు..**
ముఖ్యంగా తమకే మద్దతు తెలపాలంటూ కార్యకర్తలతో భగవద్గీత, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలపై ప్రమాణాలు చేయించుకోవడం తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాల్సిన తరుణంలో, ఇలాంటి 'ప్రమాణాల' రాజకీయాలతో కార్యకర్తలను మానసిక ఒత్తిడికి గురిచేయడంపై క్షేత్రస్థాయిలో అసహనం వ్యక్తమవుతోంది.

**అధిష్టానం దృష్టికి అసమ్మతి..**
పారదర్శకమైన ఎంపిక జరుగుతుందని ఆశించిన నిజాయితీ గల కార్యకర్తలు, ఈ పరిణామాలపై ఆందోళన చెందుతున్నారు. పవన్ కళ్యాణ్ ఆశించిన 'మార్పు' పిఠాపురంలో ఇలాంటి చర్యల వల్ల పక్కదారి పట్టే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై పార్టీ ముఖ్య నేతలు తక్షణమే స్పందించి, ప్రలోభాలకు తావులేకుండా మండల కమిటీలను నియమించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

## ఎల్‌బీఎస్ఎన్ఏఏ శిక్షణకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హాజరు


- జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్‌కు పూర్తి అదనపు బాధ్యతలు
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి భారత ప్రభుత్వ డీఓపీటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 24వ విడత మిడ్ కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఎంసీటీపీ-ఫేజ్-III) శిక్షణ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ శిక్షణ లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఎస్ఎన్ఏఏ), ముస్సోరిలో ఈ నెల 5 నుండి 30వ తేదీ వరకు జరుగనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తూ, కలెక్టర్ శిక్షణ కాలంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్‌కు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. జిల్లా పరిపాలనా పనులకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. కలెక్టర్ శిక్షణకు హాజరయ్యే కాలంలో జిల్లా పరిపాలనకు సంబంధించిన అన్ని విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కార బాధ్యతలను జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ పర్యవేక్షిస్తారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు.





## గోదావరిలో 'మన శంకర వర్రప్రసాద్ గారు' సంబరాలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో "గోదావరిలో మన శంకర వరప్రసాద్ గారు" సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 40 పడవలతో గోదావరిలో సంబరాలు నిర్వహించడంతో సందడి నెలకుంది. ఈ కార్యక్రమంలో మెగాభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ కళాశాలలో జాతీయ స్థాయి సింపోజియం

### - మహిళా సాధికారతకు సావిత్రిబాయి పూలే ఆదర్శం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** సమాజ నిర్మాణంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని, వృత్తి-వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. శనివారం స్థానిక రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల (అటానమస్) లోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని "మహిళా విద్యావేత్తల సాధికారత - వృత్తిపరమైన, వ్యక్తిగత సమతుల్యత" అంశంపై హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన జాతీయ స్థాయి సింపోజియంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా రావిపాటి శైలజా మాట్లాడుతూ మహిళలు తమ రాజ్యాంగ హక్కులు, ఆర్థిక అక్షరాస్యతతో పాటు పోక్స్ చట్టం-2013పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అధ్యక్ష ప్రసంగంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ దేశంలోని పురాతన రెసిడెన్సీ కళాశాలల్లో ఒకటైన ఈ సంస్థ మహిళా అధ్యాపకుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం కళాశాలలో క్రెచ్ (బేబీ కేర్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. జిల్లా మహిళా సంక్షేమ అధికారిణి టీ శ్రీదేవి మాట్లాడుతూ రాజమండ్రి గడ్డ నుంచి దుర్గాభాయి దేశ్‌ముఖ్ వంటి మహనీయులు మహిళా చైతన్యానికి దారితీశారని గుర్తుచేశారు. సీసీఈ-ఏపీ అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ తులసి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే పోరాట స్ఫూర్తి వల్లే నేడు మహిళలు విద్యా రంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. మహిళా అధ్యాపకులు మెంటర్లుగా, పరిపాలకులుగా బహుముఖ పాత్రలు పోషిస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ పీ విజయ నిర్మల అక్షరాస్యత ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, సామాజిక-ఆర్థిక పరిస్థితులు విద్యకు అడ్డంకి కాకూడదన్నారు.

**ఝాన్సీ శిరీషకు ప్రత్యేక సన్మానం..**
2012 డీఎస్సీ ద్వారా తెలుగు పండితులుగా నియమితులైన ఝాన్సీ శిరీషని డాక్టర్ రాయపాటి శైలజ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్ కే తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ పీ సురేఖ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బీ దుర్గాలక్ష్మి, నిడదవోలు మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రుద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సుకు జీఆర్‌టీ జువెలర్స్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారం అందించాయి.

## టీడీపీ ఓట్లు కోసం పండుగలు చేయదు

### సాంప్రదాయాలకు విలువ ఇస్తుంది -ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - రెండవ రోజు ఉత్సాహంగా జరిగిన ముగ్గుల పోటీలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** తెలుగుదేశం పార్టీ ఓట్లు కోసం పండుగలు చేయదని, సాంప్రదాయాలకు విలువ ఇస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. కేవలం మహిళలను ఉత్సాహ పరిచేందుకే ప్రతి ఏటా తమ భవాని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భవానీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ముగ్గుల పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక 44, 45, 46, 47, 48, 49 డివిజన్లలో జరిగిన ఈ ముగ్గుల పోటీలకు అధిక సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా డివిజన్లలోని ముగ్గులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "టీడీపీ ఓట్లు కోసం పండుగలు చేయదన్నారు. సంప్రదాయాలను గుర్తు చేస్తూ ప్రజలకు చేరువగా ఉంటుందన్నారు. ప్రజల ఆనందం కోసం, సమాజంలో సాంస్కృతిక విలువలను పెంపొందించడమే లక్ష్యం" అని అన్నారు. నగర అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలతో పనులు జరుగుతున్నాయని, బ్లేడ్, గంజాయిపై కఠిన చర్యలు తీసుకుని నియంత్రించినట్లు తెలిపారు. ప్రజల భద్రత తమ బాధ్యతగా తీసుకున్నామని, అవసరమైతే రౌడీ షీట్‌లు కూడా ఓపెన్ చేస్తున్నామని చెప్పారు. మహిళల రక్షణార్థం ప్రారంభించిన మీ భద్రత మా బాధ్యత, 'మహిళ రక్షక్' కార్యక్రమం రాష్ట్రంలో ప్రత్యేకమైనదని, ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి రక్షణ కల్పిస్తారని వివరించారు. నగరంలోని ప్రతి డివిజన్లో విద్యుత్తు సమస్యలతో పాటు స్థానికంగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు. పార్కులను అందంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ప్రేమ, సహకారం తమకు ప్రేరణనిస్తోందని ఆయన అభినందించారు. కాగా ఆయా డివిజన్లలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కోడి పందాలు, గొబ్బెమ్మలు, హరి దాసులు, భోగి మంటలతో సంక్రాంతి శోభను ముందే తీసుకువచ్చారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## గ్యాంబ్లింగ్ కేసులు ముద్దాలను బైండోవర్ చేయాలి

### శాంతిభద్ర భద్రతలపై ప్రత్యేకనిఘా పెట్టాలి - ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్





**అమలాపురం (మనసులో మాట) జనవరి 3..** సంక్రాంతి పండుగ నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్యాంబ్లింగ్ కేసులు ముద్దాయిలపై ప్రత్యేక నిఘా పెట్టి బైండోవర్ చేసి వివాదాస్పదమైన ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ ఫికెట్ ఏర్పాటు చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జివిఅశోక్ కుమార్ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం అమలాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో శాంతి భద్రతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2023 - 25 మధ్య కాలంలో జరిగిన సంఘటనపై విశ్లేషించి భవిష్యత్తులో పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పి రాహుల్ మీనాకు సూచించారు. స్థానిక సమస్యలపై ముందస్తు సమాచారం సేకరించి రౌడీషీటర్లు అల్లర్లను ప్రేరేపించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచి అవసరమైతే 107 కింద బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో పరిస్థితులను బట్టి సెక్షన్ 30, 144 వంటి నిషేధాజ్ఞలను కఠినంగా అమలు చేయాలని ఐజీ హెచ్చరించారు. ఇటీవల రావులపాలెం లో జరిగిన ఘటన ద్రాక్షారామం గ్రామంలో శివలింగం ధ్వంసం మరియు న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న పరిణామాలు పై ఐజీ క్షుణ్ణంగా సమీక్షించారు. ద్రాక్షారామం శివలింగం కేసులో నిందితున్ని త్వరగా పట్టుకున్నందుకు, రామచంద్రపురం మైనర్ బాలిక హత్య కేసును సమర్థవంతంగా ఛేదించినందుకుగాను జిల్లా ఎస్పీ రాహుల్ మీనాను సిబ్బందిని ఐజీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో ఏఆర్ డిఎస్ పి సంబంధిత సబ్ డివిజన్ అధికారులతో కలిసి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించాలన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు రాజకీయ, కుల సంఘాల నాయకులు విద్యావేత్తలు పోలీస్ అధికారులకు సహకారం అందించాలని ఐజీ కోరారు. ఈ సమావేశంలో డిఎస్పీలు సిఐలు ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా క్రీడా పోటీలు

### - ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ

**కాకినాడ( మనసులో మాట) జనవరి 3..** దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలాగా క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం, 217వ లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా అంధ విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయి ఆట పోటీలను కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనిషా, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, కమిషనర్ సత్యనారాయణ, జిల్లా ఖజానా అధికారి గణేష్, విభిన్న హిజ్రాల వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాకులు ఏవి శ్రీనివాసు తదితరులు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లోనే రాణించాలన్నారు. అనంతరం 100,50 పరుగు పందాలు, తగ్గ ఆఫ్ వార్, చదరంగం, క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీమ్, వివిధ అంధ విభిన్న ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల హక్కులు, ఆస్తులను కాపాడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ఓదూరులో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం(మనసులో మాట) జనవరి 3..** రాష్ట్రంలో గత ప్రభుత్వ విధానాలతో ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరించి కూటమి ప్రభుత్వం రాజముద్ర తో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. నియోజవర్గం ఓదూరు గ్రామంలో తహశీల్దార్ మృత్యుంజయరావు అధ్యక్షతన రైతులకు పాసుబుక్కులు పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పంపిణీ చేసిన పాసు పుస్తకాలను రద్దు చేసి, నిర్దిష్టమైన సమాచారంతో రాజముద్రతో రైతులకు అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అంతులేని భూ సమస్యలు ఉత్పన్నం కావడంతో కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతుల హక్కులను కాపాడుతూ, వారి ఆస్తులకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వశీ పనిచేస్తుందన్నారు. భూ సంబంధిత సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చేసి అన్నదాతల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. తహసిల్దార్ మృత్యుంజయరావు, వీఆర్వో లత, సీనియర్ అసిస్టెంట్ రామారావు, రామచంద్రపురం రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కూటమి పార్టీ నాయకులు అద్దంకి సత్య సాయి బాబా, సలాది కృష్ణ, కొండేపూడి శ్రీ నాగ తిరుపతిరావు, బుంగా అప్పారావు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు, అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అంగన్వాడి వర్కర్స్ గా పదోన్నతి పొందిన అంగన్వాడీ మినీ వర్కర్స్

### ఆర్డర్ కాపీలను అందజేసిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి




**కాకినాడ (మనసులో మాట) జనవరి 3..** కాకినాడ అర్బన్ పరిధిలో అంగన్వాడి వర్కర్స్ గా పదోన్నతి పొందిన 10 మంది అంగన్వాడీ మినీ వర్కర్స్ కు జగన్నాథపురం శాసనసభ్యుల వారి క్యాంపు కార్యాలయం ఉంది నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డర్ కాపీలను కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు అంగన్వాడి మినీ వర్కర్స్కు అందజేశారు. ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్వాడి సెంటర్ నందు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి సహకరిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ ఎస్ సీడి పి ఓ జ్యోతి, దయామని, శ్రీ గౌరీ, అరుణశ్రీ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల లో ప్రోటోకాల్ నిబంధన కచ్చితంగా పాటించాలి..



**కాకినాడ (మనసులో మాట) జనవరి 3..** ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల సందర్భంగా ప్రదర్శించే ఫోటో ఫ్లెక్సీలలో ప్రొటోకాల్ నిబంధలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో ఆయన పిఠాపురం నియోజకవర్గంలోని తహసీల్దార్ లు, యంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, విఆర్ఓలలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శుక్రవారం పిఠాపురం అంబేద్కర్ భవన్ లో జరిగిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఫ్లెక్సీ ల ఏర్పాటు అంశంలో ప్రోటోకాల్ సక్రమంగా అమలు కాలేదన్న అభ్యంతారాలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించి అధికారులకు ప్రోటోకాల్ నిబంధనల అమలు స్పష్టమైన ఆదేశాలు జారీసారు. ఈసందర్భంగా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు నిర్వహించే సందర్భాలలో ప్రజాప్రతినిధులకు పాటించవలసిన ప్రోటోకాల్ మర్యాదలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అధికారులు తూచ తప్పకుండా ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ అమలు పర్యవేక్షణకు కలెక్టరేట్ లో ప్రత్యేక సెక్షన్స్ ఉందని, అధికారులు ఫ్లెక్సీ లు, ఇతర ప్రదర్శన ఐటమ్ లను ఏర్పాటు చేసే ముందు ఈ సెక్షన్స్ పరిశీలన, క్లియరెన్స్ పొందాలని ఆదేశించారు. అధికారులు ఎవరైనా ప్రొటొకాల్ నిబంధనలను ఉల్లంఘించి, అవాంఛిత వివాదాలు, ఉద్రికతలకు దారితీసినందుకు బాద్యులైతే తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిక జారీ చేశారు.





# బిక్షాటనకు స్వస్తి పలకండి

**- పెద్దాపురం డీఎస్పీ డి. శ్రీ హరి రాజు**

**కాకినాడ( మనసులో మాట) జనవరి 3..** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చట్టాలను గౌరవిస్తూ భిక్షాటనకు స్వస్తి పలకాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ వారి ఉత్తర్వులు మేరకు పెద్దాపురం డిఎస్పి డి.శ్రీహరి రాజు కోరారు. గతంలో కొన్ని సంచార జాతులు బిక్షాటనపై ఆధారపడి జీవించే వారిని ప్రస్తుత సమాజంలో మానవ వనరుల కొరత అధికంగా ఉందని ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని, పని అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని , చిన్న చిన్న సంస్థలు, వ్యవసాయదారులు శ్రామికుల కొరతతో ఇబ్బంది పడుతున్నారని , ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి, దేశం పట్ల బాధ్యతగా మెలగాల ని పత్రికా ముఖంగా తెలియజేశారు. పని కావాల్సినవారు స్థానిక పోలీస్ స్టేషన్ ను సంప్రదిస్తే, స్థానికంగా పని కల్పిస్తామని , చట్ట నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాలలో భిక్షాటనకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డిఎస్పీ తెలిపారు.

### వికాస ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్లో

# 5న జాబ్ మేళా

**- వికాస ప్రాజెక్టు మేనేజర్ కే. లచ్చారావ్**

**కాకినాడ (మనసులో మాట) జనవరి 3..** వికాస ఆధ్వర్యంలో ఈ నెల 5 వ తేదీ సోమవారం వికాస కార్యాలయం , కలెక్టరేట్ , కాకినాడ లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబేళాలో బజాజ్ కెపిటల్లో ఫైనాన్షియల్ అడ్వయిజర్ , శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్లో టెలికాలింగ్ ఎగ్జిక్యూటివ్ , సర్వే, సేల్స్ ఎగ్జిక్యూటివ్ , ఇండో ఎం.ఐ.ఎం , ఇంజి , హెూండాయ్ మోబీస్ , ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నిషియన్ , డెక్కన్ కెమికల్స్ ట్రైనీ (ప్రొడక్షన్ & మెకానికల్ మెయిన్టెనెన్స్) , ఫాక్స్కాన్ కంపెనీలో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు . అలాగే డి.డి.యు.జి.కె.వై సెంటర్ ద్వారా టు వీలర్ టెక్నిషియన్ , వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తారు. ఈ ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి , ఇంటర్ , డిగ్రీ , ఐ.టి.ఐ , డిప్లొమో , బి.ఎస్.సి కెమిస్ట్రీ , బి.టెక్ ఎం.ఎస్.సి కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరం లోపు అభ్యర్థులు అర్హులు . వీరికి నెలకు రూ .12,000 నుండి రూ . 25,000 వరకు జీతం ం ఇన్సెంటివ్స్ , భోజనం , వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది.ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 05 వ తేదీ సోమవారం వికాస కార్యాలయం లో కలెక్టరేట్ కాకినాడ వద్ద ఉదయం 9 గంట లకు సర్టిఫికెట్స్ జీరాక్స్ నకళ్ళతో హాజరుకావలెను . మరిన్ని వివరాలకు 7799376222 www.vikasajobs.com సంప్రదించవచ్చున్నన్నారు.

## సామర్లకోటలో వైభవంగా భీమేశ్వర స్వామి జన్మదిన వేడుకలు







పెద్దాపురం (మనసులో మాట) జనవరి 4; యావత్ భారతదేశంలోని పంచరామ క్షేత్రం గా ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం భీమేశ్వర స్వామి ఆరుద్ర జన్మ నక్షత్రం మహోత్సవాల అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం, చైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో అర్చకులు రాంబాబు శర్మ వెంకన్న శర్మ సత్యనారాయణమూర్తి వినయ్ శర్మ దత్తేశ్వర్ శర్మ తదితర పండితులు మహా రుద్రాభిషేకం, విశేష అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు భీమేశ్వర స్వామి ఆరుద్ర జన్మ నక్షత్ర పూజలకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రజలకు దద్దోజనం, కదంబం ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ సూపర్డెంట్ ఈశ్వరరావు, అన్నదాన ప్రతినిధి శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ ప్రతినిధులు వీరభద్రరావు, నాని పాల్గొన్నారు.

### జీవిత ఆశయం సాధించడానికి

# ఆధ్యాత్మిక జ్ఞానశక్తి అవసరం

**- ఆధ్యాత్మిక తాత్విక ధ్యానశక్తి ద్వారా జీవిత ఆశయం సాధించుకోవడానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూర్తుంది**

**- పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా సద్గురు**




**కాకినాడ (మనసులో మాట) జనవరి 3..** జీవిత ఆశయం సాధించడానికి మానసిక శక్తి, మనోధైర్యం, మానసిక సంకల్పంతో కూడిన ఆధ్యాత్మిక తాత్త్విక జ్ఞాన శక్తి అవసరం అని పీఠాధిపతి డా. ఉమర్ ఆలీషా సద్గురువర్యులు అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని విశ్వవిజ్ఞాని, పీఠాధిపతి డా. ఉమర్ ఆలీషా సద్గురువర్యుల అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన జ్ఞానమహాసభలో పీఠాధిపతి అనుగ్రహ భాషణం చేస్తూ మనసును స్థాయి పరుచుకునే తత్వము ఆధ్యాత్మిక తత్వమని, మన జీవితంలో ఏర్పడుతున్న చిన్న చిన్న వివాదాల నుండి తొలగి, నిరంతరం సుఖసంతోషాలతో జీవించడానికి మంచి చెడుల విశ్లేషణతో కూడిన మానసిక స్థితిని ఆధ్యాత్మిక తత్వం ద్వారా ఏర్పరచుకోవాలని ప్రబోధించారు. మనలో ఉన్న లోపాలను సవరించుకోకుండా ఎన్ని కార్యకలాపాలు చేసినా లాభం ఉండదని, మనలోని లోపాలను తొలగించుకునే విధానం ఆధ్యాత్మిక తత్త్వమని అన్నారు. మానవత్వాన్ని బోధించేదే మతం అని, మానవత్వాన్ని హరించేది మతం కాదు, రాక్షసత్వం అని అభివర్ణించారు.మన శరీరంలో గుండె, కిడ్నీలు మొదలైన అవయవాలు నిరంతరం శ్రమిస్తూ ఉన్నట్లుగా మన జీవితంలో మనమంతా ఆశయం వైపు పట్టుదలతో ప్రయత్నం చేసి, సాధించాలనే తపనతో ప్రయత్నించినప్పుడు ఆశయాన్ని సాధించి ఆనందం పొందవచ్చని తెలిపారు. మానసిక వ్యవస్థలో అనారోగ్యం ఏర్పడినట్లయితే అది శారీరకంగా, మానసికంగాను ఇబ్బందులకు గురిచేస్తుందని, మనసును తాత్త్విక జ్ఞాన శక్తితో నింపుకోవడానికి సద్గురు మార్గంలో త్రయీ సాధన ఆచరించాలని ప్రబోధించారు. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం గురు దక్షిణగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి ప్రకృతిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అమెరికా నుండి విచ్చేసిన కిరణ్ ప్రభ మాట్లాడుతూ ఈ పీఠం నిర్వహిస్తున్న బాలవికాస్ కార్యక్రమాలను కొనియాడారు. త్యాగం గురించి ప్రసంగిస్తూ ఈ పీఠంలో ట్రస్ట్ తరఫున చేసే కార్యక్రమాలను శ్లాఘించారు. మరొక అతిథి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా.కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతుల శంఖారావంతో సభ ప్రారంభమైంది. కార్యక్రమంలో తాత్త్విక బాల వికాస్ చిన్నారులు ఉర్వీష, వర్షిణి, కైవల్య జ్యోతి, నవ్యశ్రీ, భవిజ్ఞశ్రీ ప్రసంగాలు అందరినీ అలరించాయి. ఉమాముకుంద నేతృత్వంలో సంగీత విభావరి కీర్తనలు అందరినీ రంజింప చేశాయి. మదర్ ఇండియా ఇంటర్నేషనల్ ఛైర్మన్ పిల్లి తిరుపతిరావు మరియు వారి బృందం సద్గురువర్యులను సత్కరించారు.ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా పీఠాధిపతుల దివ్య హస్తాల మీదుగా మహిళా యువతకు డ్రెస్ పంపిణీ చేశారు. అలాగే దంగేటి రామకృష్ణ సహకారంతో పీఠాధిపతుల చేతుల మీదుగా ధాన్యపు కుచ్చుల పంపిణీ చేశారు.నూతన సంవత్సర విశేషాలను వై. ఉమేష్ కుమార్ సభకు తెలియజేయగా, అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు సభా వ్యాఖ్యానం చేశారు. కార్యక్రమానంతరం వివిధ ప్రదేశాల నుండి వచ్చిన అశేష భక్తజనులు సద్గురువర్యుల దర్శనం పొంది భోజన ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు శ్రీ ఏ.వి.వి. సత్యనారాయణ, శ్రీ పింగళి ఆనంద్ కుమార్, శ్రీ రేఖ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా 105మంది సద్గురువర్యాల నుండి మహా మంత్రోపదేశం పొందారు.

### కాకినాడ నగరంలో టెడ్కో గృహ సముదాయాల

# సమస్యల పరిష్కారానికి దశలవారీ చర్యలు

**- ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**



**కాకినాడ (మనసులో మాట) జనవరి 3..** కాకినాడ నగరంలోని టెడ్కో గృహ సముదాయాల వద్ద ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి దశలవారీగా చర్యలు చేపడతామని ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం ఆయన నగరంలోని దుమ్ములపేట ప్రాంతంలో డ్రైనేజ్ సమస్యను పరిశీలించారు.పర్లవపేట ప్రాంతాల్లోని టెడ్కో గృహ సముదాయాలను సందర్శించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు తుమ్మల రమేష్, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మెయిన్ డ్రైనేజ్‌కు సరైన ఔట్‌లెట్ లేకపోవడంతో మురికి నీరు బయటకు వెళ్లే అవకాశం లేక గృహ సముదాయాల మధ్యనున్న ఖాళీ ప్రదేశంలోనే నిల్వ అవుతోందని, దీంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని వివరించారు. ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కమిషనర్‌కు, వీధిలైట్లు సరిగా వెలగడం లేదన్న సమస్యను కూడా నివాసితులు తెలియజేశారు.ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ, టెడ్కో గృహ సముదాయాల వద్ద ప్రధానంగా నాలుగు సమస్యలను గుర్తించామని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల మురికి నీరు పారే వీలులేకపోతున్న విషయంపై తక్షణ చర్యలు తీసుకుంటామని, దీనికి సంబంధించి ఏఈకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అలాగే వీధిలైట్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాలువలపై ఆక్రమణలను కూడా గుర్తించామని, వాటిని తొలగించాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. నగరాన్ని అభివృద్ధిసుందరీకరణ దిశగా తీర్చిదిద్దడంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ పర్యటన అనంతరం రాజీవ్ గృహకల్ప సముదాయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించారు. అక్కడ వాష్‌బేసిన్ వద్ద కుళాయి సరిగా లేకపోవడాన్ని గుర్తించి, తక్షణమే కొత్త కుళాయి అమర్చాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, ఈఈ కనకారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, వాటర్ వర్క్స్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జగ్గంపేట గ్రామపంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలు, నగదు పంపిణీ



**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 3..** జగ్గంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీ శివ, జగ్గంపేట గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి నూతన సంవత్సరం, సంక్రాంతి పురస్కరించుకుని 40 మంది సిబ్బందికి నూతన వస్త్రాలు నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మండల టిడిపి అధ్యక్షుడు జీనుమణి బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, టౌన్ టిడిపి అధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి హాజరై పంచాయతీ సిబ్బంది అందరికీ నూతన వస్త్రాలు, ఒక్కొక్కరికి 600 రూపాయలు చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మణిబాబు, అప్పలరాజు మాట్లాడుతూ దేశ ప్రగతికి పంచాయతీలే పట్టుకొమ్మలని భావించి కూటమి ప్రభుత్వం పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుందని ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీరు వంటి మౌలిక వస్తువులు కల్పిస్తున్నారని జగ్గంపేట గ్రామపంచాయతీ మరింత అభివృద్ధి పథంలో నడిచే విధంగా జగ్గంపేటలో నాయకులందరూ కృషి చేస్తున్నారని నూతన సంవత్సర, సంక్రాంతి సందర్భంగా జగ్గంపేట గ్రామపంచాయతీ అన్ని విభాగాల సిబ్బందికి నూతన వస్త్రాలు నగదు పంపిణీ చేయడం జరిగిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, బండారు రాజా, రాయి సాయి, పీలా మహేష్, నలమాటి ఆనంద్, వైభోగుల కొండబాబు యాదవ్, సాంబత్తుల చంద్రశేఖర్, కోడూరి రమేష్, బండారు నాని, ముక్కాపాలు బాబు, చేలికాని హరిగోపాల్, మొరుకుర్తి రాజు, వాకారెడ్డి, జగ్గంపేట గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

# సావిత్రీబాయి పూలేకు మాజీ ఎంపీ భరత్ ఘన నివాళులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** సావిత్రీ భాయి పూలే జయంతిని నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్ ప్రాంగణంలో గల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భరత్ సావిత్రీబాయి పూలే జీవిత చరిత్రను వివరించారు. 1837 సంవత్సరం జనవరి 3వ తేదీన ఆమె జన్మించారని, తొమ్మిదవ ఏటనే జ్యోతి రావు పూలేతో బాల్య వివాహం జరిగిందన్నారు. భారత దేశపు మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరు గాంచిన ఈమె ఒక కవియిత్రి, సంఘసంస్కర్త కూడా అన్నారు. ఆమె భర్త జ్యోతీ రావు పూలేతో కలసి 1848 లో పూణే లో మొట్ట మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారని, కుల, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడి మహిళలు అట్టడుగు వర్గాల వారికి విద్య, సామాజిక హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు అని భరత్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొని ఆ స్త్రీ మూర్తికి నివాళులు అర్పించారు.



# ఖాకీ చొక్కాలో కమ్మని మమకారం

**వృద్ధులతో సీఐ సునీల్ కుమార్ నూతన సంవత్సర వేడుకలు!**

కాకినాడ (మనసులో మాట) జనవరి 3.. చట్టాన్ని అమలు చేయడంలో కఠినత్వం.. సమాజానికి భరోసా ఇవ్వడంలో కోమలత్వం.. ఈ రెండింటి కలయికే కాకినాడ పోర్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్. సాధారణంగా పోలీసులు అంటే లాఠీలు, కేసులు, కట్టుదిట్టమైన భద్రత మాత్రమే గుర్తొస్తాయి. కానీ, నూతన సంవత్సరం 2026 వేళ ఆయన తనలోని మానవీయ కోణాన్ని ఆవిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

**అవ్వల నవ్వుల్లో కొత్త వెలుగులు..**

నూతన సంవత్సర సంబరాలను ఆర్భాటాలకు లోనుకాకుండా, ఆదరణ కరువైన మాతృమూర్తుల మధ్య నిర్వహించి సీఐ సునీల్ కుమార్ బృందం ఆదర్శంగా నిలిచింది. స్వయంగా అమ్మల దగ్గరకు వెళ్లి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, నేనున్నాను అనే భరోసా కల్పించారు. కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేయడమే కాకుండా, వారి ఆశీస్సులు తీసుకోవడం అక్కడి వారిని భావోద్వేగానికి గురిచేసింది.

**శాంతి భద్రతలే కాదు.. సామాజిక బాధ్యత కూడా..**

దొంగల పట్ల సింహంలా గర్జించే ఖాకీ విభాగం, వృద్ధుల పట్ల మనవడిలా మారి చేసిన ఈ సేవ ప్రతి ఒక్కరి మనసు గెలుచుకుంది. "సమాజంలో స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, వృద్ధులకు రక్షణగా నిలవడమే మా లక్ష్యం" అని సీఐ సునీల్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అధికారులు మరియు యువత కూడా ఇదే స్ఫూర్తితో వృద్ధులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.కాకినాడ పోర్టు పోలీసుల ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. పోలీసులంటే భయం కాదు, భరోసా అని మరోసారి నిరూపించారు సునీల్ కుమార్ అండ్ టీం.

### స్వచ్ఛ రథం నిర్వహణ కోసం అర్హులైన వారి నుండి

# దరఖాస్తులు స్వీకరణ

**- డిపిఓ శాంత లక్ష్మి**

**అమలాపురం (మనసులో మాట) జనవరి 3:** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా లో అల్లవరం, అంబాజీపేట, కె.గంగవరం, రాజోలు, మామిడికుదురు, ముమ్మి డివరం, రామచంద్రపురం , రావులపాలెం మండలాల్లో ఒక యూనిట్ గా "స్వచ్ఛ రథం" నిర్వహణ కోసం అర్హులైన వ్యక్తులు సంస్థలు,స్క్రాప్ డీలర్లు,ఆపరేటర్ల నుండి దరఖాస్తులు ఆహ్వానించ బడుతున్నాయని జిల్లా పంచాయితీ అధికారిని డి శాంత లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.. ప్రతి మండలము ఒక యూనిట్ గా విడివిడిగా దరఖా స్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. మోడల్-1 దరఖాస్తులను సమర్పించడానికి ఆఖరి తేదీ జనవరి 7 గా నిర్ధారించామ న్నారు స్క్రాప్టింగ్, ఘన వ్యర్థాల సేకరణ లేదా పునర్వినియోగపరచదగిన పదార్థాల నిర్వహణలో కనీ సం మూడు సంవత్సరాల ధృవీకరించదగిన అనుభ వం కలిగి ఉండాలన్నారు. స్క్రాప్ లేదా పునర్వినియోగ పరచదగిన పదార్థాల నిర్వహణ కోసం చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్సు రిజిస్ట్రేషన్ కలిగి ఉం డాలన్నారు.దరఖాస్తుదారుడు ఆధార్ పాన్ కాపీ, నివాసం లేదా సంస్థ రిజిస్ట్రేషన్ రుజువు. అనుభవ ధృవీకరణ పత్రం మరియు సహాయక పత్రాలు సమర్పించాల న్నారు. స్క్రాప్ డీలింగ్ ఎంఆర్ఎఫ్ ఆపరేషన్ కోసం ట్రేడ్ లైసెన్స్ ఉండాలన్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ వర్తించి నట్లయితే గత మూడు సంవత్సరాల టర్నోవర్ స్టేట్ మెంట్ ఆదాయ పన్ను రిటర్న్లు సమర్పించాలన్నా రు స్వచ్ఛ రథం కోసం ప్రతిపాదించబడిన వాహనం వివరాలు =జ కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, కాలుష్య ధృవీకరణ పత్రం, బీమాధృవీకరణ పత్రం, ఫిట్ నెస్ సర్టిఫికేట్ జతపర చాలన్నారు.బ్యాంక్ పాసు బుక్ ఉమ్మడి ఆపరేషన్ వివరాలు, వర్తిస్తే స్క్రాప్ డీలర్ అమరిక వాహన యజమాని ం ఆపరేటర్ లవి సమర్పించాలన్నారు. అధికారుల నుండి నెలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పొందడానికి బిడ్డర్ కోట్ చేసిన మొత్తం సీలింగ్ పరిమితి మోడల్-1 కి రూ 25000 మోడల్- ×× కి రూ:21000/ లకు మించరాదన్నారు.పాస్ పోర్ట్ సైజ్ ఫోటో మరియు సంప్రదింపు వివరాలు,దరఖాస్తు దారుడు రూ.10,000/- డిమాండ్ డ్రాఫ్ట్ ను ఎంపీడీవో చిరునామాతో దరఖాస్తు తో పాటు సమర్పించాలనీ. ఇది తిరిగి చెల్లించబడదన్నారు. టెండర్ ఆమోదించుటకు గాని రద్దుపరచుటకు గాని మరియు వాయిదా వేయు టకు గాని జిల్లా పంచాయతీ అధికారి మరియు కన్వీనర్ వారికి పూర్తి అధికారశీ కలదన్నా రు. ఇతర వివరాలకు కార్యాలయపు ఫోన్ నెం.9247862775 నందు సంప్రదించాలని జిల్లా పంచాయి తీ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

### బ్రెయిలీ డే సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు

# న్యాయ అవగాహన

**- 'థర్డ్ ఐ' యాప్ ఆవిష్కరణ - డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి**



రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని "బ్రెయిలీ డే" సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్ స్టాండు సమీపంలోని జియోస్ స్కూల్లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్ శ్రీలక్ష్మి పాల్గొని దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు, సౌకర్యాలపై వివరించారు.ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహకారంతో విద్యార్థులకు బ్రెయిలీ స్టిక్స్ పంపిణీ చేశారు. థర్డ్ ఐ యాప్ ఆవిష్కరణ..చిరంజీవి తేజ అనే విద్యార్థి అభివృద్ధి చేసిన 'థర్డ్ ఐ యాప్' జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆవిష్కరించారు. ఈ "థర్డ్ ఐ" యాప్ ద్వారా చూపు లేని వారు సాధారణంగా రెండు కళ్లతో చేసే అనేక పనులను సులభంగా చేయవచ్చని తెలిపారు. ఈ యాప్ న్యూస్ రీడింగ్, డబ్బులు లెక్కపెట్టడం, తెలియని విషయాలకు సమాధానాలు ఇవ్వడం, వస్తువులను గుర్తించడం, అనువాదం, ఫొటో రీడర్, డాక్యుమెంట్ రీడర్, మార్గనిర్దేశం వంటి అనేక సౌకర్యాలను అందిస్తుందని వివరించారు. ఎదుటి వ్యక్తులను గుర్తించే సౌకర్యం కూడా ఇందులో ఉందన్నారు. ఈ యాప్ ఒక వారం రోజుల్లో గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉన్నా, న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా- శిశు సంక్షేమ శాఖ అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సభ్యులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు

**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 3..** తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జనవరి 6వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) కుటుంబం శనివారం విఐపి విరామ సమయంలో వెంకటేశ్వర స్వామి వారిని వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం కప్పి రంగనాయక మండపంలో అందించగా తీర్థప్రసాదాలు స్వీకరించారు. శనివారం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్చకులు స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు ఏకాంతంగా నిర్వహించారు. శనివారం వేకువ జాము నుండి వైకుంఠ ద్వారాలు తెరిచారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైకుంఠ ద్వారాల గుండా వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం అని ఆయన అన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నియోజవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆ స్వామి వారిని కోరుకున్నానని అన్నారు.

## మూఢత్వంతో స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించిన సామాజిక ఉద్యమనేత పూలే



**తణుకు,జనవరి 3 (మనసులో మాట)..** కట్టుబాట్లు, సంస్కృతీ సంప్రదాయాల పేరుతో మూఢత్వంతో స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించిన గొప్ప సామాజిక ఉద్యమనేత సావిత్రిబాయి పూలే అని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి అన్నారు.సామాజిక సంఘ సంస్కర్త సావిత్రబాయి పూలే 195 వ జయంతి శనివారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్ నందు మహిళా సమాఖ్య ,సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతులను చేయడంలో భాగంగా 1936-48ప్రాంతం లోనే తన భర్త జ్యోతిరావు పూలే తో కలసి సత్యశోధన సమాజ్ నెలకొల్పి మహిళా పాఠశాలలు ప్రారంభించి అన్ని కులాల మహిళలకు చదువు నేర్పించారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే కుల వివక్ష,మహిళల అణచివేతకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడారన్నారు.బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించడం జరిగిందన్నారు.వితంతులకు రక్షణగా నిలిచారన్నారు.స్త్రీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ఎనలేని కృషి చేసిన గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఆమె ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళా నాయకులు గిద్దాడ అన్నపూర్ణ, బంగారు లక్ష్మి, కంకిపాటి రమణ, అర్జీ శివపార్వతి, సిర్రా వాణి, మందుల మంగమ్మ, గూడెల్లి వసంత,సీపీఐ నాయకులు మందుల ముత్తయ్య, కొంబత్తుల రవికుమార్,బోడపాటి నారాయణ, మార్లపూడి బర్న తదితరులు సావిత్రి భాయి పూలేకు నివాళులర్పించారు.

## గోకవరం అదనపు ఎస్సైగా నాగమణి బాధ్యతలు



**గోకవరం (మనసులో మాట), జనవరి 3 :** ఏజెన్సీ ముఖద్వారం మండల కేంద్రమైన గోకవరం పోలీస్ స్టేషన్ లో ఇప్పటివరకు ట్రైనీ ఎస్సైగా విధులు నిర్వహించిన బి నాగమణి అదనపు ఎస్సైగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన నియామక మార్పు నేపథ్యంలో, వార్తా కథనాల్లో ఇకపై తనను 'ట్రైనీ ఎస్సై' అని కాకుండా 'అదనపు ఎస్సై'గా పేర్కొనాలని విలేకరులకు విజ్ఞప్తి చేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆమెకు తోటి సిబ్బంది, స్థానిక ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

# లక్ష్య సాధనతో నేటి విద్యా విధానం

### - డాక్టర్ కాదా వెంకటరమణ



**కాకినాడ (మనసులో మాట) జనవరి 3..**నేటి తరంతో పాటు రానున్నతరాన్ని విలువలతో కూడిన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో పేరెంట్స్ పాత్ర ప్రధానంగా ఉంటుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన సమావేశం జరిగింది ఐఎంఏ కాకినాడ చాప్టర్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా అందరూ కలిసి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా డాక్టర్ కాదా వెంకటరమణ మాట్లాడుతూ నేటి విద్యా విధానం లక్ష్యంగా కొనసాగుతోందని అన్నారు.దీని వల్ల మానసిక పరిస్థితి సరిగా లేక ఆలోచనా విధానం స్వతంత్రంగా వుండడమే అనేక సమస్యలకు కారణ మారుతోందని అన్నారు. పేరెంట్స్ పిల్లలతో కలిసి ప్రయాణం చేయవలసిన అవసరం ఉందని ఆ సమయంలో వారి ఆలోచన విధానం గ్రహించేందుకు అవకాశం ఉంటుందని డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు. పిల్లల కోసం తమ జీవితాన్ని త్యాగం చేసి వాళ్ళ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డామన్న ఆలోచన విధానం వారి నుండి తిరిగి ఆశించే క్రమంలో వృద్ధాశ్రమాలకు చేరుతున్నారన్న ఆవేదన ను ఆయన ప్రస్తావించారు. కుటుంబ వ్యవస్థలో పిల్లలతో సాన్నిహిత్యం లోపించడం వల్ల అనేక దుష్పరిణామాలకు దారితీస్తోందని అన్నారు. యువతి యువకులు సన్మార్గంలో పయనించేందుకు పేరెంట్స్ తో పాటు సామాజిక బాధ్యత కూడా అందరిపైనా ఉందన్నారు. ఇటీవల కాలంలో ఆత్మ హత్యల సంఘటనలు పెరగటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు ప్రతిరోజు పేరెంట్స్ పుస్తక పఠన కోసం కొంత సమయాన్ని వెచ్చిస్తే పిల్లల్లోనూ మార్పు వచ్చే అవకాశం ఉంటుందని తద్వారా వారితో సత్సంబంధాలు కొనసాగడానికి వీలుంటుంది అన్నారు మారుతున్న కాలానుగుణంగా అనేక మార్పులు జీవన విధానంలో చోటుచేసుకుంటున్న ప్పటికీ వాటి ప్రభావం నేటి యువతపై ప్రతిబింబించడం వల్ల ఊహించని పరిణామాలు చేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విలువలతో కూడిన అధ్యయనం మరియు బోధన చిన్నతనం నుండే నేర్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. వైద్యులుగా ఈ విషయాన్ని అనేక సందర్భాలలో రోగుల పరీక్ష సమయంలోను గుర్తించడం జరుగుతుందని అయితే వాటిని నివారించేందుకు పేరెంట్స్ సహకారం కూడా ఎంతో అవసరం ఉందన్నారు. మారుతున్న కాలంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు యువత అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వాటిలో మానవ విలువలు ఉన్న యెడల సత్ఫలితాలకు దారితీస్తుందన్నారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ హాస్పిటల్ అనంతరం ప్రతిరోజు సుమారు గంటపాటు పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవడం జరిగిందని దానిని చూసిన తన కుమారుడు కూడా పుస్తక పఠనం వైపు దృష్టి మరోచడం జరిగిందన్నారు .ఇటీవల హైదరాబాదులో జరిగిన బుక్ ఫెస్టివల్ లో నాలుగు పుస్తకాలు కొనుగోలు చేసి తన కుమారుడు తీసుకురావడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. పుస్తక పఠనం వల్ల సెల్ వినియోగం కొంతమేర తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా కోశాధికారి ఉదయ్ చక్రవర్తి ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ రామకృష్ణ , జోగా చంద్రావు, బదిరెడ్డి వెంకన్న, మాచారెడ్డి రెడ్డి, సత్తి రవి రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసరాజు, లంక సాయిబాబు ,చోడిశెట్టి పద్దరాజు , జీకే శ్రీనివాస్ డా పరశురామ్, ఉమా మహేశ్వరరావు ,నరహరిశెట్టి రవికృష్ణ, తొ పాటు పలువురు పాల్గొన్నారు.

# సావిత్రీబాయి పూలే గొప్ప సంస్కర్త

### - నివాళులర్పించిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** సావిత్రీబాయి పూలే గొప్ప సంస్కర్త అని, ఆమె జీవితం మహిళలకు స్ఫూర్తి దాయకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాచెల్లుబోయిన మాట్లాడుతూ తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త, రచయిత్రి, స్ఫూర్తి ప్రదాత, మహిళలు చదువు కోసం సావిత్రీబాయి పూలే ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అలీ, చోళ్ళంగి సత్యగిరి, చాప రాజా, ఆచంట కళ్యాణ్, పరిమళ నాని, ఎండీ మౌలాలి, హమీద్ బాషా, షట్టర్ బాషా, ఇబ్రహీం బాషా, షేక్ నిజాం, దాసరి ధర్మ, షేక్ అస్లాం, వల్లి బాషా, దమ్మిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** ఆధునిక విద్యా భారతి, వైతాళికురాలు సావిత్రిబాయి పూలే 195 జయంతోత్సవాన్ని స్థానిక గణేష్ చౌక్ ప్రభుత్వ బీసీ సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ నాయకుడు కేకే సంజీవరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మహిళలు, దళితులు, శూద్రులు చదువు పొందకూడదని కఠినమైన ఆంక్షలు ఉన్న కాలంలో వాటన్నిటినీ ఛేదించి విద్య మాత్రమే విముక్తికి మార్గమని నిరూపించిన ధైర్యశాలి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ బీసీ సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దారా ఏసురత్నం, వసతి గృహ సంక్షేమ అధికారిని వాణి కృష్ణ, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రంపచోడవరం జిల్లాకు కారం తమన్న దొర పేరు పెట్టాలి

### - ఆదివాసి మహాసభ న్యాయ సలహాదారు సూర్యనారాయణ డిమాండు
### - జైపాల్ సింగ్ ముండాకు ఘన నివాళులు







**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** భారత రాజ్యాంగ సభ సభ్యుడు జైపాల్ సింగ్ ముండా 123 వ జయంతిని జనవరి 3 నుండి జనవరి 26న రిపబ్లిక్ డే వరకూ నిర్వహించే ఆదివాసీల హక్కుల ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండు చేశారు. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో శనివారం ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించిన అనంతరం చిత్ర పటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడుతూ బ్రిటిష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన రంపచోడవరానికి చెందిన తొలి గిరిజన వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమ్మన్నదొర జిల్లాగా ప్రకటించాలని, జనవరి 5న జరిగే గ్రామ సభలలో ఈ మేరకు తీర్మానించాలని విజ్ఞప్తి చేశారు. 1839లో బ్రిటిష్ వారిపై దాడి చేసి 12 మందిని హతమార్చిన చరిత్ర ఆయనకు ఉందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తమన్న దొర త్యాగాన్ని గుర్తించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావేత్తగా, క్రీడాకారునిగా, ఉద్యమకారునిగా, రాజకీయ నాయకునిగా, భారత రాజ్యాంగసభ సభ్యునిగా జీవితాంతం ఆదివాసీల హక్కుల కోసం పోరాడి వారి హక్కులు భారత రాజ్యాంగంలో చేర్పించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆదివాసీ మహాసభ వ్యవస్థాపకుడు జైపాల్ సింగ్ ముండా అని కొనియాడారు. రంపచోడవరం జిల్లాకు కారం తమ్మన్నదొర పేరు పెట్టడం సమంజసమని పోలవరం ప్రాజెక్టు వలన గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. గిరిజనులకు నష్టం కలిగించిన ప్రాజెక్టు పేరును గిరిజన జిల్లాకు పెట్టడం సమంజసం కాదని ఆదివాసీ మహాసభ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోందన్నారు. జీవో 3కు చట్ట బద్ధత కల్పించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చి 100శాతం ఉద్యోగాలు షెడ్యూల్డు ప్రాంతంలో ఆదివాసీలకే ఇవ్వాలని డిమాండు చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్వాసితుల విషయమై కొత్త భూసేకరణ చట్టాన్ని, పెసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. నిరంతరం ఆదివాసీల హక్కుల కోసం పనిచేస్తున్న న్యాయవాది, ఐలాజ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పీఎస్ అజయ్ కుమార్ పై అనకాపల్లి జిల్లా పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లాకు చెందిన అరగంటి నాగిరెడ్డి, కారం శ్రీనివాస్ దొర, ముర్ల నాగమణి, నడిపుడి గాంధీరెడ్డి, అందాల పోసమ్మ, మడకం సంకురమ్మ, పూనెం బాబూరావు, ఏలూరు జిల్లా నుండి కారుకొండ అబ్బాయిరెడ్డి, సరియం విజయరత్నకుమారి, గిన్నేపల్లి వెంకట రెడ్డి, వేట్ల ముత్యాలరెడ్డి, కాకినాడ జిల్లా నుండి జర్తా సరస్వతి, జీడెం నాగేశ్వరరావు, జర్తా బాలరాజు, ఆవూరి అప్పారావు, లోతా వెంకటరమణ, ఆదివాసీ జేఏసీ కన్వీనర్ తెల్లం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్రా గోవా కోకో బీచ్ సంక్రాంతి ఫెస్టివల్ బ్రౌచర్ ను ఆవిష్కరించిన ఎంపీ హరీష్ బాలయోగి

**అమలాపురం (మనసులో మాట) జనవరి 3:** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్ యానాం బీచ్ వద్ద ఈ నెల 14,15,16 తేదీలలో జరుగనున్న ఆంధ్రా గోవా కోకో బీచ్ సంక్రాంతి ఫెస్టివల్ బ్రౌచర్ ను అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం స్థానిక ఎంపీ గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు లు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ఫెస్టివల్ ను రాష్ట్ర పండుగగా జరపడానికి నిర్ణయించడం సంతోషంగా ఉందన్నారు. సంక్రాంతి సంబరాలు నిర్వహించడానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు ను ఎంపీ హరీష్ బాలైఒగి అభినందించారు. ఈ సంక్రాంతి పండుగ అందరికీ సంతోషాన్ని, ఆహ్లాదాన్ని ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

## లక్ష్మీ గణపతి ఆలయానికి మరమ్మతులు

### - చైర్మన్ ఎంఎన్ రావు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** స్థానిక నాళం భీమరాజు వీధిలోని 150 ఏళ్ల ప్రాచీన వినాయకుడి ఆలయానికి మరమ్మతులు చేపట్టారు. శ్లాబ్ లీకేజీలు తదితర మరమ్మతులను ప్రస్తుతం చేస్తున్నారు. ఆలయ ధర్మకర్తల చైర్మన్ మద్ది నారాయణరావు, డివిజన్ ఇన్ఛార్జ్ శెట్టి జగదీష్ ఆ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎంఎన్ రావు మాట్లాడుతూ అతి పురాతనమైన ఆలయాల్లో ఈ వినాయకుడి ఆలయం ఒకటన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆలయంగా ఇది ప్రసిద్ధి చెందిందన్నారు. 150 ఏళ్లుగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. అయినవల్లి తరువాత ఈ ఆలయానికి మాత్రమే ధ్వజ స్తంభం ఉందని, మరే వినాయకుడి ఆలయంలో ధ్వజ స్తంభం అనేది ఉండదన్నారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం ఆలయాన్ని భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. ఆలయానికి పట్టించుకోకుండా, కమిటీని నియమించకుండా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. ఆ కారణంగా ఆలయం శిధిల స్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పాటి వర్షానికే లోపల నీరు కారుతోందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆలయం లోపల నీరు కారిపోయిందన్నారు. ఆ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సూచించగా ఆయన ఆదేశాల మేరకు మరమ్మతులు చేపట్టడం జరిగిందని వివరించారు. దగ్గరుండి మరమ్మతులు చేయిస్తున్నట్టు తెలిపారు. ఆలయానికి, భక్తులకు సేవ చేసుకునే భాగ్యం కల్పించినందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్కు ఎంఎన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ ప్రజ్ఞ లో సావిత్రి బాయ్ పూలే జయంతి వేడుకలు




**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 03..**భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు,రచయిత్రి సావిత్రి బాయి పూలే జయంతి,జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల చైర్మన్ బండారు నాగబాబు, మహిళా ఉపాధ్యాయులు ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.స్త్రీల విద్యాభివృద్ధి కోసం,మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన సంస్కర్త సావిత్రి బాయి అని,ఆమె పోరాటం వల్ల నేడు మహిళలు సాధికారతను సాధిస్తున్నారని,అన్ని రంగాలలో మహిళలు ముందున్నారని చైర్మన్ బండారు నాగబాబు తెలిపారు. ప్రభుత్వాలు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా విద్య,ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని ఆయన అన్నారు.కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, కాలేజ్ ప్రిన్సిపాల్ కె అభి, స్కూల్ ప్రిన్సిపాల్ అడపా సాయి దీప్తి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ తోట నాగలక్ష్మి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్,పులిగ పవన్,ఉపాధ్యాయిని గౌరీ,జ్యోతి,శిరీష, వినిత,అర్చిత బాలిన అరుణ దేవి,అర్చిత, అడపా ఆనంద్,మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలంక హైస్కూల్ లో ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



రాజమహేద్రవరం (మనసులో మాట), జనవరి 3:జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం, సావిత్రి బాయి పూలే జన్మదినోత్సవాన్ని బొబ్బిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల హెచ్ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి, ఆమె బాలికల విద్యకు చేసిన సేవలను, అప్పటి సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై ఆమె చేసిన పోరాటాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు వీ మేరీ మాత, మహమ్మద్ రేష్మ, ఎం పాపారత్నం, వీ సుబ్బలక్ష్మి తదితరులను సన్మానించారు.

# వైఎస్ఆర్ సీపీలో త్రిమూర్తులు

- ▶▶ రామచంద్రపురం ఎవరికి 'వరం'
- ▶▶ మార్పులకు శ్రీకారం చుట్టిన అధినేత..?
- ▶▶ మండపేటకు ఎంపీ బోస్,
- ▶▶ కాకినాడ రూరల్‌కు ఎమ్మెల్సీ తోట
- ▶▶ రామచంద్రపురంపై కన్నేసిన మాజీ మంత్రి వేణు
- ▶▶ మున్సిపల్ ఎన్నికల నాటికి మార్పులు...?



**రామచంద్రపురం (మనసులో మాట) జనవరి 3..** వైఎస్ఆర్ సీపీలో రామచంద్రపురం నియోజకవర్గం ఎవరికి వరం కానుంది. త్వరలో వైఎస్ఆర్ సీపీలో మార్పులు జరగనున్నాయా..? పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈమేరకు నిర్ణయం తీసుకోనున్నారా..? అనే ప్రశ్నలు ఇటీవల వైసీపీ కేడర్‌లో జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే అత్యంత సంక్లిష్టంగా ఉద్దండుల నియోజకవర్గంగా పేరున్న రామచంద్రపురంలో ఈ మార్పులకు శ్రీకారం జరగనుందనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఉద్దండులు ఉండే ఈ నియోజకవర్గం ఎవరికి వరం కానుంది... ఎవరికి శాపం కానుందనే విషయాలు త్వరలోనే తెలుస్తాయని ఆపార్టీ నేతలు అంటున్నారు. ఇదిలా ఉండగా త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికలకన్న ముందుగానే ఈ మార్పులు ఉంటాయనే ఊహాగానాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఒక సంవత్సరం ముందుగా మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రామచంద్రపురం వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యి అదేఏడాది జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు. తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో ఇక్కడ టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన తోట త్రిమూర్తులు వైఎస్ఆర్ సీపీలో చేరి ఎమ్మెల్సీగా మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. కాగా 2024 ఎన్నికల సమయానికి రామచంద్రపురం నియోజకవర్గం రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ముగ్గురు ఉద్దండులు ఒకే పార్టీ వైఎస్ఆర్ సీపీలోనే ఉండటంతో అప్పుడు మంత్రిగా ఉన్న చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను 2023 డిశంబరు నెలలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పంపించి, రామచంద్రపురం నుంచి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్‌ను వైఎస్ఆర్ సీపీ నుంచి బరిలో దింపారు. అయితే ఎన్నికలకు ముందు నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన వాసంశెట్టి సుభాష్ ఎమ్మెల్యేగా గెలుపొంది టీడీపీ ప్రభుత్వంలో ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్నారు. అయితే 2024 ఎన్నికల అనతరం 19 నెలల తరువాత వైఎస్ఆర్ సీపీలో సమూల మార్పులు చేసేందుకు వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్లు అపార్టీ వర్గాలు అంటున్నారు. అందులో భాగంగా ఈ ముగ్గురు సీనియర్ నేతలకు మూడు నియోజకవర్గాలను అప్పగించేందుకు మార్పులు చేస్తున్నట్లు వినికిడి. మండపేట నియోజకవర్గంలో ప్రస్తుతం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండపేటను తూర్పుగోదా వరి జిల్లాలో విలీనం చేసి మంచి జోరుమీదున్నా రు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఎంపీ బోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్ వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలను మరింత బలోపేతం చేసేందుకు మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది. కాకినాడ రూరల్‌లో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మాజీ మంత్రి కన్నబాబును విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గానికి పంపిస్తే తోట త్రిమూర్తులను రూరల్ ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తారనే ప్రచారాం జోరుగా సాగుతుంది. అదే సమయంలో 2019లో మండపేట నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన కమ్మ సామాజిక వర్గాలో మంచి పట్టున్న పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను మండపేట నియోజకవర్గ నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గాను నియమిస్తారని ఈమేరకు ఆపార్టీ వర్గాల వారు అంటున్నారు. అదే సమయంలో గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా పనిచేసిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను రాజమండ్రి రూరల్ నుంచి రామచంద్రపురం పంపించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదే అదనుగా మాజీ మంత్రి వేణు రామచంద్రపురం వచ్చేందుకు తన స్థాయిలో పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది. ఆయన ఎమ్మెల్యేగా ఉండగా రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికల్లో 28 వార్డులకు గాను 11వార్డులను ఆయన ఏకగ్రీవం చేశారు. దీంతో ఆయనను తిరిగి రామచంద్రపురం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించాలనే ఆలోచనలో కూడా పార్టీ అధ్యక్షుడు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం ఈమేరకు ఈనెల 10వ తేదీన తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. అప్పుడు జరిగే సమావేశంలో మాజీ మంత్రి వేణు తన "మనసులో మాట"ను తమ అధినేత ముందుకు తీసుకువస్తారని ఆయన వర్గీయులు లోపాయికారిగా అంటున్నారు. ఈ మార్పులకు ముగ్గురు సీనియర్ నేతలు సుముఖంగా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల వారు అంటున్నారు. అందులో భాగంగానే మండపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న తోట త్రిమూర్తులు నూతన సంవత్సర వేడుకలను దూరంగా ఉన్నారని చెబుతున్నారు. దీంతో పాటుగా ఎంపీ బోస్ కూడా మండపేట నియోజకవర్గంలో ఇటీవల తన పర్యటనలు ముమ్మరం చేయటం దీనికి సంకేతంగా కనిపిస్తుందని ఆ పార్టీ వర్గాల వారు అంటున్నారు. ఇదిలా ఉండగా రాజమండ్రి రూరల్ సమన్వయకర్తగా, ఆపార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి వేణు ఇప్పటికీ రామచంద్రపురం లోనే నివాసం ఉండటం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఆయన ఇంటికి వైఎస్ఆర్ సీపీ రామచంద్రపురం నేతలు భారీగా తరలిరావటం సంకేతాలుగా చెబుతున్నారు. దీంతో పాటుగా ఇటీవల మంత్రి సుభాష్‌కు, మాజీ మంత్రి వేణుకు మద్య జరిగిన పొలిటిక్ వార్ కూడా ఇందులో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికలకు ముందుగానే ఈ మార్పులు చోటు చేసుకునే అవకాశాలునాయని తెలుస్తుంది. ముగ్గురు సీనియర్ నేతల సమన్వయంలో రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలనే ధ్యేయంతో వైఎస్ఆర్‌సీపీ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది.



# సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి

## - పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే 195 వ జయంతి వేడుక

రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:దేశంలో ప్రథమ మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని, ఆమె పేరుతో విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ కోరారు. సంస్థ ఆధ్వర్యంలో శనివారం గౌతమీ ఘాట్ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు కల్యాణ మండపంలో సావిత్రిబాయి పూలే 195 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు ఉపాధ్యాయినిలు షిబిజాన్సన్, వీ జయశ్రీ, ఎస్వీవీ దుర్గలకు సాదర సత్కారం జరిగింది. సత్కార కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి దేవత సుధాకర్, ఉపాధ్యక్షులు చల్లగాలి రామరాజు, గువ్వల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి లక్కోజు వీరభద్రరావు (లక్కోజీ), కోశాధికారి సిరికి నాయుడు, సభ్యులు నరవ గోపాలకృష్ణ, కాలెపు వెంకట వీరభద్రరావు, శ్యామలాంబ గుడి చైర్మన్ కడియాల వీరభద్రరావు, వైకేఎల్ నరసింహరావు, గుదే వెంకటేశ్వరరావు, టీ దుర్గా ప్రసాద్, ఆకాశం గౌరీష్ బాబు, కేఎల్ఎన్ రెడ్డి, ఎస్ శేషు, జాన్సన్ బాబు, పీ సత్యనారాయణ, బీ మహాలక్ష్మి, శ్రీలేంక శివకుమార్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు 200 మంది పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 3..** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్నిఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు అని మహిళల విద్యకు, ముఖ్యంగా బాలికల విద్యకు ఆమె జీవితాంతం అంకితమయ్యారు. కుల వివక్ష, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడి సామాజిక సంస్కర్తగా గుర్తింపు పొందారు. మహిళలు స్వావలంబన సాధించాలంటే విద్యే ప్రధాన ఆయుధం అని ఆమె నమ్మారు అని ఆమె జీవితం నేటి మహిళలకు ప్రేరణగా, ఆదర్శంగా నిలుస్తోందని విద్యార్థులకు తెలియజేశారు.మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ డా. డి. సత్యలత ప్రసంగిస్తూ మహిళా ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యం అని, మహిళల విద్యకు, ముఖ్యంగా బాలికల విద్యకు ఆమె జీవితాంతం అంకితమయ్యారు అని 18485 జ్యోతిరావు పూలేతో కలిసి బాలికల కోసం మొదటి పాఠశాలను పుణెల్లో స్థాపించారు అని విద్యార్థులకు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ వారిని సత్కరించారు. మహిళా ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఐ. క్యూ.ఏ. సి కో–ఆర్డినేటర్ డా. పి.వి.వి. సత్యా నారాయణ, కెమిస్ట్రీ అధ్యాపకుడు వి. మల్లికార్జున శర్మ , ఫిజిక్స్ అధ్యాపకుడు వి.గోపాల కృష్ణ , కామర్స్ ఆధ్యాపకుడు డా.జి. సురేష్ , పి.పద్మ శేఖర్ , హిస్టరీ అద్యాపకుడు ఆర్. శ్రీనుగ, కంప్యూటర్ ఆధ్యాపకుడు వి. దేవి ప్రసన్న జువాలజీ ఆధ్యాపకుడు పి.శ్రీనివాస రావు , బొటాని అధ్యాపకుడు వై.నవీన ఇతర ఆద్యపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివ ముక్కోటి సందర్భంగా అరుణాచల

# గిరి ప్రదక్షిణలో తుమ్మలపల్లి రమేష్

## అనంతరం అరుణాచలేశ్వరుని దర్శించుకొన్న తుమ్మలపల్లి రమేష్





**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 3..** శివ ముక్కోటి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలో గల అరుణాచలంలో నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమంలో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం అరుణాచలేశ్వరుని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ నాతో నేను నాలో నేను అదే ఆలోచనతో చేసేదే అరుణాచల గిరి ప్రదక్షిణ అని,ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, మా అదినేత పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ సంయుక్త కార్యదర్శి సూరంపాలెం బాలు, గండేపల్లి జనసేన నాయకులు మేడిబోయిన శ్రీను,నల్లల శివ, కిర్లంపూడి జనసేన నాయకుడు దాడి చిన బుజ్జి, పాలెం బాబి, ఓంకార్,గట్టుం శ్రీనివాస్, శివ రాజు, గోనేడ రాజు ఇతర జనసేన నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కళ్యాణ మండపానికి వేలం




**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 3 :** పిఠాపురం పురపాలక సంఘ భవన కార్యాలయంలో శనివారం మలిరెడ్డి బాబీ కళావేదిక ( మున్సిపల్ కళ్యాణ్ మండపం) అద్దెకు ఇచ్చేందుకు వేలంపాట జరిగింది. ఈ వేలం పాటలో ముగ్గురు పోటీదారులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు ఆధ్వర్యంలో ఈ వేలంపాట జరిగింది. రెవెన్యూ అధికారులు వెల్లడించిన వివరాల మేరకు పిఠాపురానికి చెందిన జనపరెడ్డి శ్రీనివాస్ అందరికంటే హెచ్చుగా ప్రతినెల 1,69 వేల రూపాయలు అద్దె 18% శాతం జీఎస్టీ తో కలిపి చెల్లించేందుకు వేలంలో దక్కించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాటదారులు తదితరులు పాల్గొన్నారు.



## అనపర్తి రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో

# స్వామి వివేకానంద పురస్కారాలకు ఎంపిక





**అనపర్తి (మనసులో మాట) జనవరి 3:** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న ఆదర్శప్రాయులను, స్వామి వివేకానంద పురస్కారాలకు ఎంపిక చేసినట్లు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం. దుర్గాప్రసాద్‌తెలియజేశారు. అనపర్తి శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో, ఏటా అందించే స్వామి వివేకానందజీవన సాఫల్య పురస్కారం – 2026 కు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, హర్యానా పూర్వ గవర్నర్‌బండారు దత్తాత్రేయ, ఆంధ్రా శబరిమల ద్వారపూడి అయ్యప్ప స్వామి దేవస్థానం వ్యవస్థాపకులు ఎస్.ఎల్. కనకరాజ్ గురుస్వామి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ వై.డి. రామారావు, స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డ్ – 2026 కు శాక్తేయ సంప్రదాయకులు, అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు, ఆదిత్య పరాశ్రీ స్వామీజీ మహరాజ్ ను ఎంపిక చేశామని వివరించారు. జనవరి 22 న అనపర్తి (దుప్పలపూడి)ఆర్.వి.ఆర్. కన్వెన్షన్ లో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో, జరిగే స్వామి వివేకానంద జయంతి వేడుకల్లోరాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్, అనపర్తి శాసనసభ్యులునల్లమిల్లి రామకృష్ణా రెడ్డిల చేతుల మీదుగా పురస్కార గ్రహీతలకు రూ.25 వేలు నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో సత్కరిస్తామని, ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అఖిల భారత సామాజిక సమరసతకళావిభాగం సంయోజకులు, అప్పాల ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని దుర్గాప్రసాద్ తెలిపారు.

# మహిళలకు సురక్షిత, ఒత్తిడి లేని పని వాతావరణం అవసరం

- లింగ భేదం లేని సమాన పని విభజనపై దృష్టి పెట్టాలి
- విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు అవసరం
- రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజా



రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:మహిళలు పనిచేసే ప్రతి ప్రాంతంలో వారికి సురక్షితమైన, ఒత్తిడి లేని వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ (క్యాబినెట్ ర్యాంక్) డాక్టర్ రావిపాటి శైలజ స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలోని సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావిపాటి శైలజ మాట్లాడుతూ నేటి మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు ఒక వైపు కుటుంబ బాధ్యతలు, మరోవైపు ఉద్యోగ బాధ్యతలు సమతుల్యంగా నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని, ఇందుకు కుటుంబ సభ్యులు, కార్యాలయాల్లోని తోటి ఉద్యోగులు వారికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. మహిళలు తమకు కలిగిన హక్కులు, వాటి ద్వారా లభించే ప్రయోజనాలను సమగ్రంగా తెలుసుకోవాలని తెలిపారు. మహిళా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలతో పాటు, విద్యార్థులు నిజ జీవితంలో ఎదుర్కొనే సమస్యలను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో మార్గనిర్దేశం చేయాలని అన్నారు. సమాజంలో ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో లింగ భేదం కనిపిస్తోందని, ఆడమగ అనే తేడా లేకుండా సమానంగా పని విభజన ఉండే విధంగా దృక్పథం మారాలని సూచించారు. విద్యార్థులను బాధ్యతగల భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, అందుకే వారు విద్యతో పాటు నైతిక విలువలను కూడా బోధించాలన్నారు. అదే విధంగా మహిళలు ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారి కృష్ణవేణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్ కే, ఐసీడీఎస్ పీడీ టీ శ్రీదేవి పాల్గొన్నారు.

# జగ్గంపేటలో ఘనంగా సావిత్రిబాయి పూలే 195 వ జయంతి

## సావిత్రిబాయి పూలే ను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి సిఐ వై ఆర్ కె



**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 3..** జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న పరివర్తన స్థలములో వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్ ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ టి వి ఎస్ రంగారావు సభా అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఐసిడిఎస్ సిడిపిఒ ఎం పూర్ణిమ ఎ.పి ఈపిడిసియల్ జగ్గంపేట ఎ.ఈ.ఈ మాధురి సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించినారు.అనంతరం మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని మహిళలపై ఎంతో వివక్షుతున్నటువంటి రోజులలో ఎంతో సాహసం చేసి భర్త సహకారంతో విద్యను ప్రారంభించి సనాతన ధర్మ సంకెళ్లు చేధించి భారతదేశ జనాభాలో సగ భాగం ఉన్న స్త్రీలకు విద్య అందేందుకు కృషిచేసి అసమానతకు గురవుతున్నటువంటి బడుగు బలహీనవర్గాల ప్రజలను తన పిల్లలుగా భావించి పిల్లలను కనకుండా తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి సావిత్రిబాయి పూలే అని ఆమెను ఆదర్శంగా తీసుకుని ఈరోజు మహిళలందరూ ఉన్నత స్థాయిలో ఉన్నామని అన్నారు వంటింటికి పరిమితమైనటువంటి మహిళలను సమాజంలో అభివృద్ధి చెందాలని విద్య వైపు మళ్లించి మహిళలందరినీ విద్య బాటలో పయనించేలా చేసినారు ఆమె ఎన్నో అవమానాలు ఎదుర్కొని దేశంలోనే మొదటి ఉపాధ్యాయులుగా ఖ్యాతి పొందినారు అని అన్నారు జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తొమ్మిదో సంవత్సరంలోనే వివాహం జరిగింది వివాహం అనంతరం తన భర్త జ్యోతిరావు పూలే వద్ద విద్యను నేర్చుకొని సమాజంలో ఉన్నటువంటి ప్రతి మహిళకు విద్య అందాలి అని స్కూలు ఏర్పాటు చేసినారు ఆ స్కూల్ లోకి వెళ్లే దారిలో ఆమెపై బురద పేడ చల్లి ఆటంకపరిచడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు కానీ అటువంటి ఏమి పట్టించుకోకుండా తన విధిని సక్రమంగా నిర్వహించి ఈరోజు యావత్ భారతదేశం లో ప్రతి మహిళ పురుషులతో పాటు సమానంగా నడిచేలాగా తీర్చిదిద్దినారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి సూరిబాబు ఆర్యన్ నాగసేన బోధి ఉపాధ్యాయులు ఉమా శ్రీదేవి, గీత, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయ్యూరి అప్పలస్వామి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పంచ కట్ల రామకృష్ణ సావిత్రిబాయి పూలేను ఉద్దేశించి మాట్లాడినారు అనంతరం వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్ ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే గాని లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును మహిళా ఉపాధ్యాయులకు అందజేసినారు వందమంది మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేసినారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు



## ఆలమూరు నవ జనార్ధన ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట (మనసులో మాట) జనవరి 3..** ధనుర్మాసం, ఆరుద్ర దర్శనం, పౌర్ణమి, శివముక్కోటి మహాపర్వదినం సందర్భంగా దక్షిణ భారతదేశంలో ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఆలమూరు భట్టీవిక్రమార్కేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భట్టీశ్వరస్వామి అన్నాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పార్వతీ సమేత భట్టీశ్వరస్వామి , పార్వతీ సమేత విక్రమార్కేశ్వర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.అనంతరం ఆలమూరు నవ జనార్ధన స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు స్వాగతం పలికారు ఆలమూరులో అత్యంత పురాతనమైన ఆలయాలను దర్శించుకోవడం ఆనందంగా ఉందని, కొత్తపేట నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామిని కోరుకున్నట్లు బండారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాటు సారాయి బట్టీ పై ప్రత్తిపాడు పోలీసులు దాడులు

### -60, లీటర్ల నాటు సారాయి, 3000 లీటర్ల బెల్లపువూట ధ్వంసం



**ప్రత్తిపాడు. ( మనసులోమాట) జనవరి 3..** కాకినాడ జిల్లా ప్రతిపాడు మండలం చింతలూరు గ్రామశివారున నాటుసారా స్థావరం పై ప్రత్తిపాడు పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. పోలీసులుకు అందిన ముందస్తు సమాచారం మేరకు,ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం, అధ్వర్యంలో తమ సిబ్బంది దాడులు నిర్వహించారు.సంఘటన స్థలములో సారా కాస్తున్న ముగ్గురు వ్యక్తులు అదుపులోకి తీసుకొన్నారు..వారి వద్ద నుండి 60 లీటర్ల నాటు సారాయిని, స్వాధీనం చేసుకున్నారు.నాటుసారాయి తయారు చేసే అందుకుఉపయోగించే 3000 లీటర్లు అమ్మోనియా కలిపిన బెల్లపు ఊటను, నాటుసారాని తయారు చేయడానికి ఉపయోగించిన సామాగ్రిని పోలీసులు ధ్వంసం చేశారు.అదుపులోకి తీసుకున్న ముగ్గురు వ్యక్తుల పై కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలిస్తామని అన్నారు.ప్రత్తిపాడు మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేసినా, రవాణా చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడుతున్న వారి సమాచారం తెలిపేందుకు ఈ క్రింది నెంబర్లు ప్రత్తిపాడు ఎస్ఐ 9440796570,సిఐ 9440796530, ల సెల్ నెంబర్ లకు తెలియపరచాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు

## ఇటీవల విడుదలైన ఆంధ్రప్రదేశ్ జిల్లా కోర్టు ఫలితాలు



అనపర్తి (మనసులో మాట) జనవరి 3: అనపర్తి నియోజకవర్గం కుతుకులూరు గ్రామానికి చెందిన, టి ఎస్ ఆర్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ నుండి 4 గురు అభ్యర్థులు 7 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని అనపర్తి మండలం రామవరం లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగాలు సాధించిన వారిలో ద్వారంపూడి దుర్గా వెంకటేశ్వర రెడ్డి, కర్రి సౌమ్య శ్రీ, తాడి మణికంఠ అజయ్ సాగర్ రెడ్డి మరియు సబ్బెళ్ల అనసూయ ఉన్నారు. వీరిని అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి విజయాలు సాధించడం అద్భుతమని ఆయన అన్నారు. పరిసర గ్రామ అభ్యర్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని విజయాలు సాధించాలని మరియు ఎంపికైన అభ్యర్థులు ఇంకా ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆయన అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులగం బుల్లి రెడ్డి, కుతుకులూరు తెలుగుదేశం నాయకులు కర్రి చిన్నా రెడ్డి, రామవరం తెలుగుదేశం నాయకులు మండ అబ్బాయి రెడ్డి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మల్లిడి అమ్మి రెడ్డి మరియు టి ఎస్ ఆర్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ తేతల సుబ్బి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దెందులూరులో అంబరాన్నంటిన సంబరాలు

### - చింతమనేనికి శుభాకాంక్షలు వెల్లువ



**దెందులూరు/ఏలూరు 3(మనసులో మాట)** దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జన్మదినోత్సవం సందర్భంగా దుగ్గిరాల క్యాంపు కార్యాలయానికి వేలాదిగా తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు, అధికారులు, సిబ్బంది, అభిమానులు - శుభాకాంక్షలు తెలుపడానికి బారులు తీరిన వైనం - దాదాపు 5గంటలపైగా నిర్విరామంగా కొనసాగిన శుభాకాంక్షలు వెల్లువ - విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఆత్మీయ విందు ఏర్పాటు చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తిరునాళ్లను తలపించిన దుగ్గిరాల గ్రామం. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు చెన్నుపాటి గాంధీ , రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఏలూరు జనసేన ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు , రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ దెందులూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ ఘంటసాల వెంకటలక్ష్మి , ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మామిల్లపల్లి పార్థసారథి, ఏలూరు టౌన్ టిడిపి ప్రెసిడెంట్ చౌదరి వెంకటరత్నం నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ పూజారి నిరంజన్, అమరావతి ప్రసాద్, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ఏలూరు బిషప్ గారి సెక్రటరీ ఫాదర్ థామస్ స్టీవెన్, ఫాదర్ రాజు, వికార్ జనరల్ ఫాదర్ బాల, జిల్లా అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు, నూజివీడు డిఎస్పి నెజజఅజ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, జిల్లా విద్యుత్ శాఖ సూపర్ఇంటెండింగ్ ఇంజనీర్ సాల్మన్ రాజు, డి ఈ అంబేద్కర్, దెందులూరు నియోజకవర్గ మండల పార్టీల అధ్యక్షులు, పలు సొసైటీల చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు సహా పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పలువురు యువకులు అభిమానులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.అదేవిధంగా ఎంతో అభిమానంతో తరలివచ్చిన దివ్యాంగుల వద్దకు సభా వేదిక వద్ద నుంచి ఎమ్మెల్యే స్వయంగా వారి వద్దకే తరలి వెళ్లి కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి వారికి అభినందనలు తెలిపారు.

### పిఠాపురంలో సంక్రాంతి సంబరాలు ఉప ముఖ్యమంత్రి పర్యటన గణతంత్ర దినోత్సవ వేడుకలపై

# వివిధ శాఖలతో సమీక్ష సమావేశం

### - జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 3..** పిఠాపురంలో ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకూ సంక్రాంతి సంబరాలు, 9వ తేదీన ఉపముఖ్యమంత్రి పర్యటన, 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకల కార్యక్రమాలకు వివిధ శాఖలు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు అధికారులను కోరారు.శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో ఆయన జిల్లా అధికారులతో కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి సంక్రాంతి సంబరాలు, ఉపముఖ్యమంత్రి పర్యటన, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు వివిధ శాఖలు చేపట్టవలసిన ఏర్పాట్లను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం వేదికగా ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకూ సంక్రాంతి సంబరాలను సాంస్కృతిక, పర్యాటక శోభ ఉట్టిపడేలా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో 27 కళారూపాలకు చెందిన సుమారు 300 కళాకారులు పాల్గొంటారన్నారు. జడ్పి సిఈఓ, పాడా ప్రొజెక్ట్ డైరక్టర్లు సమన్వయ అధికారులుగా నిర్వహించే వేడుకలకు వివిధ శాఖలు కేటాయించిన ఏర్పాట్లను చేపట్టాలని ఆయన తెలిపారు. కార్యక్రమాలు జరిగే మూడు రోజులు శాంతిభద్రతలు, సమూహాలు, వాహనాల నియంత్రణ, వాహన పార్కింగ్ అంశాలను పోలీస్ శాఖ చేపట్టాలని, అత్యవసర వైద్య సేవలతో మెడికల్ క్యాంపులు, ఆంబులెన్స్ లను డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికలు, త్రాగునీరు, పారిశుధ్యం అంశాలను పిఠాపురం మున్సిపల్ కమీషనర్, ఎంపిడిఓలు ఏర్పాటు చేయాలని, కల్చరల్ ఈవెంట్స్ నిర్వహణ కాకినాడ ఆర్డిఓ పర్యవేక్షించాలని కోరారు. కళాకారుల రవాణాకు అవసరమైన వాహనాలను డిటిసి, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా ఎస్ఈ ట్రాన్స్కో సమకూర్చాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, మీడియా కవరేజి ఏర్పాట్లను డిఐపిఆర్ఓ చేపట్టాలని కోరారు. సంబరాల్లో వ్యవసాయ, పట్టు, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక, ఐసిడిఎస్ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని, డిఆర్డిఏ పిడి ఈ స్టాళ్ల ఏర్పాట్లు చూడాలన్నారు. వేడకలలో గోపూజ, పిల్లలకు భోగిపళ్లు, ఫ్యాన్సీ డ్రస్ పోటీలు, పిండివంటలు, ఎడ్ల బండ్లు, పతంగులు, సంగిడీలు, రంగోలీలు వంటి అంశాలను ఎండోమెంట్స్, ఐసిడిఎస్, పంచాయితీ, మెప్మా, క్రీడలు, వ్యవసాయశాఖల అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. భోజన, అల్పాహార ఏర్పాట్లను పౌరసరఫరాల అధికారులు చేపట్టాలని తెలిపారు. టూరిజం శాఖ ద్వారా ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు ఉంటుందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 9వ తేదీన జిల్లాలో పర్యటించి సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారని, ఉదయం పిఠాపురంలో సభావేదిక వద్ద, మధ్యాహ్నం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోను వివిధ అభివృద్ది కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహిస్తారని డిఆర్ఓ తెలియజేశారు. ఉపముఖ్యమంత్రి పర్యటనకు హెలిపాడ్లు, భద్రత ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. అలాగే ఈ నెల 26వ తేదీన కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ లో 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడులను జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల ద్వారా ఏర్పాట్లు చేపట్టాలని డిఆర్ఓ వెంకట్రావు అధికారులను కోరారు. సాంప్రదాయ పోలీస్ కవాతు, జెండా వందనం, ముఖ్య అతిధి ప్రసంగం, శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, ఉత్తమ సేవలకు అభినందన, స్టాళ్ల ప్రదర్శన తదితర అంశాలను ఆయా శాఖలు పటిష్టంగా చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి ఎస్.శ్రీనివాస్, జడ్పి సిఈఓ వివివిఎస్ లక్ష్మణరావు, కాకినాడ ఆర్ డి ఓ ఎస్.మల్లిబాబు, ఎస్పి డిఎస్పి కె.వి.సత్యన్నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యానాం లో ఘనంగా దినేష్ పుట్టినరోజు వేడుకలు

### 60 మంది యువకులు రక్తదానం - 10 లక్షల బీమా సర్టిఫికెట్లు అందజేత



**యానాం (మనసులో మాట), జనవరి 03:** కేంద్రపాలిత ప్రాంతమైన యానాం పట్టణం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్ జన్మదిన వేడుకలు పుదుచ్చేరి ఎమ్మెల్యేల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పాండిచ్చేరి నుంచి ఎమ్మెల్యేలు స్వయంగా వచ్చి దినేష్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దినేష్ అభిమానులు రక్తదానం శిబిరం ఏర్పాటు చేయగా సుమారు 60 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు 10 లక్షల ఉచిత ఇన్సూరెన్స్ పథకాన్ని చేయించి దినేష్ మరో సారి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అర్ధాన్ని దినేష్ మాట్లాడుతూ పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పై నిప్పులు చేరిగారు. 30 సంవత్సరాల రాజకీయాల్లో ఎవరినైనా శిష్యులను తయారుచేశారా అంటూ ప్రశ్నించారు. యానం ప్రజా ఉత్సవాలకు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఈ ఉత్సవాలకి యానం ప్రజలు పది శాతం కూడా రావటం లేదని మండిపడ్డారు. యానం ప్రజలకి నివాసాలు లేక ఇబ్బంది పడుతుంటే వాళ్ళకి ఇప్పటివరకు ఇండ్ల స్థలాలు కేటాయించకోవటం నీ పనితీరు ఎలా ఉందో ప్రజలకి అర్థమవుతుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, మెల్లం చిన్ని, విల్లా చిన్ని, మచ్చ శ్రీను, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే దాట్లచే రైతులకు రాజముద్రలతో

# పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 03:** రి సర్వే పూర్తయిన గ్రామాలలో రైతులకు రాజముద్రలతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు అందజేశారు. శనివారం చొల్లంగి గ్రామపంచాయతీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు దూళిపూడి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ ఫోటోలతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేయడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దుచేసి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. చొల్లంగి పంచాయతీలో 595, చొల్లంగి పేటలో 75, జీ వేమవరం పంచాయతీలో 1185 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసినట్లు తాసిల్దార్ పితాని త్రినాధరావు తెలిపారు. రీ-సర్వే అనంతరం ప్రతీ పంచాయతీ లో ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయో నోటీస్ బోర్డు లో పెట్టాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు కోరారు. అలాగే తాళ్ళరేవు మండల పరిధిలోని చొల్లంగిలో విమానాశ్రయం ఏర్పాటుకు స్థానిక ప్రజలు సహకరించాలని కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు కోరారు. అనంతరం మత్స్యశాఖ ఆధ్వర్యంలో 8 మంది బోటు యజమానులకు సబ్సిడీతో కూడిన డీజిల్ ఇంజన్లను పంపిణీ చేశారు. అదేవిధంగా చిన్నవలసల గ్రామంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన పెసింగి మల్లేశ్వరి కుటుంబానికి రూ 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో చొల్లంగిపేట సర్పంచ్ కందెల్ల గంగబాబు, ఏడి లావణ్య ఎఫ్డిఓ అనురాధ, డిప్యూటీ తాసిల్దార్ సూరిబాబు, ఆర్ ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాసరావు, ఎన్డీఏ నాయకులు నడింపల్లి వినోద్, అత్తిలి బాబూరావు, ఎం జి సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, గర్రె లక్ష్మీనారాయణ, కొప్పిశెట్టి బాబి, కొత్తూరు కాశీ, పి. రామలక్ష్మి, బండారు దొరబాబు, దడాల సువర్ణలత, కట్టా త్రిమూర్తులు, కనకాల చినబాబు తదితరులు పాల్గొన్నారు.



## రైతులంతా పట్టాదారు పాసుపుస్తకాలు పొందాలి; మనోజ్

**పెదపూడి (మనసులో మాట) జనవరి 3;** రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం చేపట్టిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి కోరారు. పెదపూడి మండలం సంపర గ్రామంలో తహశీల్దార్ సీతాపతి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ సభలో పాల్గొని ప్రసంగించారు. జనసేన మండల కన్వీనర్ నాగిరెడ్డి వీరాస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం నూతన పట్టాదారు పాసుపుస్తకాల పథకాన్ని చేపట్టడం జరిగిందన్నారు. భూమి కలిగిన రైతులు నేరుగా తమ తమ యాజమాన్య ధ్రువీకరణ పత్రాలను అందించి పట్టాదారు పాసు పుస్తకాలను పొందాలని తాసిల్దార్ సీతాపతిరావు కోరారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు తిబిరి శెట్టి గణేష్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత అద్దంకి ముక్తేశ్వరరావు, పైన సొసైటీ చైర్మన్ తిబిరి శెట్టి ఆదినారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు జుట్టుక కృష్ణ, తిబిరి శెట్టి ఫణీంద్ర, బండారు నాగు, రెవెన్యూ అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## పట్టాదారు పాసుపుస్తకాలతో మంచి భద్రత

### - ఆర్డిఓ శ్రీ రమణి




**పెద్దాపురం (మనసులో మాట) జనవరి 4 ;** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టాదారు పాసు పుస్తకాల ద్వారా రైతుల పంట పొలాలకు భద్రత లభిస్తుందని పెద్దాపురం ఆర్డీవో శ్రీ రమణి తెలిపారు. పెద్దాపురం మండలం చదలడు గ్రామంలో శనివారం తాసిల్దార్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అర్హత కలిగిన, భూములు కలిగిన రైతులు తమ తమ ధ్రువీకరణ పత్రాలను అందించి, నూతన పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోవాలని తాసిల్దార్ వెంకటలక్ష్మి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసమే నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ మోహన్, పెద్దాపురం ఆర్డీవో శ్రీ రమణి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల ద్వారా అన్ని గ్రామాల్లోనూ పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ నిర్వహిస్తామని తాసిల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక నేతలు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కండక్టర్లకు పవర్ బ్యాంకులను అందజేసిన డి పి టి ఓ




అమలాపురం (మనసులో మాట) జనవరి 3 రాష్ట్రంలో శ్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులకు ప్రయాణికుల తాకిడి అధికమవడంతో టిమ్ మిషన్ కు త్వరగా చార్జింగ్ అవుతుండటంతో ఎదురవుతున్న సమస్యలను అధిగమించడానికి పవర్ బ్యాంకులు కండక్టర్లకు అందజేయడం జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం అమలాపురం ఆర్టీసీ డిపోలో కండక్టర్లకు పవర్ బ్యాంకులను అందజేసి వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ డిఎల్ ఎన్ శర్మ ట్రాఫిక్ సూపర్వైజర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ అభివృద్ధి పనులపై భేటీ



**ఏలూరు, జనవరి 3 (మనసులో మాట)..** ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు కి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ శనివారం ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జడ్పీ చైర్పర్సన్ మరియు పోలవరం శాసనసభ్యులు నియోజకవర్గంలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ప్రస్తుతం అమలవుతున్న వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాలు, అలాగే కొనసాగుతున్న పనుల పురోగతిపై విస్తృతంగా సమీక్షించారు. నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లా పరిషత్ ద్వారా చేపట్టే కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలని ఈ సమావేశంలో చర్చించారు. అభివృద్ధి విషయంలో జిల్లా పరిషత్, శాసనసభ్యులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.



## జిల్లా గ్రంధాలయ సంస్థకు చెల్లించవలసిన సెస్ బకాయిని చెల్లించండి...

**ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ని కలిసిన ఉభయగోదావరి జిల్లాల గ్రంధాలయ సంస్థ కార్యదర్శి పాదంకి నాగరాజు**

ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 3తూర్పుగోదావరిజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాలంకి. నాగరాజు శనివారం ఏలేశ్వరం నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ పి సూర్య ప్రకాశ రావు ని కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ కు చెల్లించ వలసిన సెస్ బకాయిలు చెల్లించ వలసినది గా కోరుట జరిగింది సుమారు 50,00000 రూపాయలు వరకు బకాయిలు ఉన్నాయని వివరించారు. బాకాయలలో కనీసం 2500000 రూపాయలు చెల్లించ వలసినది గా కోరియున్నారు . సిబ్బంది జీతాలకు ఇబ్బంది ఉన్నందున త్వరితగతిన సెస్ బకాయిలు చెల్లించ వలసినది గా కోరారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం నగర్ పంచాయతీ కమీషనర్ పి సూర్య ప్రకాశ రావు సానుకూలంగా స్పందించి సిబ్బందితో చర్చించి సెస్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పోలంకి నాగరాజు తో కలసి ఏలేశ్వరం గ్రంథపాలకుడు కవికొండల సత్యనారాయణ పాల్గొన్నారు.

## సావిత్రి బాయ్ పూలేకి బీజేపీ ఓబీసీ ఘన నివాళి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:**బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రి బాయ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అలుగు ఆనంద శేఖర్ మాట్లాడుతూ సావిత్రి బాయ్ పూలే ఆశయాలు నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. నరేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సావిత్రి బాయ్ పూలే ఆశయాలకు అనుగుణంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు, ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలెపు సత్య సాయి రామ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, కందికొండ రమేష్, పడాల నాగరాజు, పాతూరి రవి శంకర్, ఎన్వీబీఎన్ ఆచారి, నందివాడ సత్యనారాయణ, రాపాక శివ, దాసరి శ్రీను, వీరా వీరాంజనేయులు, సిద్ధాని వెంకట్, కారుమూరి సురేష్, యర్రంశెట్టి రవికిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా ధనుర్మాస నృత్యారాధన



రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:ఆలయ నృత్య సంప్రదాయాన్ని పునఃసృష్టి చేసి రాజమహేంద్రికి అంతర్జాతీయ కీర్తినందించిన నర్తనయోగి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఈఏటి 43 వ ధనుర్మాస నృత్యారాధనం ధవళేశ్వరంలోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి సన్నిధిలో వైష్ణవాగమ సంప్రదాయ పద్ధతిలో పుష్పాంజలి సమర్పించి చూర్ణికలు పఠించి నృత్యార్చన చేశారు. పదిమంది నృత్య కళాకారిణులు దశావతార స్వరూపాలై స్వామి వారిని అర్చించడం విశేషం. తరువాత ఆలయ ఆవరణలోని వేదికపై వైష్ణవాగమ రీతిలో పుష్పాంజలి, కుంభహారతి పట్టి చూర్ణికలు పఠించి ఆగమ నర్తనంతో ప్రారంభించారు. వినాయక స్తుతి లాస్యశ్రీ, రిషిక, నందన్ హరిణిక, శాన్విక, చంద్రకళ ముచ్చటగా నర్తించగా, శ్రీశైల శబ్దం నృత్యాన్ని నందిత, నందన్, హరిణిక, శాన్విక, నిషిత ప్రదర్శించారు. అనంతరం అన్నమాచార్య కీర్తనలు, స్వరజతి, భావకవిత తదితర అంశాలు రసరమ్యంగా నర్తించారు. సప్పా దుర్గా ప్రసాద్ రచించి నృత్య సంగీతం సమకూర్చిన త్రిపుర సంహార శబ్దం చంద్రకళ, పర్ణితల అభినయం అనన్యసాధ్యమై నిలిచింది. చివరగా శ్రీనివాస వైభవం నర్తనం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసి ప్రాచీన ఆలయ ఆగమ నృత్య వైభవాన్ని కళ్ళముందుంచింది. నర్తించిన పది మంది చిన్నారులను మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ మత్సేటి శివ ప్రసాద్, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ యర్రమోతు ధర్మరాజు, ఆలయ చైర్మన్ నీలి కోటేశ్వరరావు, పండూరి అప్పారావు అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నర్తన రుషి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ను సన్మానించి ప్రశంసించారు.

# నిత్యం ప్రజాసేవలో ముందుండాలి..

**- సమిష్టిగా ముందుకు సాగుదాం.. - కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటా...**

**- పార్టీశ్రేణులు ఐక్యంగా ఉండాలి.. - అరకు పార్లమెంట్ తెదేపా అధ్యక్షురాలు ఎమ్.తేజోవతి**

**- ఎమ్మెల్యే, రాష్ట్రఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి**



**రంపచోడవరం( మనసులో మాట) జనవరి 3..** తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని నమ్ముకున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు ఎమ్. తేజోవతి అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో శనివారం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్ సౌజన్యంలో తెదేపా నియోజకవర్గ స్థాయి నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధ్యక్షురాలుగా పోలవరం జిల్లాలో అడుగు పెట్టిన ఎమ్.తేజోవతిని ఎమ్మెల్యే శిరీషదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి నామినేటెడ్ సభ్యులు ,మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులను పరిచయం చేశారు. అనంతరం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తానని తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు పని చేస్తానని పేర్కొన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకువెళ్లటంలో పార్టీ శ్రేణులు సంయుక్తంగా పని చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో అభివృద్ధి సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన హామీలు అన్నీ అమలు చేశామన్నారు.పరిపాలన సౌలభ్యం రీత్యా పోలవరం జిల్లా చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదే అన్నారు. ప్రతీ నెలా రెండో శనివారం, ఆదివారం మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎలాంటి సమస్య లు ఉన్నా స్థానికంగా పరిష్కారం కాకపోతే తన దృష్టిలో పెట్టాలని సూచించారు. తన వంతుగా పరిష్కార చర్యలు చేపడతా నని పేర్కొన్నారు. మరికొందరు వక్తలు మాట్లాడుతూ పార్టీ విధి విధానాలపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్, ఏ పి ఐ ఐ సి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, ఎ ఎం సి చైర్మన్ లోతా లక్ష్మణరావు, మండలపార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, జె. వెంకటరమణ, పల్లాల వెంకటరెడ్డి, పొత్తూరు కాంతారెడ్డి, గురుకు శేషు. కుమార్, గోళ్ళ చంటిబాబు, జమాల్ ఖాన్, బొర్రా నరేష్, బొల్లా పుల్లయ్య, యడవల్లి భాస్కర్, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, కుంజం బాపన్నదొర, కె. పోశమ్మ, రత్నకుమారి, లోవమ్మ, రాంబాబు, మల్లేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు పాము అర్జున్, మాగపు బాబురావు, సీనియర్ నాయకులు దంతులూరి శివాజీ రాజు, గణజాల తాతారావు, రైతు విభాగం నాయకులు కనిగిరి రాంబాబు, మువ్వా శ్రీను, మధు, బాపిరాజు, మాజీ ఎంపీపీ తీగలప్రభ, బుల్లియమ్మ, నిరంజనీ దేవి, చోటు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతున్నారు

# చర్యలు తీసుకోండి

**- కలెక్టర్లకు దూరదృశ్య సమావేశంలో హెచ్చరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**అమలాపురం (మనసులో మాట) జనవరి 3:** డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తులు నమోదు చేయడంలో అవినీతికి పాల్పడుతున్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు దూర దృశ్య సమావేశంలో హెచ్చరించారు .శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీడీవో డిప్యూటీ ఎంపీడీవో వార్డు సచివాలయ అధికారులతో జెసి టి నిశాంతి సమావేశం నిర్వహించి పలు అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూరదృశ్య సమావేశంలో డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తు నమోదులో అవినీతికి పాల్పడుతున్నారని దీనిపై ఎంక్వయిరీ చేయించి సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆయన హెచ్చరించారు. అనంతరం జేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే స్వామిత్వ సర్వేలో ఆశించిన పురోగతి సాధిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని అధికారులు ఆదేశించారు.కుటుంబ సమగ్ర సమాచార సేకరణ కార్య క్రమం ద్వారా గ్రామ వార్డు సచి వాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబాలను గుర్తించి, సంక్షేమ పథకాలు సమర్థ వంతంగా అమలు చేసేలా, ప్రభుత్వ డేటాను ఖచ్చితం సేకరిస్తూ దాని ప్రకారం వివిధ సంక్షేమ పథకాల అర్హులందరికీ దశలవారీగా పథకాల అమలు ద్వారా న్యాయం చేకూర్చాలన్నా రు. గ్రామ వార్డు సచివాలయ హౌస్ హోల్డ్ డేటాబేస్‌ను అప్ డేట్ చేయాలన్నారు. సర్టిఫికెట్లు, సేవలకు పునరావర్తన పరి శీలన అవసరాన్ని ఈ ప్రక్రి య తగ్గిస్తుందన్నారు. సిటిజన్ ఈ కేవైసీ పురోగతిపై సమీక్షిస్తూ ఇ కేవైసీ ద్వారా పౌరుల గుర్తింపు వివరాలను డిజిటల్‌గా ధృవీకరించే విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తేవాలని ఆదేశించారు. చదువుకున్న నిరుద్యోగ యువత నైపుణ్యాలు, విద్యార్హతలు, ఆశక్తులను మ్యాప్ చేసే కౌశలశీ సర్వేను సమర్థవంతంగా చేపట్టి యువతకు తగిన నైపుణ్య శిక్షణ, ఇంటి నుండే ఉద్యోగ కల్పన వివిధ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు, సేవా రంగాల సమన్వయంతో అవసరమైన డేటాబేస్ చేస్తూ పదో తరగతి నుంచి ఐటిఐ డిప్లొమా, డిగ్రీ, పీజీ వరకు చదివి ప్రస్తుతం ఉద్యోగం లేని లేదా ఉద్యోగ మార్పు కోరుకునే యువత కోసం గ్రామ,వార్డు సచివా లయాల పరిధిలో ఉన్న అర్హులైన అభ్యర్థులందరిని కవర్ చేయడమే లక్ష్యంగా ఈ సర్వే ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు ఈ సర్వే ద్వారా కంప్యూటర్ స్కిల్స్, మాట్లాడే వ్రాసే భాషలు, చేయగలిగే ఉద్యోగ రకాలు, ఇతర ప్రత్యేక స్కిల్స్ నమోదు చేసి వారికి తగిన ఉపాధి ఉద్యో గ అవకాశాల కల్పనకై సర్వే డేటా ఆధారంగా క్వాలిఫైయింగ్ పరీక్షలు, స్కిల్ టెస్ట్‌లు, కమ్యూ ని కేషన్ టెస్ట్‌లు నిర్వహించి, అభ్యర్థుల ప్రొఫైల్ ను కంపెనీల కు పంపుతూ మెరుగైన అవకా శాలను చేజిక్కుంచుకొనేలా ప్రోత్స హించాలన్నారు. నిర్దేశిత కాలవ్యవధిలో ముటేషన్ తది తర దరఖాస్తులను అప్లోడ్ చేయాలని ప్రభుత్వ నిర్దేశిత 5 అంశాల పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారని సంతృప్తి స్థాయిలు మెరుగుపరిచేలా పనితీరు కనబరిచాలని ఆమె ఆదేశించారు. పెండింగ్ అంశాల పట్ల మండలాల వారీగా సమీక్షించి రానున్న సమీక్షకు ఆశించిన పురోగతిని తీసుకుని రావాలని ఆమె స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమాలను ప్రతి మూడో శనివారం సమర్ధ వంతంగా నిర్వహిస్తూ పరి శుభ్ర ఆహ్లాద గ్రామాలను తీర్చిదిద్దా లని సూచించారు. స్వామిత్వ రెండో దశ సర్వే కు సంబంధించి నోటీసులు సక్రమంగా జారీ చేస్తూ ఖచ్చితత్వంతో డిజిటల్ రికార్డులను రూపొందించి భావి తరాలకు అత్యంత పారదర్శ కమైన భూహక్కుపట్టాలను అందించాలన్నారు శానిటేషన్ డ్రైవ్ ప్రక్రియను ఈనెల 4 వ తేదీ నాటికి ముగించాలని సూచించారు. ఇంటి పన్ను వసూలులో పురోగతి సాధించాలని ఆమె ఆదేశించారు. స్వర్ణ గ్రామ, వార్డు పంచాయతీలుగా తీర్చిది ద్దేందుకు ఈ ఆఫీస్ కార్యక్రమాల ద్వారా సుపరిపాలన అందించేందుకు ప్రతి దశలో పటిష్ట మైన చర్యలు గైకొనాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి పర్యా వరణహితంగా జిల్లాను తీర్చిదిద్దేందుకై ప్లాస్టిక్ కు బదు లు అరటి ఆకులు వినియోగం, మట్టి గ్లాసులు పాత్రలు వాడ కంపై దృష్టి సారించి పూర్వపు సంస్కృ తి సాంప్రదాయాలపై మక్కువ చూపేలా సమాజంలో పరివర్తన తీసుకొచ్చి చేతి వృత్తులను హస్త కళా రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. మండ లాలకు వలసలు వచ్చి ప్రభుత్వ సహాయం కొరకు అభ్యర్థించే వారి వివరాలను తెలిపితే ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందించి జీవనోపాదుల భద్రతకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డి శాంత లక్ష్మి, డి ఎల్ డి ఓ లు రాజేశ్వ రరావు విజయలక్ష్మి ఎంపీడీ వోలు ఉప యంపి డిఓలు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ల ఒత్తిడి భరించలేం

**- గ్రామీణ తపాల ఉద్యోగుల ఆవేదన**




**రామచంద్రపురం (మనసులోమాట) జనవరి 03** గ్రామీణ తపాలా ఉద్యోగులపై బలవంతపు టార్గెట్ల పేరుతో అధికారులు రోజురోజుకీ ఒత్తిడి పెంచుతున్నారని ఉద్యోగులను ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని, టార్గెట్లు పూర్తి చేయని ఉద్యోగులను ఉన్నతాధికారులు ఇబ్బందులు గురి చేస్తున్నారని రామచంద్రపురం పెన్షనర్ల తపాల ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి రామగంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం రామచంద్రపురం బ్రాంచ్ సర్వసభ్య సమావేశం శనివారం డాక్టర్ చెలికాన్ రామారావు మెమోరియల్ హాల్లో కామ్రేడ్ వై స్పర్జన్ రాజు అధ్యక్షతన జరిగింది.ముఖ్యతిధిగా విచ్చేసిన రామగంగాధరం మాట్లాడుతూ ఇటీవలఒక సబ్ డివిజన్ అధికారి మీటింగ్ కు రాలేదని నెపంతో మెయిల్ ఓవర్సీస్ మహిళా ఉద్యోగులను చెప్పరాని భాషలో దూషిస్తూ మీరు పోస్టల్ ఇన్స్పెక్టర్ ఆఫీసుకు ఒంటరిగా రావాలని మహిళా ఉద్యోగులను వేధిస్తున్నారన్నారు. ఇతనికి వంత పాడుతున్న అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గంగాధరం డిమాండ్ చేశారు. అధికారులు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసుకుంటూ, హెడ్ క్వార్టర్ లో ఉండకుండా, గ్రామీణ తపాలా ఉద్యోగులను మాత్రం పనిచేసే ప్రదేశాల్లో తప్పనిసరిగా నివసించాలని బెదిరించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులకు ఒక నిబంధనను, గ్రామీణ తపాలా ఉద్యోగులకు మరొకర నిబంధనలు వర్తింప చేస్తున్నారని విమర్శించారు. మరో అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ పోస్టుమాస్టార్ టి పుల్లేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల పెర్సనల్ సెల్ఫోన్లో అధికారులు తరచూ సమావేశాలు పేరుతో మెసేజ్లు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని, సమావేశాలకు హాజరైన ఉద్యోగులకు టీఏడీఏ చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో బిఫోర్ కార్యదర్శి ఎస్ రమణ, రామచంద్రపురం బ్రాంచ్ ఉద్యోగుల కార్యదర్శి ఎస్ మునేశ్వరరావు ,పి గణేష్ పాటు పలువురు ప్రసంగించారు.



## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3:** ముమ్మిడివరం డాక్టర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు డిగ్రీ, శ్రీకృష్ణదేవరాయ జూనియర్ మహిళా కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి చేసిన కృషిని అధ్యాపకులు విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను కళాశాల యాజమాన్యం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామూర్తి, డైరెక్టర్లు జగతా సురేష్, గణేశులసతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## త్యాగరాజ ఆరాధన ఉత్సవాలలో రెండవ రోజు భక్త మార్కండేయ హరికథా గానం




అనపర్తి (మనసులో మాట) జనవరి 3:శ్రీ శారద సంగీత కళా సమితి అనపర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, 27వ శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో, రెండవ రోజు శనివారం కార్యక్రమంగా హరికథా చూడామణి శ్రీమతి పురాణం విజయలక్ష్మి " భక్త మార్కండేయ" హరికథాగానం శ్రోతలను భక్తి పరవశంతో తన్మయత్వానికి గురి చేసింది . శ్రీమతి విజయలక్ష్మి కి విద్వాన్ మహేంద్రవాడ నరసింహా మూర్తి వయోలిన్ పై, విధ్వాన్ కోటిపల్లి సూర్య బాబు మృదంగం ద్వారా, సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి ముందు అనపర్తి కి చెందిన శ్రీమతి గొలుగూరి సూర్య ప్రభావతి ఆధ్వర్యంలో శిష్యులు చేత వీణ వాయిద్య నాదనీరాజనం జరిగినది. ఈ కార్యక్రమం మేడపాటి చెల్లారెడ్డి తేతలి త్రినాధ్ రెడ్డి సంయుక్త సౌజన్యంతో నిర్వహించారు . ముఖ్యఅతిథిగా కర్రి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. కళాసమితి అధ్యక్షులు తమలంపూడి చిన ఆదిరెడ్డి, సభ్యులు కర్రి రామారెడ్డి, బి. వీర వెంకటరమణ ,ఎల్ వెంకట సత్య శ్రీనివాస్, ఫణి కుమార్, కర్రి శ్రీ చంద్రశేఖర్ రెడ్డి , కర్రిఅశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా లయన్స్ హంగర్ సర్వీస్ వీక్ కార్యక్రమం ప్రారంభం




**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 03:** మండల పరిధిలోని సుంకరపాలెంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు ఏపీ సింగ్ పిలుపు మేరకు హంగర్ సర్వీస్ వీక్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. సుంకరపాలెం శ్రీ రవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమానికి లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్స్ ఒకటవ డివిజి చిట్నీడి శ్రీనివాస్, సెకండ్ డివిజి పెద్దిరెడ్డి ఉమా మహేశ్వరావులచే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో లయన్స్ ఇంటర్నేషనల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది అన్నారు. ఆహారం అందని వారికి ఆహారాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అన్నారు. జనవరి 3 నుంచి 11 వరకు దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి డి జిలు బాదం బాలకృష్ణ, ఈవీవీ ఈశ్వర్ కుమార్, లింగములు కృష్ణమూర్తి, ముంజలూరి విశ్వేశ్వరరావు, వేలూరి సూర్యనారాయణ జిల్లా, లయన్స్ ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**జానుబాబు కుటుంబానికి ప్రత్తిపాడు బార్ అసోసియేషన్**

# అండగా ఉంటుంది

**- అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు**



ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 3 ఇటీవల ఆకస్మిక గా మృతి చెందిన ఏలేశ్వరం కి చెందిన న్యాయవాది బాధ జానుబాబు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం అన్నారు . ఏలేశ్వరంలోని జానుబాబు నివాసంలో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజాల చిట్టిబాబు మాట్లాడుతూ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా జాను బాబు కుటుంబానికి రావలసిన నిధులను వెంటనే మంజూరు చేయిస్తామని, కుమార్తె చదువుకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య, బుగతా శివ, న్యాయవాదులు అవసరాల దేవి, బి మధుబాబు, పలివేల నాగేంద్ర రాజు, ఏ మల్లేశ్వరరావు, బి అశోక్, జి కిషోర్, ప్రసాద్, న్యాయవాద గుమస్తాలు ఉన్నారు.



## పాదగయా క్షేత్రంలో వైభవంగా ముక్కోటి పౌర్ణమి వేడుకలు

**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 3:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పిఠాపురంలోని శ్రీ రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయంలో ముక్కోటి పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.స్వయంభూ ఉమా కుక్కుటేశ్వర స్వామి వారికి వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక రుద్రాభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని సహస్ర పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించారు.ముక్కోటి పౌర్ణమి పర్వదినం కావడంతో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో చండీ హోమాన్ని జరిపారు. సాయంత్రం వేళ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వేద మంత్రోచ్చారణల మధ్య శాంత కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.ఉత్తర ద్వార దర్శనం:ముక్కోటి పౌర్ణమి ప్రత్యేకత దృష్ట్యా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహక అధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాసు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పునీతులయ్యారు.

## ఘనంగా నీలకంఠేశ్వర స్వామి కళ్యాణం



**పిఠాపురం (మనసులో మాట)జనవరి 3:** కాశీ విశ్వనాథుడే తరలివచ్చారా అనేంతలా కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.దొంతమూరులో కొలువైన నీలకంఠేశ్వరస్వామి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. కాశీ నుండి వచ్చిన వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అత్యంత వైభవోపేతంగా కళ్యాణాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కుంటముక్కల అబ్బు, ఆయన కుమారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు పి.దొంతమూరు పరిసర వాసులు పాల్గొన్నారు. ఉదయం నుండి అభిషేకార్చనలు జరిగాయి. నీలంకతేశ్వరుడికి సుగంధ ద్రవ్యాలను కలిపి తైలాభిషేకాలు చేశారు. లక్ష్మీ గణపతి హోమంతో మొదలైన పూజలు, తులసీ పూజ, లక్ష పత్రి, జ్యోతిర్లింగార్చన, రుద్రహోమం అనంతరం నీలకంఠేశ్వరస్వామికి దివ్యకళ్యాణం నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకూ వేద మంత్రాలతో గ్రామం మార్మోగింది. కాశీ పండితుల వేద మంత్రోచ్ఛరణలతో గ్రామం పులకించిందని, నిర్వాహకులు కుంటముక్కల అబ్బు, కిరణ్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇది తమ చిర కాల కోరిక అని, శివుని ఆశీస్సుల కోసం జరిపే మహోత్తర వేడుకకు భక్తులంతా హాజరై ఆతిధ్యం స్వీకరించడం తమ పూర్వజన్మ సుకృతమన్నారు. గ్రామం సుభిక్షింగా ఉండాలని, ఈ పురాతన ఆలయంలో చేపట్టిన పూజకు గ్రామ పెద్దల సహకారం ఉండటం తమకెంతో మనోధైర్యాన్ని ఇచ్చిందన్నారు. శివుడికి జరిపిన కార్యంతో మరింత శక్తి వచ్చినట్లైందన్నారు. శివుని దయతో మరిన్ని విజయాల వైపు పయనిస్తామని ఈసందర్భంగా నిర్వాహకులు కుంటముక్కల కిరణ చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువత అందించిన సహకారంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



# జిల్లాలో రవి సీజన్ కు అందుబాటులో యూరియా ఉంది

### మండల వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి యూరియా వినియోగంపై విస్తృత అవగాహన కల్పించండి..

### అధికారులను ఆదేశించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ( మనసులో మాట) జనవరి 3..** జిల్లాలో రబీ సీజనుకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి యూరియ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..వ్యవసాయం, ట్రాన్స్పోర్ట్, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో జిల్లాలోని యూరియాల్ అభ్యతపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని మండలాల వ్యవసాయ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. మండలాల వారిగా యూరియ లభ్యతపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 15,221 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు నేటికి 4669 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు రిటైల్ డీలర్ల వద్ద 2444 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ వద్ద 614 మెట్రిక్ టన్నులు, రైతు సేవ కేంద్రాల్లో 1157 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు హోల్ సేలు డీలర్లు వద్ద 53 మెట్రిక్ టన్నులు, ఏపీ మార్కఫెడ్ వద్ద 400 మెట్రిక్ టన్నులు వెరసి 4669 మెట్రిక్ టన్నులు యురియా జిల్లాలో అందుబాటులో ఉందని ఆయన అని వివరించారు. జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేకుండా అవసరమైన మేరకు మండల కేంద్రాలకు సరఫరా చేయడం జరుగుతుందని జేసీ తెలిపారు.రైతులకు అవసరమైన యురియా సరఫరా సంతృప్తికరంగా ఉన్నదన్నార. రైతులు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తగింతన యురియాను మండలాలలో నిల్వ ఉండేలా చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించినారు.అలాగే మండల వ్యవసాయ అధికారులను డీలర్లు, టీసీఎస్ లు, ఎరువుల దుకాణాలు ముమ్మర తనిఖీలు నిర్వహించి, కృత్రిమ కొరత, ఎమ్మార్పీ, ఎరువులు మళ్లింపు వంటి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూరియా వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు.ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ మెరుగుపడే విధంగా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జేసీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్ కుమార్, లీగల్ మెట్రాలజీ డీసీ జనార్ధన రావు, డీసీవో బి. శ్రీనివాసరెడ్డి, ఆర్టీవో మురళీకృష్ణ, మార్కెటింగ్ ఏడీ కెఆర్ఆర్ నాగేశ్వరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

### సావిత్రీబాయి ఫూలే సమాజానికి చేసిన

# సేవలు నిరుపమానం



**కాజులూరు మనసులో మాట జనవరి 3..** సావిత్రిబాయి పూలే సమాజానికి చేసిన సేవలు నిరూపమానమని కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్నింగ్ విష్ణుమూర్తి అన్నారు. శనివారం కాజులూరుజిల్లా పరిషత్ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం చాలా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి మాట్లాడుతూ తొలితరం ఉపాధ్యాయిని శ్రీమతి సావిత్రీబాయి పూలే ఆ రోజులలో మహిళా సాధికారతకు విశేష సేవలు చేసారని ఇంటినుండి బయటకు రానివ్వని బాలికలను, మహిళలను చేరదీసి విద్యావంతులుగా మార్చిన విధానం ప్రస్తుతించదగినదని, సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి విశేష కృషి చేసిన ఆవిడ సేవలు నిరుపమానమని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయుడు చింతా నారాయణ మూర్తి మాట్లాడుతూ నేటి తరం విద్యార్థినిలు అందరూ సావిత్రీబాయి పూలే తో పాటు మన పాఠశాలలో గల మహిళా ఉపాధ్యాయినిలను ఆదర్శంగా తీసుకొని వారి ప్రేరణతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలో గల మహిళా ఉపాధ్యాయినిలు లక్ష్మీ కామేశ్వరి, రాజ రాజేశ్వరి, సుజాత, గీతా కృష్ణవేణి, విజయలక్ష్మి, నాగేశ్వరి, బషీరున్నీసా,పద్మావతి, గౌతమీ సుధ,గంగా భవానీ లను ఉపాధ్యాయులు అంతా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ హరినాథ్, వల్లీ బాషా, బుజ్జిబాబు, ఈశ్వరరావు, రామకృష్ణ, యుగంధర్, సుబ్రహ్మణ్యం, శివప్రసాద్, శ్రీశా, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పైడా కాలేజ్ లో ఆకట్టుకున్న డిప్లొమా ప్రాజెక్ట్ ఎక్స్‌పో



**తాళ్లరేవు (మనసులో మాట), జనవరి 03 :** పటవల పైడా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రాంగణంలో పైడా పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన డిప్లొమా ప్రాజెక్ట్ ఎక్స్‌పో2026 విద్యార్థుల సృజనాత్మకతకు, నూతన ఆలోచనలకు ప్రతీకగా నిలిచింది. ఈ ఎక్స్‌పోలో టెక్నికల్, నాన్-టెక్నికల్ విభాగాలకు చెందిన విద్యార్థులు తమ ప్రయోజనాత్మక ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు స్మార్ట్ అప్లికేషన్లు, ఆటోమేషన్ సిస్టమ్స్, డేటా ఆధారిత పరిష్కారాలను ప్రదర్శించగా, ఎలక్ట్రానిక్స్ విభాగం విద్యార్థులు సెన్సార్ ఆధారిత ప్రాజెక్టులు, ఎనర్జీ సేవింగ్ మోడల్స్‌ను రూపొందించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే యంత్ర నమూనాలు, వ్యవసాయానికి అనుకూలమైన మెకానికల్ మోడల్స్‌ను ఆకట్టుకునే విధంగా వివరించారు. అలాగే డిప్లొమా అగ్రికల్చర్ విద్యార్థులు ఆధునిక సాగు పద్ధతులు, నీటి సంరక్షణ పద్ధతులు, పంట దిగుబడి పెంచే మోడల్స్ ప్రదర్శించారు.డిప్లొమా ఫిషరీస్ విభాగం విద్యార్థులు చేపల పెంపకంలో ఆధునిక సాంకేతికత వినియోగం, ఉత్పాదకత పెంపుదలపై రూపొందించిన ప్రాజెక్టులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డిప్లొమా వెటర్నరీ సైన్స్ విద్యార్థులు పశుసంరక్షణ, వ్యాధుల నివారణకు సంబంధించిన ప్రాయోగిక నమూనాలను ప్రదర్శించారు. ఇదే విధంగా సైన్స్ ఎక్స్‌పోలో శాస్త్రీయ సూత్రాలను సులభంగా అర్థమయ్యే విధంగా విద్యార్థులు వివరించడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ ప్రాజెక్ట్ ఎక్స్‌పో విద్యార్థులలోని ఇన్నోవేషన్ పట్ల ఉన్న అభిరుచి, సమస్యలను పరిష్కరించే దృక్పథం, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను స్పష్టంగా ప్రతిబింబించింది. ప్రతి విద్యార్థి తన ప్రాజెక్టును నమ్మకంగా వివరించడం వారి ఆత్మవిశ్వాసం, విజ్ఞానపరమైన అవగాహనకు నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి హాజరైన పైడా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ పైడా సత్య ప్రసాద్ మాట్లాడుతూ,ఇలాంటి ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను పెంపొందిస్తాయన్నారు. సెక్రటరీ పైడా శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ పైడా నిత్య విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత వినూత్న ప్రాజెక్టులకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని తెలిపారు. డీన్ యమ్. వీరభద్రరావు, డిప్లొమా ప్రిన్సిపాల్ రవీంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ డా. పి.వి. సూర్య ప్రకాష్, కోఆర్డినేటర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులకు నిరంతరం మార్గదర్శనం అందించగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాజముద్రలతో పాసుబుక్కుల పంపిణీ



**కాజులూరు మనసులో మాట జనవరి 3..** ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే పారదర్శకత, విశ్వసనీయత చాలా అవసరమని ఈ లక్ష్యాన్ని సాధించడంలో రాజముద్రలతో పాసుబుక్కుల పంపిణీ కీలక పాత్ర పోషిస్తోందనీ రాజముద్ర అనేది ప్రభుత్వ అధికారిక గుర్తనీ ఇది పాసుబుక్‌కు చట్టబద్ధతను, నమ్మకాన్ని రైతులకు అందిస్తుందనీ తాహసిల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. శనివారం మండలంలోని ఆర్యవటం గొల్లపాలెం శలపాక గ్రామాల్లో పాస్బుక్కులు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా తాహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూపాసుబుక్కులు ముఖ్యంగా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధిని నేరుగా చేరవేయడానికి ఉపయోగపడతాయనీ రైతులకు ఇచ్చే భూ హక్కుల పాసుబుక్కులు రాజముద్రతో ఉండటం వలన నకిలీ అవకాశాలు తగ్గుతాయనీ రాజముద్రలతో పాసుబుక్కులు పంపిణీ చేయడం ద్వారా అవినీతి నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు .లబ్ధిదారులు తమకు అందే సాయం సక్రమంగా నమోదు అయిందో లేదో సులభంగా తెలుసుకోగలుగుతారు. అంతేకాకుండా, ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందనీ అధికారులు కూడా బాధ్యతాయుతంగా పని చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు.ఈ పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమాలు గ్రామ సభలు, మండల స్థాయి సమావేశాలు లేదా ప్రత్యేక కార్యక్రమాల ద్వారా జరుగుతాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజలకు పథకాల వివరాలు తెలియజేయడం, వారి సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుందనీ దీనివల్ల ప్రజల అవగాహన కూడా పెరుగుతుందన్నారు.రాజముద్రలతో పాసుబుక్కుల పంపిణీ అనేది మంచి పాలనకు ప్రతీక. ఇది ప్రభుత్వ సేవలను ప్రజలకు దగ్గర చేయడంలో, న్యాయసమ్మతమైన వ్యవస్థను నిర్మించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పోతురాజు ప్రసన్న మౌనిక, పోతు గనిరాజు డిప్యూటీ తాహసిల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేగేశ్వరరావు స్థానిక రెవెన్యూ అధికారులు ఆర్ రాయుడు , శ్రీనివాస్ , శ్రావణి, శ్రీరామ్ ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

# ఇన్నోవేషన్ హబ్‌కు బలోపేతం

### - కొత్త విభాగాధిపతుల నియామకం

### - జాయింట్ కలెక్టర్, ఆర్టిఐహెచ్ డైరెక్టర్ వై మేఘా స్వరూప్





**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** ఆవిష్కరణలు, వ్యాపార ఆలోచనలు, సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు స్టార్టప్‌లు, ఇన్నోవేటర్లు, పరిశోధనాధారిత కార్యక్రమాలకు సమగ్ర మద్దతు అందించాలనే లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్, రాజమహేంద్రవరం ఏర్పాటయ్యిందని ఆర్ టీఐహెచ్ డైరెక్టర్, జేసీ వై మేఘా స్వరూప్ తెలిపారు.ఈ క్రమంలో ఇన్నోవేషన్ హబ్ కార్యకలాపాలు, సాంకేతిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడానికి కీలక నాయకత్వ నియామకాలను చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కామన చంద్ర ప్రకాష్ ఇన్క్యుబేషన్ విభాగం అధిపతిగాను మరియు హెడ్ – ఫైనాన్స్ బాధ్యతలను అదనపు చార్జిగా కేటాయించారు. ఇన్క్యుబేషన్, స్టార్టప్ మార్గనిర్దేశం, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అభివృద్ధిలో ఉన్న విశేష అనుభవంతో, ఇన్క్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్ మద్దతు చర్యలు, వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన నాయకత్వం వహించనున్నారు. అదే విధంగా గురుగుబెల్లి సౌజన్యని ల్యాబొరేటరీ టెస్టింగ్ విభాగం అధిపతిగా నియమిస్తూ, హెడ్ పార్ట్‌నర్‌షిప్ బాధ్యతలను అదనపు చార్జిగా అప్పగించడం జరిగిందని తెలిపారు. ల్యాబొరేటరీ కార్యకలాపాలు, పరీక్షా సౌకర్యాలు, నాణ్యత నియంత్రణ ప్రక్రియలు, సాంకేతిక మద్దతు సేవలను పర్యవేక్షిస్తూ, ఇన్నోవేషన్ హబ్‌లో ఉన్నత ప్రమాణాల పరిశోధన, పరీక్షా మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ఆమె కృషి చేయనున్నారని జేసీ మేఘా స్వరూప్ తెలిపారు. ఈ నియామకాలు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్, రాజమహేంద్రవరాన్ని ఒక శక్తివంతమైన ఆవిష్కరణ, పరిశోధన, స్టార్టప్ అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక మైలు రాయిగా నిలుస్తాయని జేసీ వై మేఘా స్వరూప్ తెలియజేశారు. ఇన్క్యుబేషన్ హబ్ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లడంలో ఇరు నియామకులు విలువైన సేవలు అందిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి03: సవిలే పౌండేషన్ కరప ఆధ్వర్యంలో సవిలే రాజేష్ అందించిన నూతన సంవత్సర కాలెండరు ను డిప్యూటి ఎమ్.పి.డి.వో-2 (సచివాలాయాలు), మండల విద్యాశాఖాధికారి1 మంగాయమ్మ ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమం లో తాళ్లరేవు త్రిరత్న బౌద్ధధర్మ అద్యక్ష కార్యదర్శులు జక్కల ప్రసాద్ బాబు, గుత్తాల సుబ్రహ్మణ్యం, ఎస్- 16 అద్యక్ష కార్యదర్శులు వాకపల్లి అప్పారావు కాశి శ్రీనివాస్, ట్రెజరర్ నాగా బత్తుల శ్రీను, యు.టి.ఎఫ్ అద్యక్షులు ఎమ.తాతారావు, పినెపే నాగేంద్ర, లోవరాజు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.ద

## ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



**రామచంద్రపురం(మనసులో మాట) జనవరి 3..** పట్టణంలోని జిల్లా పరిషత బాలికోన్నత పాఠశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేకేఎల్ కుమారి, సోషల్ ఉపాద్యాయిని వరలక్ష్మిలు మొట్టమొదటి మహిళా ఉపాద్యాయిని సావిత్రిబాయ్‌పూలే విశిష్టతను విద్యార్దులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల పట్ల ఆనాడు ఉన్న వివక్షతలను, చిన్న చూపు వంటి ఎన్నో సమస్యలను అధిక మించి విద్యద్వారానే సమాజంలో మార్పు తీసుకురావాలని సావిత్రిభాయ్‌పూలే తెలిపారని వివరిచారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థిని నాగచంద్రలక్ష్మి సావిత్రిభాయ్‌పూలే వేషధారణలో చేసిన ఏక పాత్రాభినయం అందరిని ఆకట్టుకుది. ఉపాద్యాయులు డీసీ అప్పారావు, అనిత, భవానీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్. సిహెచ్. రామకృష్ణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆ రోజుల్లో ఆడపిల్లలను చదివించడంలో ఎన్ని కష్టనష్టాలకు ఎదుర్కొని తాను అనుకున్నది సాధించి, అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థులు కూడా చక్కగా చదువుకొని ఆదర్శవంతమైన వ్యక్తులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ వై .పద్మజ ,రమణ,అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సావిత్రిబాయి పూలేకి ఘన నివాళులర్పించారు.

## సూర్య పీఠం ట్రస్టుకు వెదురుపాక భక్తులు రూ 25 వేలు విరాళం



**గోకవరం (మనసులో మాట), జనవరి 3 :** సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన గోకవరంలో నిర్మితమవుతున్న సూర్య పీఠమునకు వెదురుపాక భక్తులు కొరిపిల్లి శ్రీశైలం, బొడ్డు వెంకటేశ్వరరావు, మడక వెంకటేశ్వరరావు, నక్కిరెడ్డి రామకృష్ణ బ్రదర్స్ 25000/రూ విరాళమిచ్చారు.ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ ట్రష్టి తోట సాయిబాబు సూర్య పీఠం స్థలదాత రాజా, ట్రస్ట్ సభ్యులు దోసపాటి సుబ్బారావు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా నిర్మిస్తున్న సూర్య పీఠమునకు ప్రజలు స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు ఈ విధంగా తమ ట్రస్ట్ కార్యక్రమాలకు అండదండగా ఉంటే మరెన్నో దైవకార్యాలు చేయడానికి తాము ఉత్సాహంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొరిపిల్లి అప్పలస్వామి, పిల్లంగోరు పాపారావు, నంగినీడి రాంబాబు, మార్నిడి రంగబాబు, ముడదాని చిన్నికృష్ణ మాస్టారు, సుంకర త్రిమూర్తులు, సిద్ధా వాసు, కామిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# అధిక వేగంతో తిరుగుతున్న ఆదిత్య బస్సులు

## ఎందరో ప్రాణాలను బలిగొంటున్న బస్సు వేగం - బస్సుల వేగంపై కొరవడిన నియంత్రణ

**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 3..** అధిక వేగంతో వస్తున్న ఆదిత్య యూనివర్సిటీ బస్సులు కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు.పైగా నిత్యం విద్యార్థులతో ప్రయాణించే ఈ బస్సుల వేగానికి నియంత్రణ కొరవడింది. ఆదిత్య యాజమాన్యం ఇలాంటి ఘటన లపై చర్యలు తీసుకోకుంటే ఏదో ఒక రోజు భారీ మూల్యాన్ని చెల్లించు కోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా ప్రజలు హెచ్చరిస్తున్నారు.కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జగ్గంపేటలో సుమారు ఐదున్నర ఆరు గంటల సమయంలో ఆదిత్య యూనివర్సిటీ కాలేజ్ బస్ అతివేగంగా రావడంతో జగ్గంపేట కృష్ణవేణి సెంటర్ ఎదురుగా హైవే నుంచి క్రిందకు దిగుతున్న ఒక వ్యక్తిని బస్సు అతివేగం కారణంగా వ్యక్తిని బలంగా డికోట్టడంతో ఆ వ్యక్తి మొఖం రోడ్డకు బలంగా తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడం జరిగింది. ఆ వ్యక్తి ఎవరో ఏంటో వివరాలు తెలియాల్సి ఉంది. ఆ వ్యక్తి జగ్గంపేట కృష్ణవేణి కాంప్లెక్స్ ఏరియాలో తరచూ తిరుగుతూ ఉండేవాడు అని జనాలు చెబుతున్నారు.ఈ ఆదిత్య కాలేజ్ బస్సులు ఈ టైంలో అతివేగంగా రావడం వలన ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి సుమారు నెల క్రితం మామిడాడ లో ఆదిత్య కాలేజ్ బస్సు ఒక కార్మికుడుని గుద్దడం వల్ల ఆ వ్యక్తి స్పాట్లో చనిపోవడం జరిగింది ఇలా నెలకొని ఈ ఆదిత్య కాలేజ్ బస్సులు మనుషులు ప్రాణాలతో చెలగాటలాడుతున్నాయి ఇకనైనా స్పీడ్ తగ్గించి జన ప్రవాహాలు తిరుగుతున్న సెంటర్లో కానీ గ్రామాలలో కానీ జాగ్రత్తగా వెళ్లాలని పలుమార్లు డ్రైవర్లకు చెప్పిన మాకు ఆదిత్య కాలేజ్ అతిపెద్ద సంస్థ కాబట్టి మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు చిన్న ఆఫీసు నుంచి పెద్ద ఆఫీసర్ వరకు మా సంస్థకు అనుకూలంగా ఉంటారు అనే ధోరణిలో ఈ ఆదిత్య బస్సుల వ్యవహారం జరుగుతూ ఉంటుంది కాబట్టి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నియమ నిబంధనలు వారికి సూచించాలని ప్రమాదం జరిగిన వ్యక్తికి తగిన మూల్యం చెల్లించాలని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం అధికారం వచ్చి 18 నెలలు అవుతున్న ఎస్సీ సంక్షేమ నిధులను

# కేటాయించలేదు

### -ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చినబాబు



కాకినాడ (మనసులో మాట) జనవరి 3కూటమి ప్రభుత్వం అధికారం వచ్చి 18 నెలల ఎస్సీ సంక్షేమ నిధులు పక్క పక్కదొవ పట్టించారు. తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడు కేంద్రం నుంచి ఎన్ ఎస్ ఎఫ్ డి సి కార్ లోన్లు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరం. 2026 నుంచి 2027 ఎస్సీ సంక్షేమ నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ కార్పొరేషన్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చినబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దళిత నాయకులు అంతా కలిసి ఎస్టి సోదరులు కూడా వారి నాయకులు కలిసి జిల్లాంత పర్యటన చేసి ఎస్సీ కార్పొరేషన్ నిధులు దక్కించుకోవాలని ఉమ్మడి పోరాటం చేయవలసిన బాధ్యత ప్రతి నాయకుడి మీద ప్రతి దళిత నాయకుని ఉందని మేము స్పష్టం చేస్తున్నావన్నారు . గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఎస్సీ కార్పొరేషన్ పక్కదో పట్టించారు. ఎంతోమంది దళిత నిరుద్యోగులు ఉపాధి కోల్పోవడం జరిగిందని తెలిపారు. వితంతువులకు గతంలో రుణాలు ఇచ్చే వారిని తెలిపారు. కొన్ని వేల మంది దళిత నిరుద్యోగులు ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్ నిధులు ప్రభుత్వం కేటాయించకపోవడం ఎస్సీ దళితులను అనుచివేస్తుందని ఆయన ఆరోపించారు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని ఆక్షేపించారు. అస్సి బ్యాక్లాగ్ పోస్టులు కూడా ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని అలాగే ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన నిధులు కూడా బాధితులకు కేటాయించక పోవడం కూడా బాధాకరమన్నారు. ఈ అస్సి సమస్యలు దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో మంచి ఉద్యమానికి పునాది వేస్తున్నామని చెప్పారు. కాకినాడ జిల్లాలో అన్ని మండలాలు అన్ని నియోజకవర్గాలు తిరిగి ఎస్సీ కార్పొరేషన్ ముట్టడినే కార్యక్రమానికి దళితులను బలోపేతం చేసి ఎస్సీ సంక్షేమం రక్షించుకునేందుకు మీరు అరెస్టు చేసిన ఏం చేసినా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తాం అన్నారు.

# హిందూ దేవాలయాలను రక్షించండి

## -హిందూ ధర్మాన్ని పరిరక్షించండి-మాజీ ఎంపీ మార్గాని భరత్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:** కలియుగ దైవమైన తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతిలో గోవిందరాజులు గుడి వద్ద మందు బాబు వీరంగం గోపురం మీదకి ఎక్కి తనకి మందు కావాలని అడిగిన దుర్మార్గపు నిర్వాకం శోచనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. ఇరవై నాలుగు గంటలూ మద్యం విక్రయాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం అవుతోందన్నారు. అష్టాదశ పీఠాల్లో 12వ పీఠమైన ద్రాక్షారామ గుడి వద్ద కపిలేశ్వరుడి లింగాన్ని ధ్వంసం చేసిన సంగతి విదితమే అని, అయితే ఈ దుశ్చర్యకు పాల్పడింది తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యుడని తెలియ వచ్చిందన్నారు. పైగా మరొక లింగాన్ని తీసుకువచ్చి విభూది పూసిన ఈ చర్యలను ఏమంటారని భరత్ ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం హిందూ ధర్మాన్ని మంటగలిపే చర్యలు చేస్తోందని ధ్వజమెత్తారు. నిందితులపై ఏ విధమైన చర్యలు లేవని..కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఏమనాలని ప్రశ్నించారు. తిరుమల ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని పెద్ద రాద్దాంతం చేస్తున్న ఈ ప్రభుత్వం..మరి తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కల్తీ జరిగిన వాస్తవమే..అయితే పామాయిల్ కలిసింది కానీ దీంట్లో ఏ రకమైన జంతువుల కొవ్వు కలపలేదని నిర్ధారణ చేసినా కూడా ఈ కూటమి ప్రభుత్వం..ఇప్పటికీ జగన్ ప్రభుత్వం పై అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా పుష్కరాల సమయంలో 44 దేవాలయాలను ధ్వంసం చేయడం, అలాగే గోదావరి పుష్కరాల సమయంలో 28 మంది భక్తుల ప్రాణాలు పోవడానికి గల కారణం ఈ చంద్రబాబు నాయుడు నిర్వాకమే అని భరత్ ధ్వజమెత్తారు. ఆ సమయంలో పబ్లిసిటీ పిచ్చితో ఏమి చేశారో ప్రజలందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. అప్పుడు జగనన్న ప్రభుత్వ హయాంలో రామ పాద క్షేత్రంలో శివలింగ ధ్వంసం జరిగిన తర్వాత వేదపండితులతో సంప్రోక్షణ చేయించి వేదమంత్రాలతో శివలింగాన్ని పున'ప్రతిష్టించడం జరిగిందన్నారు. ఇదీ మా జగనన్న ప్రభుత్వం హిందూ ధర్మాన్ని ఎంతలా గౌరవిస్తుందో అన్న దానికి నిదర్శనం అన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ ఎందుకు ముందుకు రావడం లేదు, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా జరుగుతున్న పరిణామాలను నిలదీసి ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పుడు వైసీపీ తరఫున బేషరతుగా ప్రభుత్వం ప్రజలు హిందూ మనోభావాలను గౌరవిస్తూ క్షమాపణ చెప్పాలని కోరుతున్నామని మార్గాని భరత్ రామ్ డిమాండు చేశారు.

# కనుమరుగవుతున్న డూ డూ బసవన్న లు

## సందడి లేని గంగిరెద్దులు - కళాకారులకు గౌరవం లేదు



ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3:తెలుగువారి సంస్కృతి కి, సంప్రదాయానికి ప్రతీక గంగి రెద్దు లాట... గంగిరెద్దులుసంక్రాంతి వస్తుందంటే చాలు.. రంగు రంగుల బట్టలు, గంటలు, మువ్వలతో అలంకరించిన బసవన్నలు ఇంటింటికీ తిరిగి అలరించేవి. కాలక్రమేణా శ్రీడూడూ బసవన్నశ్రీ గొంతులు మూగబోతున్నాయి. ఆదరణ కరువై, పొట్టకూటి కోసం గంగిరెద్దులను ఆడించే వారు వేరే పనులు చూసుకుంటున్నారు.పూర్వకాలం నుండి ఈ కళనే నమ్ముకున్నారు. ఎడ్లను తమ కన్న బిడ్డల్లా సాకుతూ, వాటికి విద్యలు నేర్పి, ఊరూరా తిరుగుతూ తెలుగు లోగిళ్లలో పండుగ వెలుగులు నింపుతారు. ఆధునిక కాలంలో యాంత్రిక జీవనం పెరగడం, వినోద సాధనాలు మారడంతో ఈ కళ తన ప్రాభవాన్ని కోల్పోతుంది. ఒకప్పుడు ఊరు మొత్తం ఎదురుచూసే ఈ ప్రదర్శనను ఇప్పుడు గడప దాటి పలకరించే నాథుడే కరువయ్యాడు.సంక్రాంతి రోజుల్లోనే..గంగిరెద్ల వారికి ఏడాది పొడవునా పనేమీ ఉండదు. కేవలం సంక్రాంతి పండుగ (ధనుర్మాసం) ప్రారంభంలో పండుగ వచ్చే నెల రోజుల ముందే వీరికి కాస్తో కూస్తో ఆదరణ లభిస్తుంది. పండుగ సమయంలో గ్రామస్తులు ఇచ్చే పాత బట్టలు, ధాన్యం, చిల్లర డబ్బులే వీరికి ప్రధాన ఆదాయ వనరు. బసవన్నలను అలంకరించడానికి, వాటి మేత కోసం చేసే ఖర్చులతో పోలిస్తే వచ్చే ఆదాయం నామమాత్రమే.. అపార్ట్మెంట్ సంస్కృతి పెరగడం వల్ల నగరాల్లో గంగిరెద్దుల రాక దాదాపు నిలిచిపోయింది.వృత్తిని వదిలేయలేక, పొట్ట నింపుకోలేక గంగిరెద్దుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఊరూరా తిరిగే సంచార జీవనం వల్ల వీరి పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. వీరి తాత, ముత్తాతలు, తండ్రులు పడుతున్న కష్టాలు చూడలేక తర్వాతి తరం కూలి పనులకు వెళ్తోంది. వీరికి స్థిర నివాసం లేకపోవడం వల్ల రేషన్ కార్డులు, ఓటరు కార్డులు వంటి ప్రభుత్వ ఫలాలు అందడం గగనంగా మారుతోంది. ప్రస్తుతం కోనసీమ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సుమారు 100కుటుంబాలకు పైగా ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒకప్పుడు ఊరురా గౌరవం పొందిన ఈ కళాకారులు, నేడు సరైన ఆదరణ లేక ఇతర పనుల వైపు మొగ్గ చూపుతున్నారు.

**ప్రాభవం తగ్గడానికి కారణాలు:**
యాంత్రీకరణ వల్ల వ్యవసాయంలో ఎద్దుల వినియోగం తగ్గిపోయింది. వినోద సాధనాలు, టీవీలు, స్మార్ట్ఫోన్ల రాకతో జానపద కళలపై ఆసక్తి తగ్గింది. ఆర్థిక ఇబ్బందులు, ఎద్దుల పోషణ ఖరీదుగా మారింది. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేదు

**సంస్కృతిని కాపాడుకుందాం:**
గంగిరెద్దులాట కేవలం ప్రదర్శన కాదు, అది మన వ్యవసాయ ఆధారిత నాగరికతకు ప్రతిరూపం. తెలుగు వారి సంప్రదాయాన్ని ప్రతిబింబించే గంగిరెద్దులాట అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం ఈ కళాకారులను గుర్తించి, పెన్షన్లతో పాటు ఎద్దుల మేతకు సబ్సిడీ వంటి రాయితీలు కల్పించి, ఈ జానపద కళను కాపాడాలి. సాంస్కృతిక ప్రదర్శనల్లో వారికి ప్రాధాన్యత కల్పించాలి.

**పూర్వం రాచ మర్యాదలు జరిగేవి**
మా తాతలు, తండ్రుల కాలంలో మాకు రాజమర్యాదలు జరిగేవి. ఇప్పుడు పట్టణాల్లో అయితే అడుక్కునే వారిలా చూస్తున్నారు. ఎద్దును చూసి మురిసిపోయే కాలం పోయింది. ఎద్దు పొట్ట నింపడమే ఇప్పుడు మాకు గగనమైపోయింది దీంతో చాలా మంది ఈ కష్టాన్ని భరించలేక కూలీ పనులకు వెళ్తున్నారు- ఆవుల వీరబాబు గంగిరెద్దుల కళాకారుడు

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - నక్క



**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 3:** పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం పంచాయతీ కార్యాలయంలో జరిగింది.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క నారాయణమూర్తి, జనసేన నాయకుడు నక్క బద్రి లు ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యల పరిష్కారానికి, వారికి పూర్తి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రీ-సర్వే అనంతరం పారదర్శకంగా రూపొందించిన ఈ కొత్త పాస్ పుస్తకాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ ఫలాలను అర్హులైన ప్రతి రైతుకూ చేరవేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు లబ్ధిదారులైన రైతులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. తమకు ప్రభుత్వం నుండి హక్కు పత్రాలు అందడం పట్ల కొడవలి గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజల సహకారంతోనే చోరీలు నివారణ

## - గొల్లపాలెం ఎస్సై ఎం. మోహన్ కుమార్



**కాజులూరు (మనసులో మాట) జనవరి 3..** సమాజంలో శాంతి భద్రతలు నిలకడగా ఉండాలంటే పోలీసుల కృషితో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని ఈ విషయాన్ని గొల్లపాలెం ఎస్సై శ్రీ ఎం. మోహన్ కుమార్ స్పష్టంగా తెలియజేశారు. శనివారం మండలంలోని కోలంక గ్రామంలో వ్యాపారస్తులతో చోరీలు నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలు పై వ్యాపారులకు పలు సూచన చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్ కుమార్ మాట్లాడుతూ చోరీలు వంటి నేరాలు పూర్తిగా నివారించాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండి, పోలీసులకు సహకరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.నేటి కాలంలో చోరీలు అనేవి అకస్మాత్తుగా జరిగే నేరాలు కావనీ. చాలా సందర్భాల్లో నేరస్తులు ముందుగానే ప్రాంత పరిస్థితులను గమనించి, ఇళ్లలో భద్రతా లోపాలు ఉన్నాయా లేదా అని పరిశీలిస్తారనీ అలాంటి సందర్భాల్లో పరిసరాల వారందరూ అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ఎంతో ముఖ్యమని ఇది చోరీలను ముందే అడ్డుకునేందుకు దోహదపడుతుందన్నారు. గ్రామంలోని ముఖ్యమైన కూడళ్ల లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే సాధ్యమైనంతవరకు చోరీలు జరగమని ఒకవేళ జరిగినప్పటికీ వారిని గుర్తించడం తేలిక అవుతుందన్నారు.పోలీసులు 24 గంటలూ విధుల్లో ఉన్నా, ప్రతి వీధి, ప్రతి ఇంటిని పర్యవేక్షించడం సాధ్యం కాదనీ అందుకే ప్రజల సహకారం మాకు బలమవుతుందని పేర్కొన్నారు. ఇంటి తాళాలు సరిగా వేయడం, విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచడం, పొరుగువారితో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం వంటి చిన్నచిన్న జాగ్రత్తలు పెద్ద నేరాలను నివారించగలవని ఆయన సూచించారు.అలాగే గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసే ప్రజా భద్రతా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు కూడా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వీటి ద్వారా ప్రజలకు నేరాలపై అవగాహన పెరిగి, పోలీసులతో సమన్వయం మరింత బలపడుతుందనీ సమాజం మొత్తం కలిసి పనిచేసినప్పుడే నేరరహిత వాతావరణం సాధ్యమవుతుంది.చోరీల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదనీ ప్రజలు అప్రమత్తంగా ఉండి, బాధ్యతాయుతంగా వ్యవహరించి, పోలీసులకు సహకరిస్తేనే సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారస్తులు వరద వెంకట నాగేశ్వరరావు జానాప్రసాద్ గోన సత్యనారాయణ ఆకుల అంజి తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలి

## -శిక్షణ పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమంలో డీటీఓ సురేష్

రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 3:జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా అవగాహనా కార్యక్రమాలుజాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం2026 కార్యక్రమాలలో భాగంగా శనివారం రాజమహేంద్రవరం నగరంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా రవాణా అధికారి (డీటీఓ) ఆర్ సురేష్ తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం ఏపీఎస్ఆర్టీసీ డిపోను సందర్శించి, అక్కడ శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని సూచించారు.అలాగే రాజమహేంద్రవరం హుకుంపేటలోని డీమార్ట్ సమీపంలో రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తూ రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేసి, వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు జీ ప్రణీత్ కుమార్, బీ ఉమా మహేశ్వర రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హోరెత్తిన దేశభక్తి గీతాలాపన

## అలరించిన విద్యార్థుల ప్రతిభ!




పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 3: సహృదయ మిత్రమండలి నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా రెండో రోజు శనివారం విద్యార్థులకు దేశభక్తి గేయాలాపన పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల నుండి సుమారు 56 మంది విద్యార్థులు హాజరై, తమ అద్భుతమైన గాత్రంతో దేశభక్తి గీతాలను ఆలపించి సభికులను మంత్రముగ్ధులను చేశారు.ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ తెలుగు ఉపాధ్యాయులు రేగళ్ల నీలకంఠ శర్మ, గంగా పావని విచ్చేసి, విద్యార్థుల ప్రతిభను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు.కార్యక్రమ పర్యవేక్షకులుగా సహృదయ మిత్రమండలి ప్రధాన కార్యదర్శి సతీష్ వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుండే కళల పట్ల ఆసక్తిని, దేశభక్తిని పెంపొందించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మిత్రమండలి గౌరవ అధ్యక్షులు కొమ్మనాపల్లి అప్పారావు, ప్రముఖ సభ్యులు వి.ఎస్. రెడ్డి, సత్యనారాయణ, కొండలరావు, శ్రీమతి వసంత ప్రసాద్, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన చిన్నారులు



**అనపర్తి (మనసులో మాట) జనవరి 3:** నూతన సంవత్సరం సందర్భంగా అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన చిన్నారులు మల్లిడి విశ్వన్ రెడ్డి, మల్లిడి ఉదయ్ చేతన్ రెడ్డి లు శుక్రవారం సాయంత్రం అనపర్తి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పై ఉన్న అభిమానంతో, చిన్నారులు కార్యాలయానికి రావడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సబ్బెళ్ళ పెద్ద సత్తిరెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ళ చంద్రశేఖర్ రెడ్డి, కర్రి సత్యనారాయణ రెడ్డి, తాడి వెంకటరెడ్డి, కర్రి కృష్ణారెడ్డి, చిన్నం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగర పి.హెచ్.సి.ని సందర్శించిన జిల్లా వైద్య శాఖాధికారి



**కపిలేశ్వరపురం (మనసులో మాట) జనవరి 3..** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగరను తూర్పు గోదావరి జిల్లా - జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ కె. వెంకటేశ్వర రావు శనివారం ఆకస్మికంగా దర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఓపి రిజిస్ట్రేషన్ విభాగం, ఇన్ పేషెంట్ వార్డు, లేబర్ రూమ్, లాబరేటరీ, ఫార్మసీ, వ్యాక్సిన్ స్టోరేజ్ గది, ఆసుపత్రి రిజిస్టర్, విభాగా లను, ఆయన పరిశీలించి ఇ.హెచ్.ఆర్ చేసే విధానాన్ని అడిగి తెలుసుకుని అయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ లో మెరుగైన ఫలితాలు సాదించెందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ పి. రత్నకుమారి కి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీ లోజిల్లా వైద్య శాఖాధికారి వెంట వివిధ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, డాక్టర్ షమ్మీ, ఎపిడిమియాలజిస్ట్ సుదీర్, ఎం. పి. హెచ్. ఇ. ఒ. లు బి.రాజు, వై. ఎస్. మూర్తి ఉన్నారు. ఈ కార్యక్రమం లో అంగర పి.హెచ్.సి - ఎం. పి. హెచ్. ఇ. ఒ. జి. మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, హెల్త్ విజిటర్- టీ మేరీ మణి, సూపర్ వైజర్ -ఎం నాని బాబు, స్టాఫ్ నర్స్. జె. బంగారు పాప, ఫార్మసిస్ట్ ప్రిస్కిల్లా తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

రాయలసీమ

కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప

ఆదివారం 4 జనవరి 2025 పేజీ : 16


# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి - కాంగ్రెస్ పార్టీ డిమాండ్

## జీవో నంబర్లు 590, 107, 108 వెంటనే రద్దు చేయాలి : తుంపర్తి పరమేష్




ధర్మవరం జనవరి 3 (మనసులో మాట) ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని వెంటనే ఆపాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ డిమాండ్ చేశారు. ధర్మవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అనేది పూర్తిగా కార్పొరేట్ మాఫియాకు ప్రభుత్వ అండదండలు కల్పించడమేనని తుంపర్తి పరమేష్ ఆరోపించారు. ప్రజలకు ఉచితంగా అందించాల్సిన వైద్య సేవలను, పేద విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన వైద్య విద్యను కార్పొరేట్లకు దారదత్తం చేయడం ద్వారా ప్రభుత్వం పేదలపై తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్లు 590, 107, 108 ప్రజావ్యతిరేకమని పేర్కొంటూ, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవోలపై రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ధర్మవరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు.



## సత్య కుమార్ అయినా కేతిరెడ్డి అయినా ధర్మవరం దళితులకు


# ఒకే నిర్లక్ష్యం!

- ఎమ్మెల్యే ఉన్నా లేనట్టే
- ధర్మవరం దళితులకు రక్షణ శూన్యం
- అగ్రకుల పార్టీల పాలనకు చెక్ పెట్టాల్సిన సమయం వచ్చింది
- బియస్పాపి ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ సాకే వినయ్ కుమార్

ధర్మవరం జనవరి 3 (మనసులో మాట) ధర్మవరం నియోజకవర్గంలో దళితులపై జరుగుతున్న దాడులు, అణచివేత ఘటనలపై ప్రస్తుత ఎమ్మెల్యే సత్య కుమార్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇద్దరి వైఖరి ఒకేలా ఉందని బహుజన్ సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ సాకే వినయ్ కుమార్ విమర్శించారు. పేర్లు మారుతున్నా దళితుల పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించడం లేదని అన్నారు.గతంలో చిన్నూరు, సుబ్బారావుపేట ప్రాంతాల్లో జరిగిన దళితులపై దాడుల ఘటనలపైనా సరైన స్పందన లేదని గుర్తు చేశారు. బాధితులకు న్యాయం జరగకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా దళితులపై దాడులు ఆగడం లేదని వ్యాఖ్యానించారు.తాజాగా పుల్లంపల్లి గ్రామంలో జరిగిన సంఘటనపై కూడా ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉందని సాకే వినయ్ కుమార్ తెలిపారు.ఇప్పుడు స్పందిస్తేనే మీరు ప్రజల్లో ఉన్నట్టు, లేకపోతే ప్రజలే తగిన విధంగా సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు. దాడులకు పాల్పడిన నిందితులకు కొంతమంది నాయకులు అండగా నిలవడం సరికాదని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.ప్రస్తుత ఎమ్మెల్యే సత్య కుమార్ నియోజకవర్గ ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని, గ్రామాలు%-%కాలనీల్లో తాగునీరు, ఉపాధి, నిరుద్యోగం, దళితుల భద్రత, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయని విమర్శించారు. ఓట్లు వేసిన ప్రజలకే తమ ఎమ్మెల్యే ఎవరో తెలియని పరిస్థితి ఉండటం బాధాకరమని అన్నారు.నిరుద్యోగం, రైతు సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల లేమి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వంటి ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రభుత్వం ఇతర అంశాలపైనే దృష్టి పెడుతోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో దళితులను గుర్తించే నాయకులు, సమస్యలు వచ్చినప్పుడు మౌనం పాటించడం సరికాదని అన్నారు."దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా చూసే రాజకీయ విధానానికి ఇక కాలం చెల్లింది. హోమ్ శాఖ తక్షణమే స్పందించి ధర్మవరంలో దళితులకు భద్రత కల్పించాలి. దాడులకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇకపై అగ్రకుల పార్టీల పాలనకు ముగింపు పలికి, బహుజన కులాల పాలన రావాల్సిన అవసరం ఉంది"అని బహుజన సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ సాకే వినయ్ కుమార్ తెలిపారు.

## పి.బి. ఆర్ జోన్ యజమాని పై గుర్తుతెలియని యువకుడు

# కత్తితో దాడి



పలమనేరు జనవరి 3 (మనసులో మాట): పి.బి.ఆర్ జోన్ యజమాని పై గుర్తుతెలియని యువకుడు కత్తితో దాడి చేసిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పలమనేరు అర్బన్ సిఐ మోహన్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా... పలమనేర్ పట్టణంలో పి.బి.ఆర్ జోన్ యజమాని షాపు వద్ద గలాటపడి వెళ్ళిపోతున్న సమయంలో అతనిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో భవంత్, సుధీర్, సునీల్ వీరి ముగ్గురిపై ఆ గుర్తు తెలియని వ్యక్తి గంటా వూరు వద్ద కత్తితో దాడి చేయడం జరిగింది. వీరి ముగ్గురిని పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించిన్నారు. వారికి డాక్టర్లు చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎం సి ఆసుపత్రికి తరలించారు. ఎస్సై లోకేష్ రెడ్డి పట్టణంలో ఉన్న సీసీటీవీ పుట్టేజులను పరిశీలిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో ఎవరనేది తేలవలసి ఉన్నది.

## ధర్మవరంలో కొత్తగా

# క్రికెట్ అకాడమీ ప్రారంభం

- ధర్మవరం క్రికెట్ అకాడమీని ఘనంగా ప్రారంభించిన హరీష్ బాబు
- గ్రామీణ ప్రతిభను వెలికి తీయడంలో అకాడమీలు కీలకం
- ధర్మవరం నుంచి జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలి - క్రీడాభివృద్ధికి అకాడమీలు అవసరం



ధర్మవరం, జనవరి 03 (మనసులో మాట).. పట్టణంలో క్రీడా రంగ అభివృద్ధికి మరో ముందడుగుగా ఏర్పాటు చేసిన ధర్మవరం క్రికెట్ అకాడమీని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు శనివారం ఘనంగా ప్రారంభించారు. ధర్మవరం క్రికెట్ అకాడమీ వ్యవస్థాపకులు నరేష్ మరియు దినేష్ ఆహ్వానం మేరకు మార్కెట్ యార్డ్ వెనుక వైపు ఏర్పాటు చేసిన ఈ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, యువ క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేయడంలో ఇలాంటి అకాడమీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగం కూడా క్రీడా రంగంలో ముందుకు రావడం యువతకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. అలాగే ధర్మవరం క్రికెట్ అకాడమీ ద్వారా స్థానిక యువతకు నాణ్యమైన శిక్షణ, ఆధునిక సౌకర్యాలు అందించడం ద్వారా రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ అకాడమీ స్థాపనకు కృషి చేసిన నరేష్, దినేష్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సయ్యద్ షబ్బుద్దీన్ మరియు భీమలింగ రెడ్డి, బీజేపీ నాయకులు పోతుకుంట రాజు, సోమ్లా నాయక్, పలువురు క్రీడా ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే



పలమనేరు డిసెంబర్ 3( మనసులో మాట): దేశంలో ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేనని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి. మునిరత్నం పేర్కొన్నారు . అందులో భాగంగా పలమనేరు పట్టణంలోని జాతీయ మానవ హక్కుల కార్యాలయం నందు మహిళా అధ్యక్షురాలు వాణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే 159వ జయంతిని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డి.వి.మునిరత్నం మాట్లాడుతూ.... 1831 వ సంవత్సరం జనవరి 3వ తేదీ మహారాష్ట్ర సతారా జిల్లా నావలే గ్రామంలో సావిత్రిబాయి పూలే జన్మించారని గుర్తు చేశారు. ఆమెకు చిన్న వయసులోనే తల్లిదండ్రులు జ్యోతిరావు పూలే తో వివాహం చేశారని పేర్కొన్నారు. అప్పటినుండి జ్యోతిరావు పూలే తన భార్యను చదువించి కోట్లాదిమంది మహిళలకు ఆదర్శంగా నిలబెట్టారన్నారు. 17 సంవత్సరాలు వయసు వచ్చేసరికి చదువులు పూర్తి చేసి కులాలు మతాలుకు అతీతంగా మహిళలకు సమానమైన విద్యను అందించారన్నారు.18 52 లో మహిళా సేవా మండలిని స్థాపించి వితంతువుల వివక్షకు అక్రమ సంతాన శిష్యుల హత్యలకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత అని కొనియాడారు. ఆమె అంతటి ఆగక అప్పట్లో మూఢనమ్మకాలు అనాగరికమైన సమాజంలో ఉన్న మహిళలకు చదువు చెప్పించాలనే తపనతో ఎన్నో ఆటుపోట్లు, నిర్బంధాలు సాంఘిక బహిష్కరణలకు గురై మహిళలకు విద్య నేర్పించిందన్నారు. సాటి మహిళలు అవమానాలు చేస్తే ఓర్పు సహనంతో చదువు నేర్పించడంలో ఏనాడు వెనుకడుగు వేయలేద న్నారు. అంతటితో ఆగకుండా దళితులకు మొదటి పాఠశాలలను 1848 మే నెల 12వ తేదీన స్థాపించి నాలుగేళ్ల కాలంలో 20 పాఠశాలలను ఏర్పాటుచేసి ఉచిత విద్యతోపాటు మధ్యాహ్న భోజనం అందించిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. సావిత్రిబాయి పూలే పాఠశాలల్లో ఆంగ్ల విద్య ప్రాముఖ్యతను సాటిచెపుతూ బ్రాహ్మణ సాంప్రదాయ కట్టుబాట్లను వ్యతిరేకించిన ఏకైక మహిళ ఆమెననికొనియాడారు.రవకుమార్ , సరస్వతి,జయరాంగౌడ్, మాట్లాడుతూ...2000 మంది అనాథ బాలలను అక్కున చేర్చుకుని ఆమె వారికి విద్యాభ్యాసం అందించి చదువుల తల్లిగా చరిత్రకెక్కారన్నారు. దేశంలో పురుషాధిపత్యం ఉన్న రోజుల్లోనే కుల -లింగ వివక్షలో లేకుండా పురుషులతో పాటు స్త్రీలు కూడా అన్ని రంగాల్లో సమానంగా ఉండాలని సామాజిక ఉద్యమం తీసుకొచ్చిందన్నారు. ఈకార్యక్రమంలోజగదీశ్వరీ,శాంతమ్మ,కుమారి,శివా మాస్టర్,మంజునాథ్, అమానుల్లా,అనమప్ప,శంకరప్ప,చాన్ బాషా పాల్గొన్నారు.

## ఇంటెన్షిప్ పేరుతో విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న

# పద్మావతి డిగ్రీ కళాశాల పై చర్యలు తీసుకోవాలి

### పి ఎస్ యు, ఏఐఎస్టి విద్యార్థి సంఘాలు ఏఐవైఎఫ్ యువజన సంఘంల నాయకులు



ధర్మవరం జనవరి 3 (మనసులో మాట).. పట్టణంలో ఉన్న పద్మావతి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఇంటెన్షిప్ ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి వేల రూపాయలు వసూల్ చేస్తుందని కళాశాల వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డిఓ కు వినతిపత్రం అందజేయడం జరిగింది సందర్భంగా ఏఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా వారు మాట్లాడుతూ పట్టణంలో పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల యాజమాన్యం వారు ఇంటెన్షిప్ ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు చేస్తున్నారు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు ఆఫ్లైన్ నుంచి అయితే 750 రూపాయలు ఆన్లైన్ ఫీజు 100 నుంచి 200 రూపాయలు మాత్రమే ఉన్నది అయితే పద్మావతి డిగ్రీ కళాశాల యాజమాన్యం వారు ఇష్టానుసారంగా ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా విద్యార్థుల నుంచి 5000 నుంచి 6000 రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు కనీసం విద్యార్థుల యొక్క భవిష్యత్తుతో ఈరోజు కళాశాల యాజమాన్యం వారు చెలగాటమాడుతున్నారు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మీరు కచ్చితంగా ఐదువేల నుంచి 6000 రూపాయలు కడితే కచ్చితంగా మీకు ప్లేస్మెంట్ కచ్చితంగా ఉంటుంది అని లేకపోతే లేదని హుకుం జారీ చేసి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు కాబట్టి తక్షణమే అక్రమంగా వసూలు చేసినటువంటి డబ్బులను విద్యార్థులు తిరిగి ఇవ్వాలి లేని పక్షాన పెద్ద ఎత్తున కళాశాల దగ్గర పెద్ద ఎత్తున బహిరంగ ఆందోళనకు దిగుతామని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పి ఎస్ యు జిల్లా అధ్యక్షులు నందకిషోర్ గుణ వరుణ్ ఏఐఎస్బి నాయకులు వేణు పోతులయ్య మోహిత్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వానికి అక్షర రూపం సావిత్రిబాయి పూలే

### - మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు



ధర్మవరం జనవరి 3 (మనసులో మాట).. సామాజిక సమానత్వానికి అక్షర రూపం సావిత్రిబాయి పూలే అని మంత్రి నియోజక వర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి వారు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సావిత్రిబాయి పూలే కేవలం భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు మాత్రమే కాదు అని,భారత సమాజాన్ని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన విద్యా విప్లవకారిణి అని తెలిపారు. మహిళలకు, దళితులకు విద్య నిషేధంగా ఉన్న కాలంలో 1848లో పుణేలో బాలికల కోసం తొలి పాఠశాల ప్రారంభించి సమాజాన్ని మార్చిన మహనీయురాలు ఆమె అని పేర్కొన్నారు. ప్రతి రోజూ పాఠశాలకి వెళ్లే దారిలో అవమానాలు, దాడులు ఎదుర్కొన్నా వెనక్కి తగ్గకుండా విద్య అనే ఆయుధంతో సామాజిక అణచివేతపై పోరాడిన గొప్ప ధైర్యం ఆమెదని తెలిపారు. ఒక్క బాలిక చదువుకుంటే ఒక తరం మారుతుందన్న భావనతో మహిళల విద్యకు పునాది వేసిన తొలి వ్యక్తి సావిత్రిబాయి పూలే అని తెలిపారు. విధవల పునర్వివాహానికి మద్దతుగా నిలబడి, బాల్యవివాహాలపై పోరాటం చేసి మహిళల హక్కుల కోసం జీవితాంతం పనిచేశారు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు

పలమనేరు డిసెంబర్ 3( మనసులో మాట): స్థానిక ఎస్విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య మాట్లాడుతూ... దేశంలో పురుషాధిక్యత ఎక్కువ గా ఉన్న రోజుల్లో ఒక స్త్రీ అనేక రకాలుగా ఇబ్బందులను ఎదుర్కొని ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన గొప్ప సంఘసంస్కర్త మానవతావాది సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని కీర్తించారు. అనంతరం జయశంకర్ మాట్లాడుతూ.... దేశంలో మొదటిసారి మహిళలకు పాఠశాలలను నిర్మించిన ఘనత సావిత్రిబాయి పూలే దంపతులకు దక్కుతుందని మహిళా సాధికారతకు అనేక రకాలుగా కృషి చేశారని తెలిపారు. అనంతరం డాక్టర్ షేక్ బెనజీర్ మాట్లాడుతూ.... నాటి రోజుల్లో మహిళలలో అనేక ఇబ్బందులు పడ్డారని నేటి ఆధునిక మహిళలకు అటువంటి ఇబ్బందులు లేవని ఆధునిక మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్, డాక్టర్ శశికళ, హేమలత, వెంకటేష్ బాబు, రుక్మిణి, రాజేష్, జయరాం, మునీశ్వరి, వెంకట సుధా, రజిని, కాట్టప్ప, మాధవి, పావని, పాల్గొన్నారు.


# యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



ధర్మవరం జనవరి 3 (మనసులో మాట).. పట్టణంలోని శాంతినగర్ మున్సిపల్ హైస్కూల్లో, సుందరయ్య నగర్ శ్రీ గణేష్ మున్సిపల్ హైస్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించుకున్నారు. శాంతినగర్ హై స్కూల్ ప్రధానోపాధ్యులు ఉమాపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ధర్మవరం మండల విద్యాధికారి రాజేశ్వరి దేవి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి , సత్యసాయి జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి రమావత్ రామకృష్ణ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ సావిత్రిబాయి పూలే గారి జీవితం ఒక స్ఫూర్తిదాయక పోరాట గాథ అని, విద్య మాత్రమే మహిళల పట్ల చూపించే వివక్షతను నిర్మూలించే సరైన ఆయుధమని నమ్మి విద్యను మహిళలకు చేరువ చేయాలని తన భర్త అయిన శ్రీ జ్యోతిరావు పూలే గారితో కలసి మొదటి బాలికల పాఠశాలలను 1848 లో పూణే లో ప్రారంభించారని కొనియాడారు. భర్తతో కలిసి సత్యశోధక్ సమాజంను స్థాపించి సమానత్వం, సత్యం, మానవ గౌరవం అనే విలువలను ప్రచారం చేశారు. అంటరానితనం మరియు కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. శాంతినగర్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న 13 మంది మహిళా ఉపాధ్యాయులను అలాగే సుందరయ్య నగర్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 9 మంది మహిళా ఉపాధ్యాయులు మొత్తం 22 మందికి శాలువాలు, పూలమాలలు, మెమంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రా రెడ్డి యుటిఎఫ్ జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి రమావత్ రామకృష్ణ నాయక్ యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వర కుమారి ,యూటీఎఫ్ మహిళా జిల్లా కార్యదర్శి నాగేంద్రమ్మ ,పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింక హరికృష్ణ, రామంజినేయులు, ధర్మవరం పట్టణ యూటీఎఫ్ నాయకులు డాక్టర్ రామకృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, బిల్లే రామాంజనేయులు, పోసా సాయి గణేష్, ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల విద్యే సమాజానికి మూలం..

## ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీంద్ర రెడ్డి



ధర్మవరం జనవరి 3 (మనసులో మాట).. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో బి ఎస్ ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలే సహకారంతో ఆధునిక భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయునిగా దేశానికి సేవలు అందించారని, చదువు మాత్రమే సమాజ పురోగతి సాకారం అవుతుందని, అందరూ చదువుకోవాలని, ఆనాడే ఆంగ్లమాధ్యమం ద్వారా ఈ సమాజంలో వెలుగు వస్తుందని వారు తెలిపారు. ముఖ్య అతిథిగా ధర్మవరం మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ చదువులు తల్లి సావిత్రిబాయి పూలే సమాజంలో అందరూ చదవాలని తన జీవితాన్ని త్యాగం చేశారని ఆమె సేవ ఎంతో గొప్పదని తెలియజేశారు. మండల విద్యాధికారి రాజేశ్వరి వివిధ పాఠశాలల్లోని మహిళా ప్రధానోపాధ్యాయులు మేరీ వర కుమారి, జ్యోతి లక్ష్మీ, పద్మావతి, శారద, జానకి, కృష్ణవేణి, మంజుల,లలితమ్మ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉమాపతి, నాగప్ప, శ్రీనివాసులు,నాగభూషణ, గోపి, అంజి నాయక్, అమానుల్లా, జగదీష్, రమేష్ బాబు,శేఖర్, ప్రకాష్, లక్ష్మీనారాయణ, మహేశ్వర్ రెడ్డి, చెన్నుడు, విజయ్ కుమార్, వినోద్ కుమార్ రామాంజనేయులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ వద్ద హైటెన్షన్..

**మంత్రిని కలుస్తామన్న రైతులు.. ఐదుగురికే పర్మిషన్ ఇచ్చిన పోలీసులు..**



**హైదరాబాద్, జనవరి 3:** అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద అదిలాబాద్ రైతులు హడావుడి చేశారు. అసెంబ్లీ లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అధిక వర్షపాతం కారణంగా సోయా బీన్ పంటకు నష్టం వాటిల్లింది. రంగు మారిందని సోయా బీన్ పంటను కొనుగోలు చేయడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా రైతులం మంత్రిని కలవడానికి వచ్చామని పేర్కొన్నారు. కేవలం ఐదుగురు రైతులను మాత్రమే అనుమతి ఇస్తామని పోలీసులు తేల్చి చెప్పారు.అయితే, 2,80,000 క్వింటాల్ కి పైగా సోయాబీన్ పంటను కొనుగోలు చేయాల్సి ఉంది.. రైతుల దగ్గర నిలువ ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 24,000 మంది రైతులు 72 ఎకరాలలో సోయా బీన్ సాగు చేశారు. 4,32,000 క్వింటాల దిగుబడి వస్తుందని అంచనా కానీ అంతకంటే ఎక్కువనే వచ్చింది. 6, 280 మంది రైతుల వద్ద 1,64,000 క్వింటల్ పంట ప్రభుత్వం కొనుగోలు చేసింది. వచ్చిన రైతులందరినీ పంపిస్తేనే లోపలికి వెళ్తామని రైతులు తెలిపారు. పోలీసులు అనుమతించకపోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

# అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేల గాఢ నిద్ర

**ఎమ్మెల్యేలు పాల్వాయి, ధన్‌పాల్, పవర్‌కునుకు**

**వైరల్‌గా మారిన వీడియోలు.. విమర్శలు**



**హైదరాబాద్, జనవరి 3:** అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తుండగా, బీజేపీ ఎమ్మెల్యేలు నిద్రపోయారు. బీజేపీ శాసనసభ్యులు నిద్రపోతున్న విజువల్స్ లైవ్ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ గుప్తా, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ స్లీపింగ్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. శనివారం కృష్ణా, గోదావరి నదీ జలాలపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఓవైపు అత్యంత కీలకమైన పీపీటీ జరుగుతుంటే.. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్ బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పవర్ రామారావు పటేల్ ముగ్గురూ గాఢ నిద్రలోకి జారుకున్నారు. అసెంబ్లీని లైవ్ చూసిన అందరూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ప్రజా సమస్యలు ప్రస్తావించాల్సిన చట్ట సభల్లో నిద్రపోవడం ఏంటని నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ సంఘటనపై చాలా మంది సామాజిక మాధ్యమాల్లో విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు కేంద్రంగా చట్టసభలో ప్రజా సమస్యలు చర్చాల్సిన సన్నివేశంలో ప్రతినిధులు నిద్రపోవడం యేదైనా సరైన ప్రవర్తనేనా అన్న ప్రశ్నలను సంధిస్తున్నారు. రాష్ట్రం అంతా లైవ్‌లో సాగునీటి ప్రాజెక్టుల ప్రెజెంటేషన్ చూస్తుంటే ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగా సభలో ఉండి నిద్రపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# కొండగట్టు పునర్జన్మనిచ్చింది



**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**జగిత్యాల, జనవరి 3:** ఏపీ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ శనివారం ఉదయం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ. 35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవ స్థానం నిధులతో భక్తుల వసతి కోసం 96గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి పవన్ కళ్యాణ్ భూమి పూజ చేశారు. పవన్ కళ్యాణ్ తోపాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 'కొండగట్టు అంజన్న అంటే నాకు సెంటిమెంట్. అంజన్న ఆశీస్సులతోనే ప్రమాదం నుంచి బయటపడ్డ కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అభివృద్ధికి నా వంతు సాయం చేస్తా' అని పవన్ అన్నారు. గతంలో దర్శనానికి వచ్చిన ప్పుడు దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. అంజన్న ఆశీస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పవన్ అన్నారు. గిరి ప్రదక్షిణ అంశాన్ని నా దృష్టికి తెచ్చారు. కొండగట్టు గిరి ప్రదక్షిణకు సహాయం చేస్తామని పవన్ చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పవన్ కళ్యాణ్ కృతజతలు తెలిపారు. రేవంత్ రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని, ఆంజన్న ఆశీస్సులు ఆయనకు ఉండాలని పవన్ పేర్కొన్నారు.

# మావోయిస్టుల కీలక నేతలు సరెండర్

**హైదరాబాద్, జనవరి 3:** మావోయిస్టుల లొంగుబాటు కొనసాగింది. మరికొందరు అగ్రనేతలు లొంగుబాటు పట్టారు. అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది సభ్యులు భారీగా ఆయుధాలు, నగదు అప్పగించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నిన్ననే లొంగిపోగా.. ఆ వివరాలను డీజీపీ శనివారం మీడియాకు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా ఆర్మీ చీఫ్‌గా దేవా పని చేస్తున్నారు. లొంగిపోయిన వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ లొంగుబాటు పీఎల్‌జీఏకు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు చెప్పారు. దేవా.. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడు. ఎన్ఐఏ నుంచి దేవాపై రూ.75లక్షల రివార్డు ఉంది. ఆవులం సోమా, భేమే, సుశీల, వేముల రాజు, నందయ్యా, మంకు, అండా, తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యురాలు అడ్లూరి ఈశ్వరి లొంగిపోయినవారిలో ఉన్నారు. 2 పెణ, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధంతో వచ్చారు. ఇజ్రాయెల్ దేశంలో తయారు చేసిన టవర్ ఆయధం కూడా ఉంది. ఎనిమిది ఏకే 47 గన్స్ స్వాదీనం చేసుకున్నాం. 8, నాలుగు బ్యారెల్ గ్రానైడ్ లాంచర్స్ ఆయుధాలను సమర్పించారు. హెలికాప్టర్‌ను సైతం




కూల్చే భారీ ఆయుధం సైతం తీసుకు వచ్చారు. పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 66 మంది మాత్రమే మిగిలారు. పీఎల్‌జీఏ పూర్తిగా క్షీణించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కిష్టంపేట్‌కు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా రాష్ట్రానికి చెందిన ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో ఉన్నారు. రూ.1.80 కోట్ల రివార్డు లొంగిపోయిన మావోయిస్టులకు అందిస్తాం. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఇస్తాం. ఇప్పటి వరకు తెలంగాణలో 576 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ సమాచారం ప్రకారం ప్రస్తుతం తెలంగాణ నుంచి 17 మంది సభ్యులు మిగిలి ఉన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని కోరుతున్నాం అని డీజీపీ తెలిపారు.

# వాడీవేడిగా..

## మూడోరోజు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

**సమస్యలపై బీజేపీ ఎమ్మెల్యే ప్రస్తావన ■ చనాక కోరాట నిర్వాసిత సమస్యలపై పాయల శంకర్ వెల్లడి**



**హైదరాబాద్, జనవరి 3:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు శనివారం ప్రారంభం అయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టులు, నిర్వాసిత రైతులకు పరిహారం, సాగునీటి సౌకర్యాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు బీజేపీ ఎమ్మెల్యేలు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతుల సమస్యలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సభలో లేవనెత్తారు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు లక్షల రూపాయలే పరిహారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. పదేళ్లు అయ్యిందన్నారు. నీళ్లు రాలేదని.. పరిహారం రాలేదని ఆదిలాబాద్ రైతులు పాదయాత్రగా హైదరాబాద్‌కు వచ్చారని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి వెంటనే భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. జైనాథ్‌పూర్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని... ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రిని కలిసినా ఫైళ్లు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు మండలాల్లో సాగునీరు అందుతుందన్నారు. రైతులకు భారీ లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ డిమాండ్ చేశారు. అలాగే ప్రిప్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు రూ. 2,000 కోట్లు కేటాయించాలని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. రెండు వేల కోట్లు విడుదల చేస్తేనే నిజాంసాగర్ కాలువల ఆధునీకరణ సాధ్యమవుతుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, స్వరాష్ట్రంలోనూ నిజామాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా నీటిపారుదల శాఖ మంత్రి నవ్వుతూనే ఉన్నారని, కానీ సమస్యలపై స్పష్టమైన చర్యలు లేవని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆరోపించారు.

# పేదలకు అండగా నిలవడమే సర్కార్ లక్ష్యం

**అర్హులందరికీ గృహ జ్యోతి పథకం వర్తింపు**

**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి**



**హైదరాబాద్, జనవరి 3:** పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ గృహ జ్యోతి వర్తిస్తుందన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలోని వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. ప్రధానంగా గృహ జ్యోతి పథకం, ఇంద్రమ్మ ఇళ్లు, వ్యవసాయ పథకాలు, సోయా కొనుగోలు వంటి ముఖ్య సమస్యలపై చర్చలు జరిగాయి. ముందుగా గృహ జ్యోతిపై ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగరాజు పలు ప్రశ్నలు సంధించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకం కొనసాగింపుపై సభలో డిప్యూటీ సీఎం స్పష్టతనిచ్చారు. కొత్త దరఖాస్తులు, మార్పులు ? చేర్పులకు ప్రజా పాలన కార్యాలయాల్లో అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 52.82 లక్షల కుటుంబాలకు గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ లబ్ది చేకూరుతోందని తెలిపారు. గృహ జ్యోతి కోసం ఇప్పటి వరకు రూ. 3,593 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లింపులు చేసిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వ్యవసాయం రంగంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానిమిస్తూ.. వ్యవసాయ రంగంలో ఆగిన పథకాలను పునరుద్దరణ చేపడుతున్నామని చెప్పారు. సోయాను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా, కేంద్రం కొనడం లేదని అన్నారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి సూచించారు.

**అందెశ్రీ కొడుకుకు ప్రభుత్వం ఉద్యోగం**

ప్రముఖ కవి అందెశ్రీ కుటుంబానికి అండగా నిలవాలని భావించింది. ఇందులో భాగంగా అందెశ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడానికి వీలుగా 1994 ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, వేతన నిర్మాణ చట్ట సవరణ బిల్లును రాష్ట్ర శాసన సభలో శనివారం బిల్లు ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కఈ బిల్లును ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సభలో మాట్లాడారు. అందె శ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందుకోసం చట్టపరమైన మద్దతు అవసరమని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో 1994పబ్లిక్ సర్వీస్ కమిషన్ చట్టంలోని నిబంధనలు సవరించాల్సి ఉందని తెలిపారు. అందె శ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడం కోసం చేసిన సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టామని వెల్లడించారు. అందులో కొందరు ఉద్యోగులు కోర్టుకు వెళ్లి గతం నుంచి రెగ్యులరైజ్ చేయాలని ఆర్డర్ తెచ్చారని ప్రస్తావించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**గత పదేళ్లలో ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం**

**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి**

**హైదరాబాద్, జనవరి 3:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చెల్లించిన బిల్లులలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో విమర్శలు చేశారు. తమ నియోజకవర్గాల్లో బిల్లులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని, టెక్నికల్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఇండ్లతో పాటు అదనపు ఇండ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరారు.రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేసిందని.. తమ ప్రభుత్వంలో భేషజాలకు వెళ్లకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించామని.. ఆగిపోయిన ఇళ్లకు నిధులిచ్చి పూర్తీ చేస్తున్నామని అన్నారు మంత్రి పొంగులేటి.గత పాలకులు పదేళ్లు కమిషన్ల కోసమే పనిచేశారని.. పదేళ్లలో ఇళ్ళు పూర్తీ చేసి ఉంటే పేదలకు ఇబ్బంది ఉండేది కాదని అన్నారు పొంగులేటి.పదేళ్లు కమిషన్లు తీసుకొని అరకొర ఇళ్ళు ఇచ్చారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక చెంచులందరికీ మొదటి విడతలోనే ఇళ్ళు మంజూరు చేశామని అన్నారు పొంగులేటి. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ఇందిరమ్మ ఇండ్లే కనిపిస్తున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలు గుర్తిస్తున్నామని అన్నారు.పేదల ఆత్మగౌరవానికి సంబంధించిన ఇండ్ల



నిర్మాణంలో రాజీపడం అని.. అర్హులందరికీ తప్పకుండా ఇండ్లు ఇస్తామని అన్నారు పొంగులేటి.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# బీఆర్ఎస్ హయాంలో ఏపీ కృష్ణాజలాల జలదోపిడీ



- శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా తరలింపు
- రోజుకు 13 టిఎంసిల నీరు తరలించుకుపోయిన ఏపీ
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోని బిఆర్ఎస్
- చోద్యం చూస్తూ కూర్చున్న నాటి సీఎం కెసిఆర్
- కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జనవరి 3:** బీఆర్ఎస్ హయాంలోనే ఏపీ నీటి దోపిడీ జరిగిందని, అందుకు నాటి సిఎం కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రానికి ఫిర్యాదు చేశాం. పనులు నిలిపివేయించాం. 2024-25 సీజన్‌లో కృష్ణా జలాల్లో ఎక్కువ నీటిని వాడుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉంది. మేం వచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించాం. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని ఉత్తమ్ తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు.. పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే.. మళ్లీ ఆఫ్ చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి.. పాలమూరును నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేది. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లం. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయింది. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారు. ప్రాణహిత - చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేది. 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లం. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగింది. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చిందని ఉత్తమ్ వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు. పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉనన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు.

# పాలమూరుపై ఇరు పార్టీల దొంగాట

### కేసీఆర్, రేవంత్ తీరులపై మండిపడ్డ అరుణ



**హైదరాబాద్, జనవరి 3:** పాలమూరు జిల్లాను కేసీఆర్, రేవంత్ రెడ్డి రాజకీయాల కోసం వాడుకుంటున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ విమర్శించింది. పాలమూరు ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి ఇద్దరికీ లేదు.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లతో ఒకరిపై ఒకరు నేపం నెట్టుకునే ప్రయత్నం తప్ప ఏం లేదు.. కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ఇద్దరు పాలమూరు ప్రజలకు నష్టం చేసిన వారేనని మండిపడింది. జూరాల నుంచి నీళ్లు తీసుకోవాలని అనేక సార్లు చెప్పడం జరిగింది.. పాలమూరు రైతులతో ఆట ఆడుతున్నారని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ఇక, మాయ మాటలతో, మోసం చేసి.. మరోసారి అధికారంలోకి రావాలని కేసీఆర్ నాటకాలు ఆడుతున్నారని డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేసారు. తప్పులను వాళ్ళపై నెట్టి తప్పించుకోవాలని కాంగ్రెస్ నాటకం ఆడుతుంది. ఇద్దరు ఆడుతున్న నాటకంలో పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.. పాలమూరు ప్రజలను పదేళ్లు కేసీఆర్ మోసం చేశారనే.. ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారు.. జూరాల అప్రోచ్ అయితేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పుకొచ్చింది. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడానికి ఒక అడుగు కూడా ముందుకు పడటం లేదు.. డిండి ప్రాజెక్టుకి నీళ్ళు తీసుకెళ్లడంతో పాలమూరు ప్రజలకు అన్యాయం జరుగుతుందని బీజేపీ ఎంపీ అరుణ తెలిపింది. అయితే, పోటీలు పడి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు.. దాని ఔట్ కమ్ ఏంటి? అని డీకే అరుణ ప్రశ్నించింది. డిండి ప్రాజెక్టుకి నీళ్ళు తీసుకెళ్ళడాన్ని గతంలో పార్టీలకు అతీతంగా వ్యతిరేకించడం జరిగింది.. జూరాల నీళ్లు తీసుకుని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ ఆఖఫీ టెకాప్ చేయండి అని సూచించింది. ఇంతకు ముందు చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కల్వకుర్తిలో కలపండి లేదా నాగర్ కర్నూల్, నల్గొండ అని దాని పేరు పెట్టండి అని కోరింది. అందులో పాలమూరు- రంగారెడ్డి రెండు లేవు.. పాలమూరు ప్రాంత ఎమ్మెల్యేలు ఎందుకు నోర్లకు ఎ÷-లాస్టర్ వేసుకున్నారని అడిగింది. డిండికి నీళ్ళు తీసుకెళ్తుంటే నోర్లు మూసుకొని, చోద్యం చూస్తున్నారంటూ మండిపడింది. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ పై ఎందుకు రివ్యూలు పెట్టడం లేదని డీకే అరుణ ప్రశ్నించారు. అలాగే, రివ్యూలకు నన్ను ఆహ్వానించడం లేదు.. కలిసి నిర్ణయం తీసుకుంటే ఏం ఇబ్బంది వచ్చిందని? ఎంపీ అరుణ అడిగింది. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పైనా ఇరిగేషన్ నిపుణులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో రివ్యూ పెట్టండి అని సూచించింది. వచ్చే మూడేళ్లలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేలా సీఎం చొరవ తీసుకోవాలని కోరింది.

# కూనంనేనివి దివాళాకోరు రాజకీయం

### మోడీపై వ్యక్తిగత విమర్శలపై మండిపాటు

### ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, జనవరి 3:** మోదీపై ఎమ్మెల్యే కూనంనేని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెట్టాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని చెప్పుకొచ్చారు. అంతేకానీ ప్రధానమంత్రిపై వ్యక్తిగత ధూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు కష్టపడుతూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని దార్శనిక నాయకుడు మోదీ పెంచుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రజాప్రతినిధి అయిన కూనంనేని.. అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు కిషన్‌రెడ్డి. ప్రజలు అన్నింటినీ గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో వారికి ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని తెలిపారు. మోదీపై వ్యాఖ్యలకు గానూ కూనంనేని సాంబశివరావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంపై వెంటనే జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

# స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

### సవరణ బిల్లును ఆమోదించిన అసెంబ్లీ

### బిల్లుల ఆవశ్యకతను వివరించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 3 :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్‌ను సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ శనివారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా, గత కొన్ని దశాబ్దాలుగా అమలులో ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన'ను ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. అంటే, ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్న వ్యక్తులు కూడా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేయడానికి చట్టపరంగా అర్హత సాధించారు. ఈ బిల్లును మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెడుతూ, మారుతున్న కాలానికి , రాష్ట్ర అభివృద్ధి పరిణామాలకు అనుగుణంగా జనాభా పెరుగుదల రేటును సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలోనే ఈ నిబంధన తొలగింపును రాజకీయ పక్షాలతో పాటు సాధారణ ప్రజలు కూడా స్వాగతించారని ఆమె గుర్తు చేశారు. గతంలో ఈ నిబంధనపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయగా, ఇప్పుడు దానికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేశారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ స్థాయి రాజకీయాల్లో నాయకత్వం వహించాలని ఆశపడే ఎంతో మంది అభ్యర్థులకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయినట్లయింది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆనాడు విపక్షంలో అన్నదేమీ..
# ఇప్పుడు చేస్తున్నదేమిటి

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరు కామనలేదా

### నాటి ఉత్తమ్ లేఖను బయటపెట్టిన హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 3:** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉ న్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోమని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు. అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే
# ఎక్కడి పనులు అక్కడే

### అయినా పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి

### జాగృతి ప్రజాబాటలో కవిత విమర్శలు



**సూర్యాపేట, జనవరి 3:** తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని.. అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆరోపణలు చేశారు. ఇవాళ(శనివారం) సూర్యాపేట జిల్లాలో జనం బాటలో భాగంగా కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా అభివృద్ధిలో ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై తాను దృష్టి పెట్టానని చెప్పుకొచ్చారు. అర్వపల్లి మండలంలోని కేజీబీవీ స్కూల్‌ను పరిశీలించానని తెలిపారు. గత ఏడాదిలో తుపాను వచ్చి ఈ స్కూల్ మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని.. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు కవిత. రాష్ట్రంలో పంట కాల్వల మెయింటెనెన్స్ సరిగా లేదని అన్నారు. కాల్వల్లో కంప చెట్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. నీళ్లు రాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోరా అని ÷ర్ అయ్యారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగానికి కనీసం నిధులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. కోదాడ వరకు నీళ్లు ఇచ్చే డిస్ట్రిబ్యూటరీ కాల్వ 70 కిలోమీటర్లు ఉంటుందని... ఈ కాల్వను సరిగా మెయింటెనెన్స్ ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. రుద్రమదేవి చెరువు పరిశీలించానని....700 ఎకరాల్లోని ఈ చెరువుకు గోదావరి నీళ్లు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్- 2లో భాగంగా నల్గొండ జిల్లాలో రిజర్వాయర్లు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరిగేలా రిజర్వాయర్లు కట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలని కవిత కోరారు.

# బీసీ కులాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : పొన్నం



**హైదరాబాద్, జనవరి 3 :** కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాల అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వివిధ వెనుకబడిన కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని, భూములు కూడా కేటాయించామని మండలిలో ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. గత ప్రభుత్వం కుల సంఘాలకు చేసిందేమీ లేదన్నారు. తమ సర్కారు సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని.. అధికార, రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. త్వరలో అన్ని కార్పొరేషన్లను బలోపేతం చేస్తామని తెలిపారు. వెనుకబడినవర్గాల నైపుణ్యాభివృద్ధి పథకం తీసుకొస్తామని వెల్లడించారు. శాసనమండలిలో శుక్రవారం సభ్యులు వివిధ సమస్యలపై గళమెత్తారు. తొలుత ప్రశ్నోత్తరాల సమయం, అనంతరం ప్రత్యేక ప్రస్తావనలు.. ఆ తర్వాత వినతులు ఇచ్చేందుకు కూడా మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ ఏడాది బ్జడెట్లో బీసీ కార్పొరేషన్ భవనాలకు నిధులు కేటాయించాలని భారాస మండలిపక్ష నేత మధుసూదనాచారి కోరారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

- వనపర్తి జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ
- ఉమ్మడి పాలమూరు చరిత్రతోనూ క్యాలెండర్ తేవాలి: వక్తలు
- అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షులు డాక్టర్ సతీష్ యాదవ్‌కు సన్మానం



**శేరిలింగంపల్లి, జనవరి 03 (మనసులో మాట):**

భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఉమ్మడి పాలమూరు అఖిలపక్ష ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మియాపూర్‌లోని ఎస్ఎమ్ఆర్ వినయ్ హైలాండ్ క్లబ్ హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో.. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### వనపర్తి జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ

ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు ఐక్య వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన 'వనపర్తి జిల్లా ముఖచిత్ర క్యాలెండర్'ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వనపర్తి జిల్లా క్యాలెండర్‌ను అద్భుతమైన రీతిలో ముద్రిస్తున్న వేదిక అధ్యక్షులు డాక్టర్ సతీష్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉమ్మడి పాలమూరు జిల్లా చరిత్రను తెలిపేలా మరో క్యాలెండర్ తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం డాక్టర్ సతీష్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, నర్సిరెడ్డి, వంగూర్ సందీప్ రెడ్డి, పానగంటి కురుమయ్య, మాధవరం గోపాల్ రావు, కోటయ్య, టీ. అనిల్, కుమార్, ఇస్లావత్ దశరథ్ నాయక్, విశ్వనాథం, రిటైర్డ్ ఎమ్మార్వో భాస్కర్ రెడ్డి, జగత్‌పల్లి రమేష్ యాదవ్, చంద్రయ్య, నాగేంద్రం, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న టీచర్ జ్యోతి

## ఇళ్లు కాలిన బాధితులకు ఆర్థిక సహాయం - సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో సేవా కార్యక్రమం



**గజ్వేల్, జనవరి 3 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి ఇళ్లు కాలిపోయిన నిరుపేద కుటుంబానికి ఓ ఉపాధ్యాయురాలు అండగా నిలిచారు. బాధితుడైన దేశమైన మల్లయ్య కుటుంబానికి శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలలో భాగంగా టీచర్ జ్యోతి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా టీచర్ జ్యోతి మాట్లాడుతూ... మానవసేవే మాధవసేవ అని, తన వంతు చిరు సహాయంగా ఆ కుటుంబానికి బాసటగా నిలిచానని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. టీచర్ వృత్తిలో ఉంటూ సాటి మనిషి కష్టానికి స్పందించిన జ్యోతిని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామచంద్రం, సర్పంచ్ ర్యాకం యాదగిరి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చదువుతోనే మహిళా సాధికారత

## సావిత్రిబాయి పూలే త్యాగం మరువలేనిది

### గజ్వేల్‌లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

### నివాళులర్పించిన ప్రజా సంఘాల నాయకులు



**గజ్వేల్, జనవరి 3 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశంలో అంటరానితనం, కుల వివక్ష రాజ్యమేలుతున్న రోజుల్లో, ఊరికి దూరంగా నెట్టివేయబడిన బహుజన మహిళలకు చదువు అనేది అందని ద్రాక్షగా ఉండేదని గుర్తుచేశారు.

### జ్యోతిరావు పూలే స్ఫూర్తితో..

సమాజ మార్పునకు చదువే ఏకైక పరిష్కారమని నమ్మిన మహాత్మా జ్యోతిరావు పూలే, తొలుత తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పించారని, ఆ తర్వాత ఆమె ద్వారా బహుజన మహిళలందరికీ విద్యను అందించారని కొనియాడారు. మహిళలకు మొట్టమొదటగా చదువు నేర్పిన ఘనత సావిత్రిబాయి పూలేకే దక్కుతుందన్నారు. ఆమె చూపిన బాటలోనే నడిచి నేడు ఎంతోమంది మహిళలు చదువుకుని సమాజంలో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఆమె త్యాగం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అటుకూరి రాములు, మాన్నే కృష్ణ, పంబలా సత్యనారాయణ, మైస స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొన్నాల కుమార్, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మ శ్రీనివాస్, అంసా ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు బండారు దేవేందర్, మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నిరుడు స్వామి, అభినవ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బైరం శివకుమార్, ఎస్.ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ఉమర్ సుల్తాన్ బేగం, ఫీల్డ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎలేశ్వరం మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మైస స్వామి, పెర్క శ్యామ్ సుందర్, ఆరోగ్యులు, రామచంద్రం, లక్ష్మీ, జ్యోతి, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా అభ్యున్నతికి ఆద్యురాలు సావిత్రిబాయి పూలే

### త్రివేణి పాఠశాలలో ఘనంగా జయంతి వేడుకలు

### నివాళులర్పించిన డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి

### 50కి పైగా పాఠశాలలు స్థాపించిన మహనీయురాలు: డైరెక్టర్

**(మనసులో మాట - ఖమ్మం ప్రతినిధి)**

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి.. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### సంస్కర్తగా, కవయిత్రిగా ఆమె సేవలు అమోఘం

వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే కేవలం ఒక ఉపాధ్యాయురాలే కాదు, గొప్ప కవయిత్రి, మహిళా హక్కుల పోరాట యోధురాలని కొనియాడారు. తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ రోజుల్లోనే అంటరానితనం, బాల్య వివాహాలు, వితంతువుల పట్ల వివక్ష వంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆమె అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. విద్య ద్వారానే మహిళలు, దళితుల్లో చైతన్యం వస్తుందని నమ్మి, సుమారు 50కి పైగా పాఠశాలలను స్థాపించిన మహనీయురాలని పేర్కొన్నారు. ఆమె రచించిన 'కావ్య పూలే', 'బవన్ కాశి సుబోధ్ రత్నాకర్' వంటి కవితా సంపుటాలు నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల సీఆర్ఓ (జ=హ) మురళీకృష్ణ, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ గణతంత్ర వేడుకలకు నంచర్ల సహకార సంఘం సీఈవోకు ఆహ్వానం

### 2026 వేడుకలకు కుటుంబ సమేతంగా హాజరుకావాలని పిలుపు

### రైతు సేవల్లో ఉత్తమ ప్రతిభకు దక్కిన గుర్తింపు



**గొల్లపెల్లి, జనవరి 03 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో రౌతు మధుకర్ కు అరుదైన గౌరవం దక్కింది. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా, జనవరి 2026లో ఢిల్లీలో జరగబోయే జాతీయ గణతంత్ర వేడుకలకు భార్య, పిల్లలతో సహా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకావాలని కేంద్రం నుంచి ఆహ్వానం అందింది. సంఘం పరిధిలో కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వహణ, ఎరువుల సరఫరా, ఔషధ కేంద్రాల స్థాపన, గిడ్డంగుల నిర్మాణం, రైతులకు భద్రత కల్పించడం వంటి అంశాలలో సీఈవో రౌతు మధుకర్ చేసిన కృషిని ప్రశంసిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మాజీ అధ్యక్షుడు మంత్రి వేణుగోపాల్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది మధుకర్ కు అభినందనలు తెలియజేశారు.

# ఉత్తమ సేవా పతక గ్రహీత, ఏఎస్ఐ పోచగౌడ్ కు ఘన సన్మానం

### విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచినందుకు గుర్తింపు

### అభినందించిన గౌరారం కాంగ్రెస్ నాయకులు



**గజ్వేల్, జనవరి 3 (మనసులో మాట):**

వర్గల్ మండలం గౌరారం పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ, విధి నిర్వహణలో చక్కటి ప్రతిభ కనబరిచిన పోచగౌడ్ ను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పోలీసు శాఖలో ఆయన అందిస్తున్న సేవలకు గాను తెలంగాణ పోలీసు విభాగం తరపున ప్రతిష్టాత్మక 'ఉత్తమ సేవా పతకం' వరించింది. ఈ అవార్డును ఆయన ఇటీవల రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి సి.వి. ఆనంద్ చేతుల మీదుగా అందుకున్నారు. కాంగ్రెస్ నేత తాళ్ళ భాను గౌడ్ ఆధ్వర్యంలో సత్కారం ఏఎస్ఐగా ఎంపికైన సందర్భంగా శనివారం గౌరారం కాంగ్రెస్ నాయకుడు తాళ్ళ భాను గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పోచగౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ గౌడ్, బోర్క నర్సింలు, నర్సింలు గౌడ్, ప్రవీణ్, మల్లేష్, నాగేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఆవుల గోపాల్ రెడ్డి

### జంగరాయి సర్పంచ్ కు దక్కిన పదవి.. ఏకగ్రీవంగా ఎన్నిక

### సర్పంచుల హక్కుల కోసం పోరాడుతా..

### సహకరించిన ఎమ్మెల్యే రోహిత్ రావు, ఇతర నేతలకు కృతజ్ఞతలు

### సోమవారం మెదక్ లో ప్రమాణస్వీకారం



**చిన్నశంకరంపేట, జనవరి 03 (మనసులో మాట):**

మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామ సర్పంచ్ ఆవుల గోపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హక్కుల సాధనే లక్ష్యం.. జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధన కోసం ఫోరం వేదికగా పోరాడుతానని గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేక కృషి చేస్తున్నారని, ఆయన సహకారంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. సోమవారం ప్రమాణస్వీకారం తన ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా జరగనుందని గోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని సర్పంచులు, నాయకులు గోపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# స్టీల్ ఫ్యాక్టరీలో చోరీ కేసు ఛేదన.. యూపీలో నిందితుడి అరెస్ట్

## 13 లక్షల చోరీ కేసులో పురోగతి.. రూ. 9.50 లక్షల నగదు స్వాధీనం

### రూ. 1.50 లక్షల విలువైన ఐఫోన్ సీజ్ - చాకచక్యంగా పట్టుకున్న గజ్వేల్ పోలీసులు

**గజ్వేల్, జనవరి 3 (మనసులో మాట):**

గజ్వేల్ నియోజకవర్గం ప్రజ్ఞాపూర్ శివారులోని స్టీల్ ఫ్యాక్టరీలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. నిందితుడిని సుదూర ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం గజ్వేల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ శివారులో ఉన్న ఓ స్టీల్ ఫ్యాక్టరీ ఆఫీసులో గత నెల (డిసెంబర్) 22వ తేదీ రాత్రి దొంగతనం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆఫీసు తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, డ్రా (ఐతీఘవతీ) తాళాలు విరగ్గొట్టి అందులో ఉన్న రూ. 13 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడు సుశీల్ కుమార్ అగర్వాల్ గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గజ్వేల్ ఏసీపీ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎస్.హెచ్.ఓ వి. రవికుమార్, ఇన్‌స్పెక్టర్ చెట్టుకింద ముత్యం రాజు ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతం చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడిని రాహుల్ కుమార్ (తండ్రి లక్కీ చంద్రప్రసాద్) గా గుర్తించారు. నిందితుడి నుంచి రూ. 9,50,000 నగదుతో పాటు, చోరీ డబ్బుతో కొనుగోలు చేసిన రూ. 1,50,000 విలువైన ఐఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని శనివారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.



# పాఠశాల సమస్యలపై ఆరా తీసిన సర్పంచ్

**తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పరిశీలన**

**విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలి: శ్రీనివాస్**



**దుబ్బాక (మనసులో మాట):** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని దుబ్బాక మండలం తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సరైన సమయానికి అందుతుందా లేదా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, ప్రభుత్వం అందించే సౌకర్యాల అమలును పరిశీలించారు. విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తేవాలని సూచించారు.

# తిగుల్ నూతన పాలకవర్గాన్ని అభినందించిన హరీష్ రావు

**కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి.. కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలి**

**మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ రజిత, సభ్యులు**



**జగదేవపూర్, జనవరి 03 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ (దీ=ూ) సర్పంచ్ అభ్యర్థి కుడిదుల రజిత భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా శనివారం నూతన పాలకవర్గం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసింది. తిగుల్ లో బీఆర్ఎస్ విజయం పట్ల హరీష్ రావు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిలతో పాటు వార్డు సభ్యులు మల్లేశం, అశ్విని, నీరజ, రాధ, పద్మ, అశోక్, లక్ష్మి, శ్రీరామ్ రెడ్డి, ఆంజనేయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పాలకవర్గ సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్ రజిత, ఇతర సభ్యులు మాజీ మంత్రి హరీష్ రావుకు పూల మొక్కను అందించి, శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. తిగుల్ గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి రజితను భారీ మెజార్టీతో గెలిపించుకోవడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ కార్యకర్తలు ఇలాగే సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ.. ఆ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ (గ్రూాజూ) మాజీ డైరెక్టర్ భూమయ్య, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ కోటయ్య, మాజీ ఉపసర్పంచ్ కిష్టయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మధుసూదనా చారి, వెంకట్ గౌడ్, అశోక్, నరసింహారెడ్డి, లచ్చిరెడ్డి, ఈశ్వర్, ఐలయ్య, అశోక్ నాగరాజు, కరుణాకర్, నరసింహులు, అయ్యాలం, రమేష్, భూమయ్య, గిరిధర్ రావు, సత్తయ్య, మహేష్, నిఖిల్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, వెంకట్, నాగరాజ్, పరశురాం, జోసెఫ్, మాజీ వార్డు సభ్యులు బాలమణి, పరమేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన యువనేత సంతోష్ రెడ్డి

**హైదరాబాద్‌లో మర్యాదపూర్వక భేటీ**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు**



**జగదేవపూర్, జనవరి 03 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లాకు చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు ఆలేటి సంతోష్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ఆత్మీయ నాయకుడైన హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగిందని పేర్కొన్నారు.

# సైబరాబాద్ పరిధిలో 'ఆపరేషన్ స్మైల్ -12' షురూ

- బాలల రక్షణ కోసం 12 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- 'దర్పణ్' యాప్ ద్వారా చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చుతాం
- విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం




**శేరిలింగంపల్లి, జనవరి 03 (మనసులో మాట):**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తప్పిపోయిన, వెట్టిచాకిరీలో మగ్గుతున్న చిన్నారుల విముక్తి కోసం పోలీసులు మరోసారి నడుం బిగించారు. ఇందులో భాగంగా శనివారం కమిషనరేట్ లో 'ఆపరేషన్ స్మైల్ -



12 పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జనవరి 30 వరకు స్పెషల్ డ్రైవ్ ఈ సందర్భంగా విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం మాట్లాడుతూ.. జనవరి 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో తప్పిపోయిన చిన్నారులను గుర్తించడం, భిక్షాటన, చెత్త సేకరణ, బాల కార్మికులుగా మారిన వారిని, అక్రమ రవాణా, వెట్టి చాకిరీలో చిక్కుకున్న పిల్లలను రక్షించడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. రక్షించిన చిన్నారులకు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో తగిన పునరావాసం కల్పిస్తామన్నారు. 12 ప్రత్యేక బృందాలు - దర్పణ్ యాప్ వినియోగం ఈ ఆపరేషన్ ను సమర్థవంతంగా నిర్వహించేందుకు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని డీసీపీ వెల్లడించారు. ప్రతి బృందంలో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్, ఒక మహిళా కానిస్టేబుల్ తో సహా నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు ఉంటారని వివరించారు. అలాగే, వీధి బాలలను, తప్పిపోయిన వారిని గుర్తించి, వారిని తిరిగి తల్లిదండ్రులతో కలిపేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ అయిన "దర్పణ్ యాప్ 'ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పాల్గొన్న అధికారులు ఈ సమీక్షా సమావేశంలో విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణంతో పాటు ఏసీపీ ఎస్. కృష్ణ ప్రసాద్, రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ కె. నరేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ రాజా రెడ్డి, రంగారెడ్డి జిల్లా బాల రక్ష భవన్ సహ సమన్వయకర్త తిరుమలాదేవి, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ రాష్ట్ర సమన్వయకర్త వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా సహాయ కార్మిక కమీషనర్ సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా సహాయ కార్మిక కమీషనర్ లక్ష్మీపతి, రంగారెడ్డి జిల్లా ఆరోగ్య అధికారి అంబిక, రంగారెడ్డి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, సంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కె. విష్ణుమూర్తి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ పి. యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం తర్వాత..**

# ముందు మాకు రోడ్డు వేయండి!

- రోడ్డెక్కిన అపర్ణ హిల్ పార్క్, సిలికాన్, గార్డెనియాల నివాసితులు
- కుటుంబాలతో కలిసి భారీ ర్యాలీ.. మియాపూర్ సర్కిల్ ఆఫీస్ ఎదుట నిరసన
- హైటెక్ నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిపై కన్నెర్ర
- సమస్య పరిష్కరించాలంటూ ఉప కమిషనర్‌కు వినతి




**చందానగర్, జనవరి 03 (మనసులో మాట):**

హైటెక్ నియోజకవర్గంగా పేరుగాంచిన శేరిలింగంపల్లిలో మౌలిక వసతుల లేమిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఫ్యూచర్ సిటీ నిర్మాణం తర్వాత చేసుకోవచ్చు.. ముందు మాకు రోడ్డు వేయండి" అంటూ వేలాది మంది కాలనీవాసులు రోడ్డెక్కడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. శనివారం చందానగర్ పరిధిలోని అపర్ణ హిల్ పార్క్, అపర్ణ సిలికాన్, అపర్ణ గార్డెనియాల నివాసితులు తమకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తారు. అసలేం జరిగింది? అపర్ణ హిల్ పార్క్, సిలికాన్, గార్డెనియాల నివాసితులు తమ ఇళ్లకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక నరకం అనుభవిస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో వారు విసిగిపోయారు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో లాభం లేదని భావించిన నివాసితులంతా ఏకమై ఉద్యమ బాట పట్టారు. కుటుంబ సమేతంగా కదంతొక్కారు.. తమ బాధలు అధికారులకు అర్థం కావాలనే ఉద్దేశంతో శనివారం ఉదయం వేలాది మంది నివాసితులు కుటుంబ సమేతంగా రోడ్డెక్కారు. అపర్ణ హిల్ పార్క్ నుంచి మియాపూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేబూని, తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం సర్కిల్ కార్యాలయం ఎదుట అరగంట పాటు నిరసన తెలిపి, సర్కిల్ ఉప కమిషనర్ (డీసీ)కి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

**ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

**మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్**

**చిన్నశంకరంపేట, జనవరి 3 (మనసులో మాట):**



ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది కేవలం పోలీసుల పని మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ కచ్చితంగా ధరించాలని హితవు పలికారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని గట్టిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నారాయణ గౌడ్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

**- పోషకాహారంపై తల్లులకు అవగాహన.. బాలామృతం, గుడ్ల పంపిణీ**

**గొల్లపెల్లి, జనవరి 03 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గోవిందుపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-1లో శనివారం అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అన్నప్రాసన చేసి, బాలామృతం, కోడిగుడ్లను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో.. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య సూత్రాలు, ఆకుకూరల ఆవశ్యకత, బలమైన పోషక విలువల గురించి తల్లులకు వివరించారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందుపల్లె గ్రామ సర్పంచ్ స్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంజీవ్, హెల్త్ సూపర్ వైజర్, ఏఎన్ఎం రజిత, అంగన్వాడీ టీచర్లు బద్దం సరోజ, రేవెల్ల పద్మ, పిల్లలు, వారి తల్లులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గిరిపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం

**గజ్వేల్, జనవరి 3 (మనసులో మాట):** గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో గిరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని శనివారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహాం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిపల్లి సర్పంచ్ పోసాని లావణ్య, ఉపసర్పంచ్ కొత్తపేట బిక్షపతి, గ్రామ కార్యదర్శి అజరుద్దీన్ మహమ్మద్, ధర్మారెడ్డిపల్లి సర్పంచ్ కసమల్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ బెల్దే ముత్యాల గౌడ్, కార్యదర్శి బి. పరమేశ్వర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రిన్సిపాల్ అనిత అబ్రహాం మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్ శిబిరాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజంపై అవగాహన పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.



# ఆటో కార్మికుల అక్రమ అరెస్టులు దారుణం

- హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టులా?
- చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 10 లక్షలు ఇవ్వాలి
- బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్ డిమాండ్




**మనసులో మాట - సిద్దిపేట ప్రతినిధి**

మహాలక్ష్మి పథకం అమలుతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ ఆటో కార్మికులను ఆదుకుంటామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే.. అక్రమ అరెస్టులు చేయడం దారుణమని బీఆర్టీయూ (బీఆర్టీయూ) జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, ఆటో జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం 'చలో అసెంబ్లీ' ముట్టడికి ఆటో జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శాంతియుతంగా వెళ్తున్న ఆటో కార్మికులను పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా పిండి అరవింద్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు 32 మంది ఆటో డ్రైవర్లు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన డ్రైవర్ల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా (పరిహారం) చెల్లించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం (ఉచిత బస్సు ప్రయాణం) వల్ల తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు, మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా జీవన భృతి కింద నెలకు రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, అర్హులైన కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక, కుటుంబ పోషణ కోసం ఫైనాన్స్‌లో ఆటోలు తీసుకుని నడుపుకుంటున్న కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ విధానాలు "మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా" మారాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్టీయూ పట్టణ అధ్యక్షుడు బాయికాడ శ్రీనివాస్, సంజు ఆటో వెల్ఫేర్ సొసైటీ ఇంచార్జ్ ఆకుల తిరుపతి, పట్టణ క్యాషియర్ జి. కిషన్, ముస్తాబాద్ చౌరస్తా ఆటో అధ్యక్షుడు బాలరాజ్ చంద్రారెడ్డి, అడ్డా అధ్యక్షులు ఎండీ బాబా షాదుల్, ఆటో డ్రైవర్లు కర్రోళ్ల పరిసరాములు, మహమ్మద్ సాజిద్, ఎస్. మధు, కరుణాకర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి.. లేదంటే జరిమానా!



- సిద్దిపేటలో రవాణా శాఖ వినూత్న అవగాహన
- నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారిద్దాం
- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నారాయణ పిలుపు

**మనసులో మాట - సిద్దిపేట ప్రతినిధి**

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారులు శుక్రవారం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చైతన్యం కలిగించేందుకు ర్యాలీలు నిర్వహించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డీటీఓకార్యాలయం నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో అధికారులు, సిబ్బంది హెల్మెట్లు ధరించి వాహనాలు నడుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పాఠశాల విద్యార్థులతో కలిసి సిద్దిపేట పాత బస్టాండ్ నుంచి విక్టరీ టాకీస్ చౌరస్తా వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత, హెల్మెట్ ఆవశ్యకతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. మరోవైపు వేములవాడ కమాన్ రోడ్డు సమీపంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. అనంతరం వారికి రోడ్డు భద్రతకు సంబంధించిన అవగాహన పత్రాలను (కరపత్రాలను) పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) శంకర్ నారాయణ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటిస్తూ సిద్దిపేట జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, దీనివల్ల అనుకోకుండా ప్రమాదాలు జరిగినా తలకు గాయాలు కాకుండా ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులతో రహదారి భద్రతపై ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నారాయణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) శ్రీకాంత్ రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ రవీందర్, హోమ్ గార్డులు అష్రఫ్, వెంకటేష్, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాల వేటలో రెబల్ అభ్యర్థులు

**మాజీ జెడ్పీటీసీ కమల్ కిషోర్ నివాసంలో కాంగ్రెస్ కార్యకర్తల భేటీ**

**కష్టపడ్డ వారికి టికెట్లు ఇవ్వాల్సిందే: విమల్ కిషోర్ సేఠ్**

**సీనియర్లను పక్కన పెట్టడం సరికాదని ఆవేదన**



**జుక్కల, జనవరి 3 (మనసులో మాట):**

బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో టికెట్ల లొల్లి మొదలైంది. గెలుపు గుర్రాలకే అవకాశం ఇవ్వాలంటూ అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. శనివారం మాజీ జెడ్పీటీసీ కమల్ కిషోర్ నివాసంలో విమల్ కిషోర్ సేఠ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పక్కన పెడితే ఊరుకోం.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్యే, ఎంపీల వెంట తిరిగి అహర్నిశలు శ్రమించామని గుర్తుచేశారు. అయితే, అనివార్య కారణాల వల్ల పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ కార్యకర్తలను కొందరు పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన సీనియర్లకు, ముఖ్య కార్యకర్తలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పోటీకి సై.. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత, పార్టీ బీ-ఫారం ఇస్తే దానికి కట్టుబడి పని చేస్తామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల ప్రకటన తర్వాత పోటీకి సిద్ధంగా ఉన్నామని, గెలుపు దిశగా కష్టపడతామని విమల్ కిషోర్ ధీమా వ్యక్తం చేశారు. పాల్గొన్న వారు ఈ కార్యక్రమంలో హాజీ బాల్రాజ్, పుల్లన్ విట్టల్, పాషా సేఠ్, అవర్ సురేష్, ఇతర కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.




# జీవనశైలి మార్పులతోనే ఆరోగ్యం.. వ్యాధులపై అప్రమత్తత అవసరం

**ఇందారం, టేకుమట్లలో వ్యాక్సినేషన్, అవగాహన సదస్సు**

**30 ఏళ్లు దాటిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు**

**మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్**

**జైపూర్, జనవరి 3 (మనసులో మాట):**

ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ సూచించారు. శనివారం జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎండీ ఫయాజ్, ఉపసర్పంచ్ శివ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్, అసంక్రమణ వ్యాధులపై (నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్క వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్ ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ అసంక్రమణ వ్యాధులైన బీపీ (రక్తపోటు), డయాబెటిస్ (మధుమేహం), క్యాన్సర్ వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జీవనశైలిలో మార్పుల ద్వారా వచ్చే ఈ వ్యాధులను ముందుగానే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు సరైన సమయంలో మందులు వాడాలని కోరారు. చలికాలం ఉన్నందున న్యుమోనియా, ఇతర శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా అంటువ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. టేకుమట్లలో పర్యవేక్షణ అనంతరం టేకుమట్ల గ్రామంలో పర్యటించి, అక్కడ ఆరోగ్య కార్యకర్త పద్మ ఆధ్వర్యంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సూపర్ వైజర్ జ్యోతి కృష్ణవేణి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి, పద్మ, భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు ఉమశ్రీ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట కేజీబీవీలో విషాదం

**విద్యార్థిని అనుమానాస్పద మృతి**

**నిద్రలోనే అచేతనంగా మారిన ఏడవ తరగతి చిన్నారి**

**మొన్నటి వరకు బాగానే ఉంది.. ఇంతలోనే ఏమైందో: తండ్రి ఆవేదన**

**పాఠశాల వద్ద ఉద్రిక్తత.. విచారణ చేపట్టిన పోలీసులు**



**మనసులో మాట-సిద్దిపేట**

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి-ఎల్లువల్లి పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏడవ తరగతి చదువుతున్న హర్షిని అనే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. అసలేం జరిగింది? పాఠశాల హాస్టల్‌లో శుక్రవారం రాత్రి హర్షిని పడుకున్న చోట కదలకుండా ఉండటాన్ని తోటి విద్యార్థులు గమనించారు. వెంటనే భయంతో పాఠశాల సిబ్బందికి సమాచారం అందించారు. అప్రమత్తమైన సిబ్బంది హర్షినిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు.. బెజ్జంకి మండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన హర్షిని మరణవార్త విన్న తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తన బిడ్డ మృతిపై తండ్రి తిరుపతిరెడ్డి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. "నా బిడ్డ పూర్తిగా ఆరోగ్యంగా ఉంది. సోమవారం వచ్చి చూసినప్పుడు కూడా ఎలాంటి అనారోగ్య సమస్య లేదు. ఇంతలోనే ఇలా ఎలా జరిగిందో అర్థం కావడం లేదు. బంగారు లాంటి నా బిడ్డ ఇక నాకు దక్కదు" అంటూ ఆయన రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసుల విచారణ బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెల్లడించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# షిరిడీ సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**మాధవి లత, లలిత్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**ఆధారాలు లేని ఆరోపణలతో మనోభావాలు దెబ్బతీస్తున్నారు**

**బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో సాయి భక్తుల ఫిర్యాదు**



**జుక్కల్, జనవరి 3 (మనసులో మాట):**

షిరిడీ సాయిబాబాపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాధవి లత, లలిత్ కుమార్‌లపై బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తమ ఆరాధ్య దైవమైన సాయిబాబాపై అసత్య ప్రచారాలు చేస్తూ, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక సాయి భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. తాము హిందువులమని, రాముడు, కృష్ణుడితో పాటు సాయిబాబాను కూడా అంతే భక్తిశ్రద్ధలతో పూజిస్తామని తెలిపారు. అయితే, ఇటీవల మాధవి లత, లలిత్ కుమార్ లు సాయిబాబాను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. "సాయిబాబా ఆఫ్ఘన్ ముస్లిం అని, ఝాన్సీ లక్ష్మీబాయిని చంపడానికి బ్రిటిష్ వారు పంపిన ఏజెంట్" అని ఎటువంటి చారిత్రక ఆధారాలు లేని పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా, సమాజంలో శాంతికి భంగం కలిగిస్తున్నాయని అన్నారు. మత సామరస్యానికి ప్రతీక బాబా సాయిబాబా అన్ని మతాల వారికి, అన్ని ప్రాణులకు సమానమైన ప్రేమను పంచారని, మత సామరస్యం కోసం ఎంతో కృషి చేశారని భక్తులు గుర్తు చేశారు. బాబా ఒక మతానికి చెందినవారు అని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని షిరిడీ సంస్థాన్ ట్రస్ట్, హైకోర్టు తీర్పులు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బిచ్కుంద పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

# సస్పెక్ట్‌ల కదలికలపై గట్టి నిఘా

**నేరాల నివారణ కోసమే తనిఖీలు: బిచ్కుంద ఎస్ఐ మోహన్ రెడ్డి**



**జుక్కల్, జనవరి 03 (మనసులో మాట):**

బిచ్కుంద మండలంలోని పాత నేరస్తులు, అనుమానితుల (సస్పెక్ట్‌ల) కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ఎస్ఐ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సస్పెక్ట్‌ల ఇళ్లకు వెళ్లి వారిని తనిఖీ చేశారు. వారి నడవడిక, ప్రస్తుతం వారు చేస్తున్న పనులు, కుటుంబ జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో నేరాలు, దొంగతనాల నియంత్రణ కోసమే సస్పెక్ట్‌లపై ఈ నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. వారు మరోసారి నేరాల బాట పట్టకుండా, సరైన జీవన విధానాన్ని ఎంచుకునేలా చూడడమే తమ ఉద్దేశమన్నారు. అనుమానితుల కదలికలపై ఎల్లవేళలా పోలీసుల నిఘా ఉంటుందని, ఏమాత్రం అనుమానాస్పదంగా కనిపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సస్పెక్ట్‌లు సత్ప్రవర్తనతో మెలుగుతూ సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల 'చలో హైదరాబాద్'

**5 నెలలుగా జీతాలు లేవు.. హామీలు నెరవేర్చాలి**

**కొత్త చట్టంతో కూలీలకు నష్టం.. విధానాన్ని రద్దు చేయాలి**

**మహాధర్నాకు తరలివెళ్లిన కోహెడ మండల సిబ్బంది**



**కోహెడ, జనవరి 03 (మనసులో మాట):**

తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సమరశంఖం పూరించారు. హైదరాబాద్‌లో తలపెట్టిన 'మహాధర్నా' కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం కోహెడ మండలానికి చెందిన వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షులు రాజు మాట్లాడుతూ.. తాము గత 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్నామని, అయినా తమ బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఎఫ్‌టీఈ (ఖీజు) అమలు చేయడం లేదని విమర్శించారు. గత ఐదు నెలలుగా జీతభత్యాలు రాక కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కొత్త విధానంతో ముప్పు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ ఆర్‌ఎంజీ నూతన చట్టం వల్ల ఉపాధి కూలీలకు, సిబ్బందికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాజు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధుల చెల్లింపు నిబంధన వల్ల కూలీలకు అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే ఈ కొత్త విధానాన్ని రద్దు చేసి, ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రాజుతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు ఎల్లయ్య, మల్లేశం, ధర్మయ్య, లక్ష్మీరాజ్యం, భాగ్య, సంతోష్, సౌభాగ్య తదితరులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

# హస్గుల్ గ్రామంలో హోరాహోరీగా కుస్తీ పోటీలు

**ఘనంగా మత్తడి పోచమ్మ జాతర.. పోటెత్తిన భక్తజనం**

**మహారాష్ట్ర, కర్ణాటక నుంచి తరలివచ్చిన మల్లయోధులు**

**విజేతకు నగదు బహుమతి ప్రదానం**





**జుక్కల్, జనవరి 3 (మనసులో మాట):**

బిచ్కుంద మండలం హస్గుల్ గ్రామంలో మత్తడి పోచమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జాతర సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ కుస్తీ పోటీలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక కల్హేర్, నారాయణఖేడ్, పిట్లం ప్రాంతాల నుంచే కాకుండా.. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా మల్లయోధులు (పహిల్వాన్లు) భారీగా తరలివచ్చారు. మల్లయోధుల మధ్య సాగిన కుస్తీ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగాయి. చివరి రౌండ్ కుస్తీలో గెలిచిన విజేతకు నిర్వాహకులు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో బిచ్కుంద పోలీసు సిబ్బంది, హస్గుల్ గ్రామ సర్పంచ్ నయూమ్ పటేల్, మైముద్ పటేల్, గ్రామ మాజీ సర్పంచ్ వై. మారుతి, మునీర్, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిని చేసేదాకా విశ్రమించొద్దు

- జిల్లా కమిటీల్లో మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం ఇవ్వాలి
- రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలి
- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపు




**సంగారెడ్డి, జనవరి 03 (మనసులో మాట):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిని చేసే వరకు కార్యకర్తలు పట్టుదలతో, దీక్షతో పనిచేయాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని పీఎస్సార్ గార్డెన్‌లో నిర్వహించిన 'తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమ్మేళనం'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గిరిజన కార్పొరేషన్ చైర్మన్, నేషనల్ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఉమ్మడి మెదక్ జిల్లా శిక్షణా తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ శిక్షణా తరగతుల్లో మహిళలకు కనీసం 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. త్వరలో ఏర్పాటు కానున్న జిల్లా కమిటీల్లో మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ఒక్కో కమిటీలో కనీసం 30 మంది మహిళలు ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించేలా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. మెదక్ జిల్లాకు గొప్ప రాజకీయ చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఇందిరాగాంధీని ఎంపీగా గెలిపించి, దేశానికి ప్రధానమంత్రిని అందించిన ఘనత ఈ జిల్లాదేనని అన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే దానికి ఆద్యురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక అవమానాలు, అడ్డంకులు ఎదుర్కొని సమాజ శ్రేయస్సు కోసం పోరాడిన ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చదువుతోనే సంస్కారం, సంపద వస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి 141 సంవత్సరాల ఘన చరిత్ర ఉందని, ఆదివాసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేలా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు. సమాజానికి దూరంగా ఉన్న వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తెచ్చి హక్కులు కల్పించింది కాంగ్రెస్సేనని గుర్తుచేశారు. శిక్షణా తరగతులను కార్యకర్తలు సద్వినియోగం చేసుకుని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాజ్యాంగ రక్షణ మన బాధ్యత దేశంలో గాంధీ పేరును మార్చాలనుకునే వారు, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని చూసే శక్తులు ఉన్నాయని మండిపడ్డారు. అలాంటి శక్తులను, నాయకులను ఎదుర్కొనే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి



- ప్రతి వార్డులో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ శ్రేణులకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దిశానిర్దేశం

**సంగారెడ్డి, జనవరి 3 (మనసులో మాట):**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి పురపాలక సంఘంపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కార్యదర్శి అధ్యక్షతన పట్టణంలోని వార్డుల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో ముందుకు సాగాలి.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు, నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి వార్డులో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. రిజర్వేషన్లు ఎలా వచ్చినా ఐక్యంగా, కలిసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల్లోకి అభివృద్ధి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఆ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తే మున్సిపల్ ఎన్నికల్లో విజయం మనదేనని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయేది మన ప్రభుత్వమే.. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం లేదని అధైర్యపడాల్సిన అవసరం లేదని, రానున్నది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీ తరఫున మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో హక్కీమ్, మాజీ సీడీసీ చైర్మన్లు విజేందర్ రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, మందుల వరలక్ష్మి, డాక్టర్ శ్రీహరి, వేణుగోపాల స్వామి, లక్ష్మి, ఇతర పట్టణ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# గట్టు మల్లన్న క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

**- భక్తుల సౌకర్యార్థం సకల వసతులు కల్పిస్తాం - ఎం.పి. లాడ్స్ నిధులు కేటాయిస్తాం: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ - ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ**

**జైపూర్, జనవరి 3 (మనసులో మాట):**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గట్టు మల్లన్న స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. శనివారం ఆయన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.సి. అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు, ఆలయ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ముఖ్యంగా ఆలయానికి రహదారి నిర్మాణానికి సంబంధించిన అటవీ శాఖ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధి కోసం తన ఎం.పి. లాడ్స్ (నిధుల) కింద నిధులు కేటాయిస్తానని వంశీకృష్ణ హామీ ఇచ్చారు. అలాగే, ఇకపై ప్రతి పౌర్ణమికి 'గిరి ప్రదక్షిణ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి



తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. భక్తులతో సహపంక్తి భోజనం అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. సామాన్య భక్తులతో కలిసి కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉప తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పొన్నాల ఊర చెరువులో మత్స్యకారుల జీవన పోరాటం

## తెల్లవారుజామునే వేటకు పయనం.. కుటుంబ పోషణే లక్ష్యం



**ప్రభుత్వ ఆదుకోవాలని విజ్ఞప్తి**

**మనసులో మాట - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని ఊర చెరువులో మత్స్యకారుల జీవన చిత్రం కదిలిస్తోంది. పొట్టకూటి కోసం తెల్లవారుజామునే చెరువు బాట పడుతున్న గంగపుత్రులు, తెప్పల సాయంతో చేపల వేటలో నిమగ్నమవుతున్నారు. సూర్యోదయం కాకముందే చెరువు ఒడ్డుకు చేరుకుని, తమ జీవనోపాధి కోసం శ్రమిస్తున్న వారి దృశ్యం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. నిత్యం జీవన సమరం 'రెక్కాడితే గానీ డొక్కాడదు' అన్న సామెతకు వీరి బతుకులే నిదర్శనం. రోజు గడవాలంటే నీటిలోకి దిగాల్సిందే. చలి, వాన, ఎండ అన్న తేడా లేకుండా నిత్యం శ్రమిస్తున్నారు. కుటుంబ పోషణే లక్ష్యంగా, నీటిలో ఉండే ప్రమాదాలను సైతం లెక్కచేయకుండా తెప్పలపై చెరువు మధ్యకు చేరుకుని వలలు వేస్తున్నారు. దాని ద్వారా వచ్చిన ఆదాయంతోనే వారి కుటుంబాలు నెట్టుకొస్తున్నాయి. ప్రకృతితో మమేకమై.. మారుతున్న కాలంలో వృత్తి కష్టతరంగా మారినా, తమ సంప్రదాయాన్ని వదలకుండా కొనసాగించడం మత్స్యకారుల జీవన స్ఫూర్తికి అద్దం పడుతోంది. ప్రకృతితో మమేకమై సాగుతున్న వీరి జీవన విధానం గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తోంది.

# వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్




## వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్

**న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన**

**రిషబ్ పంత్‌కు బీసీసీఐ మరోసారి అవకాశం**

**పర్యటనలో మూడు వన్డేలు ఆడనున్న భారత్**

**మొదటి వన్డే జనవరి 11న వడోదరలో ప్రారంభం**

న్యూజిలాండ్‌తో త్వరలో జరిగే వన్డే సిరీస్‌కు బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును అధికారికంగా ప్రకటించింది. వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్ కాగా.. శ్రేయస్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించింది. అంతేకాకుండా వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు కూడా బీసీసీఐ అవకాశం ఇచ్చింది.అయితే వన్డే సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ ఎంపికైనా.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే అతడు తుది జట్టులో ఉండి మ్యాచ్‌లు ఆడతాడు. అలాగే, హార్దిక్ పాండ్యా ఒక మ్యాచ్‌లో పది ఓవర్లు బౌలింగ్ చేయడానికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఇంకా అనుమతి పొందలేదు. ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్ ఉండటంతో అతడిపై పడే భారాన్ని కంట్రోల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పేర్లు లేకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే హార్దిక్‌ను ఎందుకు ఎంపిక చేయలేదనే విషయంపై బీసీసీఐ స్పష్టతనిచ్చింది. పాండ్యాను వన్డే సిరీస్‌కు దూరం పెట్టడం వెనుక ఉన్న ప్రధాన కారణం ఆయన 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్' అని బీసీసీఐ తెలిపింది. ఒక వన్డే మ్యాచ్‌లో హార్దిక్ వరుసగా 10 ఓవర్లు బౌలింగ్ చేసేంత ఫిట్‌నెస్‌తో ప్రస్తుతం లేరని, వైద్య బృందం ఆయనకు పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయడానికి అనుమతి ఇవ్వలేదని సమాచారం. 2026లో జరగనున్న ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, హార్దిక్ కీలక ఆటగాడు కాబట్టి ఆయనపై ఒత్తిడి పడకుండా విశ్రాంతిని ఇచ్చారు. బుమ్రా విషయంలో కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించారు. వెన్ను గాయం కారణంగా గత కొంతకాలంగా ఆటకు దూరమైన శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వచ్చారు. అంతేకాకుండా ఆయనకు వైస్ కెప్టెన్ బాధ్యతలను కూడా అప్పగించారు. అయితే ఆయన ఆడటం అనేది ఫిట్‌నెస్ రిపోర్టుపై ఆధారపడి ఉంటుంది.సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఈ వన్డే సిరీస్‌లో భాగమయ్యారు. వెటరన్ పేసర్ మహ్మద్ షమీని మరోసారి సెలక్టర్లు పక్కన పెట్టారు. అలాగే దక్షిణాఫ్రికాపై సెంచరీ చేసిన రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా చోటు దక్కలేదు. భారత్‌లో న్యూజిలాండ్




పర్యటనలో భాగంగా మూడు వన్డేలు జరుగుతాయి. మొదటి వన్డే జనవరి 11 (ఆదివారం)న వడోదరలో జరుగుతుంది. రెండో వన్డే జనవరి 14న (బుధవారం) రాజ్‌కోట్‌లో, మూడో వన్డే జనవరి 18 (ఆదివారం)న ఇండోర్‌లో జరగనుంది. ఇక టీ20 ప్రపంచకప్ 2026 కోసం ఎంపిక చేసిన జట్టే.. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఆడనుంది.

**భారత జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.



# శతక్కొట్టిన హార్దిక్ పాండ్యా..

**విదర్భతో మ్యాచ్‌లో 68 బంతుల్లో సెంచరీ**

**విజయ్ హజారే ట్రోఫీలో దుమ్ములేపుతున్న పాండ్యా..**

విజయ్ హజారే ట్రోఫీలో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా దుమ్ములేపుతున్నాడు. బరోడా తరుపున బరిలోకి దిగిన పాండ్యా విదర్భతో మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. కేవలం 68 బంతుల్లో అతడు సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు.రాజ్‌కోట్ వేదికగా బరోడా, విదర్భ జట్లు శనివారం తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన బరోడా జట్టు.. మొదట బ్యాటింగ్‌కు దిగింది. విదర్భ బౌలర్ల ధాటికి 71 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అమిత్ పాసీ (0), నిత్యా పాండే (15), ప్రియాన్షు మొలియా (16), అతిత్ షేత్ (21), జితేశ్ శర్మ (9)లు విఫలం అయ్యారు. ఈ దశలో ఏడో స్థానంలో హార్దిక్ పాండ్య (133; 92 బంతుల్లో 8 ఫోర్లు, 11 సిక్సర్లు) బ్యాటింగ్‌కు వచ్చాడు. తన సోదరుడు, కెప్టెన్ కృనాల్ పాండ్యా (23) పాండ్యాతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్నాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలో 44 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. ఆ తరువాత వేగం పెంచిన పాండ్యా మరో 24 బంతుల్లోనే మూడు అంకెల స్కోరు చేరుకోవడం గమనార్హం. కాగా.. లిస్ట్ ఏ క్రికెట్‌లో హార్దిక్‌కు ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. భారత్ తరుపున 94 వన్డేలు ఆడిన పాండ్యా వీటితో కలిపి 119 లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడాడు. 2020లో కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో 92 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇప్పటి వరకు అదే అతడికి అత్యధిక స్కోరు కాగా.. తాజా మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు.ఈ మ్యాచ్‌లో హార్దిక్ ఏడో నెంబర్లో బ్యాటింగ్‌కు వచ్చాడు. అతడు క్రీజులోకి వచ్చే సమయానికి బరోడా జట్టు 71 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితిలో హార్దిక్ నెమ్మదిగానే ఆడాడు. తొలుత నెమ్మదిగా ఆడినా ఆ తర్వాత పాండ్య గేరు మార్చాడు. ఒక దశలో 62 బంతుల్లో అతడు చేసింది 66 పరుగులే. కానీ, పార్థ్ రేఖడే వేసిన 38వ ఓవర్‌లో హార్దిక్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో అతడు వరుసగా ఐదు సిక్స్‌లు, ఒక ఫోర్ (6, 6, 6, 6, 6, 4) బాదేశాడు. ఏకంగా 34 పరుగులు వచ్చాయి. దీంతో ఇదే ఓవర్లో హార్దిక్ సెంచరీ కంప్లీట్ అయ్యింది. అలా ఆ ఓవర్‌కు ముందు 62 బంతుల్లో 66 పరుగులు చేసిన పాండ్య తదుపరి 6 బంతుల్లో సెంచరీని పూర్తి చేశాడు. కాగా, లిస్ట్ ఏ క్రికెట్‌లో హార్దిక్‌కు ఇదే తొలి సెంచరీ కావడం విశేషం.

# సంజూ శాంసన్ అద్భుతమైన సెంచరీ




కేరళ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మరోసారి తన బ్యాట్‌తో గర్జించాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26 సీజన్‌లో తాను ఆడిన మొదటి మ్యాచ్‌లోనే అద్భుతమైన సెంచరీతో కదం తొక్కాడు. న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం టీమిండియాను ఎంపిక చేస్తున్న తరుణంలో, సంజూ చేసిన ఈ సెంచరీ ఇప్పుడు సెలక్టర్లకు పెద్ద సవాలుగా మారింది. జార్ఖండ్‌తో జరిగిన ఈ హై-స్కోరింగ్ మ్యాచ్‌లో సంజూ క్లాస్ ఇన్నింగ్స్ ఫ్యాన్స్‌కు కనువిందు చేసింది. అహ్మదాబాద్ వేదికగా జార్ఖండ్‌తో జరిగిన ఐదో రౌండ్ పోరులో సంజూ శాంసన్ తన విశ్వరూపాన్ని చూపించాడు. జార్ఖండ్ నిర్దేశించిన 312 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేరళ ఓపెనర్ రోహన్ కున్నుమ్మల్ (124) తో కలిసి సంజూ ఇన్నింగ్స్‌ను పరిగెత్తించాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు ఏకంగా 212 పరుగుల రికార్డ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సంజూ కేవలం 90 బంతుల్లోనే తన సెంచరీ మార్కును అందుకున్నాడు. మొత్తం 95 బంతులు ఆడిన సంజూ, 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 101 పరుగులు చేసి టీమ్ ఇండియా సెలక్టర్లకు గట్టి సంకేతాలు పంపాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ జట్టులో కుమార్ కుశాగ్ర విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 137 బంతుల్లో 7 సిక్సర్లు, 8 ఫోర్లతో 143 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. జార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో నిరాశపరిచినప్పటికీ, కుశాగ్ర, అనుకూల్ రాయ్ (72) పుణ్యమా అని ఆ జట్టు 311 పరుగులు చేసింది. అయితే, ఇంత పెద్ద టార్గెట్‌ను కూడా సంజూ, రోహన్ జంట చాలా సులువుగా మార్చేశారు. రోహన్ కేవలం 78 బంతుల్లోనే 11 సిక్సర్లతో 124 పరుగులు చేయడం విశేషం. సంజూ శాంసన్ ఇప్పటివరకు భారత్ తరపున 16 వన్డేలు ఆడి 510 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గమనించదగ్గ విషయం ఏంటంటే.. వన్డేల్లో సంజూ స్ట్రైక్ రేట్ దాదాపు 100గా ఉంది. 2023 డిసెంబర్‌లో చివరిసారిగా వన్డే ఆడిన సంజూ, ఆ తర్వాత టీ20ల్లో మూడు సెంచరీలు బాది భీభత్సమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పుడు వన్డే ఫార్మాట్‌లో కూడా సెంచరీ సాధించడంతో, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్‌లతో పాటు మూడో వికెట్ కీపర్‌గా సంజూ పేరును సెలక్టర్లు పరిశీలించాల్సి ఉంటుంది. జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం బీసీసీఐ త్వరలోనే జట్టును ప్రకటించనుంది. సాధారణంగా వన్డేల్లో పంత్, రాహుల్‌లకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది. కానీ, సంజూ ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే అతడిని పక్కన పెట్టడం సెలక్టర్లకు తలకు మించిన భారమే. పైగా టాప్ ఆర్డర్‌లో ఎవరైనా సీనియర్లు విశ్రాంతి తీసుకుంటే, సంజూను ఒక స్పెషలిస్ట్ బ్యాటర్‌గానైనా జట్టులోకి తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

# 'బంగ్లా ఆటగాడిని రిలీజ్ చేయండి'

## కేకేఆర్‌కు బీసీసీఐ ఆదేశం





ఇండియన్ ప్రీమియర్ లీగ్ మినీ వేలంలో బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ముస్తాఫిజుర్‌ను తమ జట్టు నుంచి రిలీజ్ చేయాలని కేకేఆర్‌ను ఆదేశించింది. ఒకవేళ వారు ప్రత్యామ్నాయంగా మరొక ప్లేయర్‌ను కోరితే దానికి కూడా అనుమతిస్తుందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న తాజా పరిణామాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ నిర్ణయాన్ని బీజేపీ నేత సంగీత్ సింగ్ సోమ్ స్వాగతించారు. భారతదేశంలోని 100 కోట్ల మంది సనాతనుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలని తెలిపారు. 100 కోట్ల మంది భావోద్వేగాలను తేలికగా తీసుకోలేమని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న హిందువుల విజయమని అన్నారు. సనాతనుల మనోభావాలకు విరుద్ధంగా వెళ్లకూడదని ఎస్‌ఆర్‌కే అర్థం చేసుకున్నారని అన్నారు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో రికార్డు ధర రూ.9.2 కోట్లకు ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ దక్కించుకుంది. రెహమాన్ 2016లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 60 మ్యాచ్‌లాడి 65 వికెట్లు తీశాడు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు మొదలయ్యాయి. ఈ విషయంపై గురువారం బీసీసీఐ వర్గాలు స్పందించినట్లు వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకుమించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి. తాజాగా జట్టు నుంచి రిలీజ్ చేయాలని ఆదేశించింది. దీంతో కేకేఆర్ ముస్తాఫిజుర్ స్థానంలో సరైన ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఈ వివాదల వేళ తమ జట్టు ఆడే సిరీస్‌లపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కీలక ప్రకటన చేసింది. అందులో భారత్‌తో షెడ్యూల్‌ను కూడా ఉంది. భారతతో ఆగస్టు-సెప్టెంబరు మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడనున్నట్లు పేర్కొంది. గత ఏడాది రెండు జట్ల మధ్య సిరీస్‌లు జరగాల్సి ఉండగా, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ ఆగస్టు టూర్‌తో అది భర్తీ కానుందని బీసీబీ ప్రకటించింది. మరోవైపు ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ తీసుకోవడంపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఈ ఎంపికపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా కేకేఆర్ సహ యజమాని షారుక్ ఖాన్‌పై ఆధ్యాత్మిక గురువు దేవకీనందన్ ఠాకూర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు హత్యలు, దాడులకు గురవుతున్న పరిస్థితుల్లో అక్కడి ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం అమానుషమని అన్నారు. షారుక్ ఖాన్ దేశానికి క్షమాపణ చెప్పాలని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇలియాసి డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండిస్తూ ప్రకటన చేయాలని, ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి తొలగించాలని ఆయన కోరారు. శివసేన నేత సంజయ్ నిరుపమ్ కూడా షారుక్ ఖాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. దేశమంతా బంగ్లాదేశ్‌పై ఆగ్రహంగా ఉందని, ఇలాంటి సమయంలో బంగ్లాదేశీ ఆటగాడు జట్టులో ఉంటే, అది షారుక్ ఖాన్‌కే ప్రమాదంగా మారొచ్చని అన్నారు. ఈ వివాదంపై కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేత్ స్పందించారు. 'ముందుగా బంగ్లాదేశీ ఆటగాళ్లను ఐపీఎల్ వేలంలోకి ఎవరు అనుమతించారు? దీనికి బీసీసీఐ, ఐసీసీ సమాధానం చెప్పాలి. ఐసీసీ చీఫ్ దీనిపై స్పష్టత ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

# ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు సెంచరీలు

**రికార్డులు తిరగరాస్తున్న పడిక్కల్**

**విజయ్ హజారే ట్రోఫీలో అద్భుత సెంచరీ**



టీమిండియా తలుపు తడుతున్న మరో యువ కెరటం దేవదత్ పడిక్కల్. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ 2025-26 సీజన్‌లో పడిక్కల్ తన బ్యాట్‌తో పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. శనివారం త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో పడిక్కల్ మరో అద్భుతమైన సెంచరీ బాదాడు. కేవలం ఐదు మ్యాచ్‌ల్లోనే ఇది ఆయనకు నాలుగో సెంచరీ కావడం విశేషం. ఈ అసాధారణ ఫామ్ చూస్తుంటే, త్వరలో జరగబోయే న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో పడిక్కల్‌కు చోటు ఖాయమనిపిస్తోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో త్రిపురతో జరిగిన ఐదో రౌండ్ మ్యాచ్‌లో కర్ణాటక ఓపెనర్ దేవదత్ పడిక్కల్ క్లాస్ ఇన్నింగ్స్ ఆడాడు. మొదట బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టుకు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (5), కరుణ్ నాయర్ (0) ఒకే ఓవర్లో అవుట్ కావడంతో జట్టు కష్టాల్లో పడింది. అయితే పడిక్కల్ ఏమాత్రం తొందరపడకుండా స్మరణ్ రవిచంద్రన్ (70) తో కలిసి మూడో వికెట్‌కు 136 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 120 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 108 పరుగులు చేసి జట్టు 332 పరుగుల భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సీజన్‌లో పడిక్కల్ ఫామ్ చూస్తుంటే బౌలర్లు గజగజ వణికిపోతున్నారు. టోర్నీలో ఆయన జార్ఖండ్‌పై 147 పరుగులు, కేరళపై 124 పరుగులు, పుదుచ్చేరిపై 113 పరుగులు, తాజాగా త్రిపురపై 108 పరుగులు. కేవలం తమిళనాడుపై మాత్రమే 22 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. ఒకే టోర్నమెంట్‌లో వరుసగా సెంచరీలు బాదుతూ విరాట్ కోహ్లీ, పృథ్వీ షా వంటి ఆటగాళ్ల రికార్డుల సరసన చేరుతున్నాడు. పడిక్కల్ క్లాసిక్ బ్యాటింగ్ స్టైల్ చూస్తుంటే ప్రత్యర్థి జట్టుకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దేవదత్ పడిక్కల్ కేవలం ఈ టోర్నీలోనే కాదు, ఓవరాల్‌గా లిస్ట్-ఏ (వన్డే ఫార్మాట్) క్రికెట్‌లో భీభత్సమైన రికార్డు కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన 37 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 13 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలు బాదాడు. అంటే ఆడిన ప్రతి మూడు ఇన్నింగ్స్‌ల్లో ఒక సెంచరీ చేస్తున్నాడన్నమాట. ఆయన బ్యాటింగ్ సగటు 80 కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇంతటి కన్సిస్టెన్సీ ఏ ఇతర యువ ఆటగాడిలోనూ కనిపించడం లేదు. అందుకే ఆయనను టీమ్ ఇండియాలో చేర్చుకోవాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. దీనికోసం బీసీసీఐ సెలక్టర్లు త్వరలోనే జట్టును ప్రకటించబోతున్నారు. వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అనారోగ్యం, ఇతర సీనియర్ల విశ్రాంతి వంటి కారణాల వల్ల పడిక్కల్‌కు ఓపెనర్‌గా లేదా మూడో నంబర్‌లో అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉంది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న ఈ కుర్రాడికి ఇప్పుడు అవకాశం ఇవ్వకపోతే అన్యాయం చేసినట్టే అని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మన శంకరవరప్రసాద్ గారు కౌంట్‌డౌన్ పోస్టర్ విడుదల



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.



## రజనీతో కమల్ మూవీ
### డైరెక్టర్‌గా శిబి చక్రవర్తి

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.

## చైతన్యరావు దిల్ దియా మూవీ పోస్టర్ విడుదల




కీడా కోలా, ఘాటి సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో చైతన్య రావు ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఆయన కథానాయకుడిగా దర్శకుడు కె. క్రాంతి మాధవ్ కాంబినేషన్‌లో ఒక నూతన చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు 'దిల్ దియా' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చైతన్య సోఫాలో నగ్నంగా కూర్చోవడం చాలా విభిన్నంగా అనిపిస్తుంది. ఈ సినిమా థీమ్‌ను ప్రతిబింబించేలా ఫస్ట్ లుక్ ఉండటంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. చైతన్య రావు ఈ సినిమాలో గత చిత్రాల కంటే భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండటం విశేషం. శ్రియాస్ చిత్రాస్, ఎ.పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. క్రాంతి మాధవ్ మార్క్ ఎమోషన్స్, చైతన్య రావు నటన ఈ సినిమాకు ప్రధాన బలం కానున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ మరియు విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

## గందరగోళంలోకి నెట్టేసిన శ్రద్ధా

'సాహో' చిత్రంతో తెలుగు వారికి సుపరిచితమైన నటి శ్రద్ధా కపూర్. తనదైన అందం, నట ప్రతిభతో యువహృదయాలను గెలుచుకున్న ఈ బ్యూటీని ఆరాధించని బోయ్స్ లేరంటే అతిశయోక్తి కాదు. శ్రద్ధా ఇటీవల స్త్రీ2 లోను అద్భుత నటనతో ఆకట్టుకుంది. హారర్ సినిమాలో శ్రద్ధా నటనకు మంచి మార్కులే పడ్డాయి. తదుపరి క్రిష్ 4లోను శ్రద్ధా కపూర్ నటించనుంది. ఇక శ్రద్ధా నిరంతర ఇన్ స్టా పోస్టులు ఇంటర్నెట్ లో హాట్ టాపిగ్గా మారుతున్నాయి. ఈ భామ తాజాగా పింక్ ఫ్రాక్ ధరించిన ఓ అందమైన ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసి, దాంతో పాటే ఒక కొటేషన్ కూడా ఇచ్చింది. "గులాబ్ అంటే గులాబీ, గులాబీలు ఎరుపు, ఎరుపు అంటే లాల్, కానీ గులాబీ అంటే పింక్? సరైన గందరగోళం" అని ఒక కవితను రాసింది. అయితే ఈ కవిత్వం పాఠకుల్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టింది. శ్రద్ధాను సోషల్ మీడియాల్లో అనుసరిస్తున్న లక్షలాది మంది కన్ఫ్యూజన్ లోకి వెళ్లిపోయారు. ఈ రంగు-పద విరుద్ధతను హైలైట్ చేసిన విధానం ఆకర్షణీయంగా ఉన్నా, శ్రద్ధా లోతైన పరిభాషను అర్థం చేసుకోవడం కుర్రాళ్ల వల్ల కాలేదు. 'గులాబ్' అనే పువ్వుకు మూలం రోజ్. చాలా గులాబీలు ఎరుపు రంగులో ఉంటాయి... అని కూడా ఇందులో వివరంగా ఉంది. అయితే శ్రద్ధా విసిరిన పజిల్‌ను పూరించడానికి ప్రయత్నించిన అభిమానులు ఇంకా కన్ఫ్యూజన్ లోనే ఉన్నారు. శ్రద్ధా 9.3 కోట్ల మంది ఫాలోవర్లతో భారతీయ చిత్రపరిశ్రమలో క్రేజీ హీరోయిన్ గా వెలిగిపోతోంది. ఈ పోస్ట్ చేసిన మొదటి 60 నిమిషాల్లోనే 10,000 కంటే ఎక్కువ కామెంట్లు వినిపించాయి. ఈ పోస్ట్‌కి సోషల్ మీడియాల్లో ఫ్యాన్స్ ఛమత్కారంగా స్పందించారు. శ్రద్ధ మాత్రమే భాషా సంక్షోభాన్ని ఇంత సౌందర్యంగా కనిపించేలా చేయగలదు! అని ఒకరు రాసారు. చాలామంది ఆమె 'స్త్రీ' వ్యక్తిత్వాన్ని ప్రస్తావించారు. గులాబీ-గులాబీ తర్కం కంటే ఓ 'స్త్రీ' రహస్యాన్ని కనుగొనడం సులభం అని కొందరు సరదాగా వ్యాఖ్యానించారు. మొత్తానికి శ్రద్ధా ఫజిల్ తాలూకా గందరగోళం నుంచి బయటపడటం ఎవరి వల్లా కాలేదు!



## గ్లామర్‌తో కట్టిపడేస్తున్న కేతికా శర్మ..



ఈ మధ్యకాలంలో కాస్త సమయం దొరికితే చాలు హీరోయిన్స్ వెకేషన్ కి వెళ్తున్నారు. కొంతమంది ఫ్యామిలీతో వెళ్తే మరికొంతమంది సింగిల్ గా వెళ్లి తమ సమయాన్ని ఎంజాయ్ చేస్తూ ఉంటారు. ఇంకొంతమంది ఫ్రెండ్స్ తో వెళ్తూ అక్కడి వీధులు చుట్టేస్తూ మరింత ఆనందాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు చాలామంది షిప్ ప్రయాణం చేస్తూ అక్కడే తమ అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మరో బ్యూటీ కూడా షిప్ లో ప్రయాణిస్తూ తన అందాలను ఆరబోస్తూ ఫాలోవర్స్ ను ఉక్కిరిబిక్కిరి చేసింది. తన అందాలతో కుర్రాళ్లకు గాలం వేస్తూ చెమటలు పట్టించింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ బ్యూటీ కేతిక శర్మ. తాజాగా వెకేషన్ కి వెళ్ళిన ఈమె సముద్ర యానం చేస్తూ షిప్ నుండి కొన్ని ఫోటోలను ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. అందులో ఈమె షేర్ చేసిన ఫోటోలు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అమ్మడి అందాలకు ఫిదా అవుతున్నారు. చాలా రోజుల తర్వాత కేతిక శర్మ మంచి గ్లామర్ ట్రీట్ ఇచ్చిందని కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కేతిక శర్మ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ హల్చల్ చేస్తున్నాయి. చాలా రోజుల తర్వాత కేతిక ఇలా అందాలు ఆరబోయడంతో కామెంట్ బాక్స్ లో అభిమానులు ఫైర్ ఎమోజీలతో నింపేస్తున్నారు. 1995 డిసెంబర్ 24న ఇండియాలోని న్యూఢిల్లీలో జన్మించిన ఈమె చదువు పూర్తి అయిన తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ డబ్స్ మాష్ వీడియోల ద్వారా సోషల్ మీడియాలో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె.. ఈ వీడియోలతోనే దర్శకుల కంట్లో పడి కెరియర్ ను మొదలుపెట్టింది .తొలిసారి 2021లో పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరీ హీరోగా నటించిన రొమాంటిక్ అనే సినిమాలో హీరోయిన్గా అవకాశం దక్కించుకొని.. నటన రంగ ప్రవేశం చేసింది. ఈమె నటనపై విమర్శకులు ప్రశంసలు కురిపించడమే కాకుండా ఆశాజనకంగా నటించింది అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861